ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 04.05.2026 | సంపుటి :12 సంచిక : 284 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# నేడే ఐదు రాష్ట్రాల ఫలితాలు

## విజయంపై ఎవరి ధీమా వారిదే..





- బెంగాల్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- 11 జిల్లాల్లో హై అలర్ట్
- బెంగాల్ ఎన్నికల ఫలితాలపై జాతీయస్థాయిలో ఆసక్తి
- అధికార టీఎంసీ-బీజేపీ మధ్య హోరాహోరీగా సాగిన ప్రచారం
- ఇరు పార్టీల మధ్య గట్టిపోటీ నెలకొన్నట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఈ ఫలితాల ద్వారా కీలక రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, స్టాలిన్, విజయన్‌ల భవితవ్యం తేలనుంది. గతానికి భిన్నంగా ఆయా రాష్ట్రాల్లో ఈసారి భారీగా పోలింగ్ నమోదైంది. ఎగ్జిట్ పోల్స్ మిశ్రమ ఫలితాలను అందించడంతో ఈ రాష్ట్రాల్లో ఎవరు గెలుస్తారనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు

## అందరి దృష్టి 'భవానీపుర్'పేనే..

2లో..

ఫలితాల ప్రభావం జాతీయ రాజకీయాలపై ఉంటుందని అంచనా! దక్షిణాదిలో ఎర్రకోటగా పేరొందిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జాతీయ స్థాయిలో అందరి దృష్టి నెలకొంది. వరుసగా మూడోసారి అధికారం చేపట్టి రికార్డ్ సృష్టించాలని ఎల్‌డీఎఫ్ భావిస్తుండగా 2024 లోక్‌సభ ఎన్నికలు, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో ఆత్మవిశ్వాసంతో మిగతా 2లో..




తుంగతుర్తి మండలవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలకు మార్కెట్ యార్డులో తడుస్తున్న వరిధాన్యం.. ఈదురుగాలుల ధాటికి రోడ్డుపై నెలకొరిగిన భారీ వృక్షం

# రాష్ట్రవ్యాప్తంగా చెడగొట్టు వానలు

## పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు

- మార్కెట్‌యార్డుల్లో తడిసిన ధాన్యం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- తెలంగాణలో పలు జిల్లాల్లో వర్షం
- మహబూబ్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగుపాటుతో కార్మికుడి మృతి
- నేడు కూడా పలు జిల్లాల్లో వర్షాలు



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్లు ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఎండవేడిమితో అల్లాడుతున్న ప్రజలకు వర్షా లు కాస్త ఉపశమనం కల్పించాయి. పలు జిల్లాల్లో ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంబాలు నేలకొరిగాయి. మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో ఈదు రు గాలులు ఒక్కసారిగా బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా విపరీతమైన ఈదురుగాలుల తో కూడిన వర్షాలతో కోల్ బెల్ట్ రహదారిపై పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పలువురి ఇంటి పైకప్పు రేకులు మిగతా 2లో..



# నింగిలోకి దృష్టి

- విజయవంతంగా కక్ష్యలోకి ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ ఉపగ్రహం
- బెంగళూరుకు చెందిన అంతరిక్ష అంకుర సంస్థ గెలాక్స్‌ఐ రికార్డు

బెంగళూరుకు చెందిన అంతరిక్ష అంకుర సంస్థ గెలాక్స్‌ఐ పంపించిన 'దృష్టి' ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లింది. కాలి ఫోర్నియాలోని ప్రయోగ కేంద్రం నుంచి ఫాల్కన్- 9 రాకెట్ సాయంతో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు

9లో..



ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివారం మల్లారం వద్ద సిద్దిపేట-కరీంనగర్ రాజీవ్ రహదారిపై రైతులు ధర్నా.. రైతులకు సంఘీభావంగా నిరసనలో పాల్గొన్న హరీశ్‌రావు

# ధాన్యం కొనండి మహాప్రభో

- రోడెక్కిన అన్నదాతలు
- ఎరువులు కొనాలంటే యాప్.. వడ్లు కొనాలంటే ఆన్‌లైన్..
- రైతుల ఇబ్బందులపై హరీశ్‌రావు ఆగ్రహం

సిద్ధిపేట(జనంసాక్షి):తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం మల్లారం వద్ద సిద్దిపేట-కరీంనగర్ రాజీవ్ రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. రైతులకు సంఘీభావంగా హరీశ్‌రావు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు కానీ ఒక్క గింజ కూడా ప్రభుత్వం కొనడం లేదని మండిపడ్డారు. 28 రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదంటూ రైతులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. మొక్కజొన్న రైతులకు గన్నీ బ్యాగులు లేకపోతే రైతులు సొంతంగా బ్యాగులు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. 22 రోజులుగా సన్ ఫ్లవర్ గింజలను కొనుగోలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే కలెక్టర్లకు ఆర్డర్ మిగతా 2లో..

## కరీంనగర్‌లో పట్టపగలే బంగారం షాపులో

# దోపిడీ.. కాల్పులు

## కస్టమర్లలా వచ్చి.. నగలన్నీ కాజేసిన దుండగులు

- అడ్డువచ్చిన సిబ్బందిపై కాల్పులు జరిపి ఆభరణాలన్నీ దొంగిలించిన దుండగులు
- ముగ్గురు సిబ్బందికి గాయాలు
- సీపీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు

కరీంనగర్ బ్యూరో, మే 2 (జనంసాక్షి) కరీంనగర్‌లోని పీఎంజీ జ్యువెల్లరీ షాపులో కాల్పులు కలకలం సృష్టించాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బైకులపై వచ్చిన ఐదుగురు దుండగులు కస్టమర్లలా దుకాణంలోకి ప్రవేశించారు. నగలు చూపించిన తర్వాత.. గన్‌తో బెదిరించారు. సిబ్బందిపై కాల్పులు జరిపి నగలను దోచుకెళ్లారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు సిబ్బందికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు, చోరీ మిగతా 2లో..



జ్యువలర్స్ షాపు సిబ్బందిని గన్‌తో బెదిరించి నగలు దొంగిలిస్తున్న దుండగులు



జ్యువలర్స్ షాపులో ఘటనా స్థలాన్ని పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీపీ గౌస్ ఆలం

## లక్షల మంది విద్యార్థులకు సీఎం

# వెన్నుపోటు

- కేసీఆర్ స్కీమ్‌లకే కాదు.. వైఎస్ఆర్ పథకాలనూ ఆపేస్తారా..?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటీఆర్ లేఖ



హైదరాబాద్(జనంసాక్షి): 14లక్షల మంది విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేసేందుకే చీకటి జీవో 7ను తీసుకొచ్చారని మండిపడ్డారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఘాటు లేఖ రాశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తును అంధకారం లోకి నెట్టాడని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. విద్యాశాఖను విధ్వంసం చేసేందుకే నీ దగ్గర పెట్టుకున్నావా అని నిలదీశారు. కేసీఆర్ స్కీమ్‌లకే కాదు.. వైఎస్ఆర్ పథకాలకూ పాతరేస్తావా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.' రెండున్నరేళ్ల మీ అసమర్థ పాలనలో ఇప్పటికే విద్యావ్యవస్థను కుప్పకూల్చి క్షమించరాన్ని పాపాన్ని మూటగట్టుకున్నారు. ఇప్పుడు ఏకంగా ఉన్నత చదువులకు నిరుపేదలను పూర్తిగా దూరం చేసేలా విద్యార్థులకు వెన్నుపోటు పొడుస్తారా? రాష్ట్రంలోని 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు కొండంత అండగా నిలిచే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని రద్దుచేసేలా మీరు చేస్తున్న కుట్ర భయంకరమైనది. మీ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 7 ముమ్మాటికీ ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ తెలంగాణ సమాజానికి అర్థమైపోయింది. మిగతా 2లో..




## ఆర్టీఐ కింద జీవిత భాగస్వామి ఆదాయం

# వివరాలు పొందలేరు

## ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి): సమాచార హక్కు చట్టం కింద ఒక వ్యక్తి తన జీవిత భాగస్వామి ఆదాయ వివరాలు పొందలేరని దిల్లీ హైకోర్టు ఓ కేసులో తీర్పు చెప్పింది. ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అంశం అయితే తప్ప.. ఈ చట్టంలోని సెక్షన్ 8(1)(జే) కింద వ్యక్తిగత సమాచార వెల్లడికి మినహాయింపు ఉందని పేర్కొంది. గతంలో సుప్రీం కోర్టు వెలువరించిన ఓ తీర్పు ప్రకారం.. ఒక వ్యక్తి ఆదాయపు పన్ను రిటర్న్‌లు కూడా దీని కిందికే వస్తాయని జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ స్పష్టం చేశారు. భర్తకు దూరంగా ఉంటున్న మిగతా 2లో..

## సంఘర్షణ ముగింపునకు ఇరాన్

# 14 ప్రతిపాదనలు

- పాకిస్థాన్ ద్వారా అమెరికాకు పంపిన టెహ్రాన్
- యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే తమ ప్రతిపాదనల లక్ష్యం
- ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ
- టెహ్రాన్ ప్రతిపాదనలపై త్వరలో సమీక్షిస్తా: అమెరికా అధ్యక్షుడు ట్రంప్



టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంఘర్షణను ముగించేందుకు ఇరాన్ 14 పాయింట్లతో కొత్త ప్రతిపాదనలను తెంపైకి తెచ్చింది. పాకిస్థాన్ ద్వారా దీన్ని తాజాగా అమెరికాకు పంపిందని టెహ్రాన్ అధికారిక మీడియా పేర్కొంది. ఈ ప్రతిపాదనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా స్పందించారు. సంఘర్షణ ముగించేందుకు అమెరికా నుంచి వచ్చిన 9 పాయింట్లనకు స్పందనగా.. ఇరాన్ ఈ 14 పాయింట్లతో తాజా ప్రతిపాదనలు చేసింది. ఇందులో లెబనాన్‌తో మిగతా 2లో..



## ఇజ్రాయెల్ మరింత

# శత్రుదుర్భేద్యం

**అమెరికా నుంచి మరిన్ని అత్యాధునిక యుద్ధ విమానాల కొనుగోలుకు పచ్చజెండా**

**ఇరాన్ గగనతలంలో ఎక్కడికైనా చొచ్చుకెళ్లగలం: నెతన్యాహు**



టెల్‌అవీవ్(జనంసాక్షి):ఇజ్రాయెల్ తన ఆయుధ సంపత్తిని మరింత పెం చుకునేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే అమెరికా నుంచి మరో రెండు స్క్వాడ్రన్‌ల ఎఫ్-35ఐ, ఎఫ్-15ఐఏ యుద్ధ విమానాలను కొనుగోలు చేయనున్నట్లు రక్షణశాఖ ప్రకటించింది. సీనియర్ మంత్రులతో కూడిన కమిటీ ఈ కొనుగోళ్లకు ఆమోదముద్ర వేసిందని తెలిపింది. ఎఫ్-35ఐలను లాక్‌హీడ్ మార్టిన్, ఎఫ్-15ఐఏలను బోయింగ్ సంస్థలు తయారు చేయనున్నాయి. ఈ ఒప్పందం తమ గగనతల ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. తమ పైలట్లు ఇరాన్ గగనతలంలో ఎక్కడికైనా చొచ్చుకెళ్లగలరని, మిగతా 2లో..


## హెజ్బొల్లా వద్ద కొత్త ఆయుధం

ఫైబర్ ఆప్టిక్ డ్రోన్‌తో ఇజ్రాయెల్ సైనికులపై దాడి

2లో..

## గృహ సముదాయంలో

# పేలిన ఏసీ..



## 9 మంది మృతి

- పలువురికి తీవ్రగాయాలు
- దేశరాజధాని ఢిల్లీలో అగ్నిప్రమాదం

ఢిల్లీ(జనంసాక్షి): దేశరాజధాని దిల్లీలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ నివాససముదాయంలో మంటలు చెలరేగడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏసీ పేలడంతో ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. వివేక్ విహార్‌లో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో నివాసితులు భవనంలోనే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే.. అగ్నిమాక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని 14 అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపుచేశారు. 10 మందిని పైగా రెస్క్యూ సిబ్బంది మిగతా 2లో..

# చమురు ఉత్పత్తి పెంపునకు ఒపెక్+ ఓకే.. కానీ

## ప్రస్తుత పరిస్థితుల్లో అది కాగితాల వరకే పరిమితం



న్యూఢిల్లీ(జనంసాక్షి):జూన్ నెలలో చమురు ఉత్పత్తి కోటాను పెంచేందుకు చమురు ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్+ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ఇరాన్- అమెరికా వ్యవహారం కొలిక్కి రాకపోవడం, హర్మూజ్ మిగతా 2లో..

# చమురు ఉత్పత్తి పెంపునకు ఒపెక్+ ఓకే.. కానీ

జలసంధి ఇంకా తెరుచుకోకపోవడంతో వాస్తవంలో ఒపెక్+ దేశాలు చమురు ఉత్పత్తిని పెంచే పరిస్థితిలో లేవు. దీంతో ఈ అంగీకారం కేవలం కాగితాలకే పరిమితం కానుంది.ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన యుద్ధం కారణంగా ప్రపంచంలోనే చమురు రవాణాకు అత్యంత కీలక మార్గం 'హర్మూజ్ జలసంధి' మూతపడింది. దీనివల్ల చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా, కువైట్, అల్జీరియా, కజక్స్థాన్, రష్యా, ఒమన్ దేశాలు ఆదివారం సమావేశమై చమురు ఉత్పత్తి పెంపునకు పచ్చజెండా ఊపాయి. రోజుకు 1,88,000 బ్యారెళ్ల మేర చమురు ఉత్పత్తిని పెంచాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. ఇటీవల ఈ సమాఖ్య నుంచి యూఏఈ వైదొలిగిన సంగతి తెలిసిందే. అంతకుముందు జరిగిన సమావేశంలోనూ చమురు ఉత్పత్తి కోటాను రోజుకు 2,06,000 బ్యారెళ్ల మేర పెంచడానికి ఒపెక్+ అంగీకరించింది. ఇలా ఉత్పత్తి పెంచేందుకు నిర్ణయించడం వరుసగా ఇది మూడోసారి. కాల్పుల విరమణ కొనసాగుతున్నా ఉద్రిక్తతలు సద్దుమణిగితే ఆ మేర ఉత్పత్తి పెంచడం సాధ్యమవుతుంది. గల్ఫ్ దేశాల్లో ఒకటైన కువైట్ ఏప్రిల్ నెలలో ఒక్క బ్యారెల్ చమురు కూడా ఇతర దేశాలకు ఎగుమతి చేయలేదని ట్యాంకర్‌ట్రాకర్ వెబ్‌సైట్ పేర్కొంది. 1991 గల్ఫ్ వార్ తర్వాత నెల రోజుల్లో ఒక్క బ్యారెల్ చమురు కూడా ఎగుమతి చేయకపోవడం ఇదే తొలిసారి అని పేర్కొంది. ఎగుమతిని చేయనప్పటికీ.. ఉత్పత్తి చేసిన క్రూడాయిల్‌ను ఆ దేశం కొంతమేర స్టోరేజీ చేస్తోందని, మరికొంత క్రూడాయిల్‌ను రిఫైన్ ఉత్పత్తులుగా మారుస్తోందని ట్యాంకర్ ట్రాకర్ తెలిపింది.

# హెజ్బొల్లా ఉగ్రవాదుల వద్ద కొత్త ఆయుధం

బీరూట్(జనంసాక్షి):లెబనాన్‌లోని ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా వద్ద కొత్త ఆయుధం ఉన్నట్లు తాజాగా వెల్లడైంది. ప్రత్యేకంగా రూపొందించిన డ్రోన్లతో హెజ్బొల్లా ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సైనికులపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఒక సైనికుడు మరణించాడు. మరికొందరు గాయపడ్డారు. వీరిని రక్షించేందుకు వెళ్లిన రెస్క్యూ హెలికాప్టర్‌పై కూడా మళ్లీ హెజ్బొల్లా ఇదే డ్రోన్లతో దాడి చేసింది. దీనికి సంబంధించిన వీడియోను హెజ్బొల్లా సంస్థ విడుదల చేసింది. ఈ అంశంపై ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఎఫ్, నిపుణులు కీలక వివరాలు వెల్లడించారు. వారి అంచనా ప్రకారం.. హెజ్బొల్లా వద్ద చవకైన, కచ్చితత్వంతో పని చేయగల డ్రోన్ ఉంది. అది కూడా శత్రువుల ఎలక్ట్రానిక్ రాడార్లకు చిక్కకుండా దీన్ని తయారు చేశారు. అయితే, ఇది రెగ్యులర్ డ్రోన్ కాదు. కానీ, ప్రమాదకరమైంది. ఇది గ్రెనేడ్లను మోసుకెళ్లగలదు. దీన్ని చైనా లేదా ఇరాన్ అందించినట్లు అనుమానిస్తున్నారు. ఇది ఫైబర్ ఆప్టిక్ క్వాడ్‌కాప్టర్ డ్రోన్. చాలా తేలికగా ఉంటుంది. కానీ, బరువైన వాటిని మోసుకెళ్లగలదు. అలాగే, కచ్చితత్వంతో పని చేస్తుంది. అలాగే, దీన్ని రాడార్‌లో గుర్తించడం కష్టం. ఎందుకంటే, ఇది రేడియో సిగ్నల్ ఆధారంగా పని చేయదు. ఒక చిన్న కేబుల్ ఆధారంగా పని చేస్తుంది. అందువల్ల రాడార్లతో గుర్తించి, వీటిని ధ్వంసం చేయడం కుదరదు.దీన్ని బ్లాక్ చేయడం, అడ్డుకోవడం కుదరదు. అందువల్ల ఇది శత్రువులపై దాడిలో విజయం సాధిస్తుంది. ఈ తరహా డ్రోన్లతో దాడి చేసినప్పుడు అడ్డుకోవాలంటే నెట్స్, గ్రిల్స్ వంటివి ఏర్పాటు చేసుకోవడం తప్ప ఇంకో మార్గం లేదు. అందుకే ఈ విషయంలో ఇజ్రాయెల్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే, ఈ డ్రోన్లకు కావాల్సిన బేస్ డ్రోన్లను చైనా లేదా ఇరాన్ అందించి ఉండవచ్చని ఇజ్రాయెల్ భావిస్తోంది. దీనిపై ఇంకా ఇజ్రాయెల్ విచారణ జరుపుతోంది. ఈ తరహా డ్రోన్లను కొద్దికాలం క్రితం ఉక్రెయిన్ వాడింది.

# సంఘర్షణను ముగింపుకు ఇరాన్ 14 ప్రతిపాదనలు

సహా అన్ని విధాలుగా యుద్ధాన్ని ముగించాలని టెహ్రాన్ పిలుపునిచ్చింది. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ పొడిగింపును ఇరాన్ తిరస్కరించింది. తాత్కాలిక సంధికి బదులుగా.. 30 రోజుల్లోగా యుద్ధం శాశ్వతంగా ముగించేలా సమగ్ర పరిష్కారాన్ని కోరింది. దీంతో పాటు తమపై మళ్లీ దాడులు చేయకుండా భద్రతా హామీలు ఇవ్వాలని, సరిహద్దు ప్రాంతాల్లో అమెరికా తన బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. వివిధ దేశాల్లో స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని, తమపై విధించిన ఆంక్షలను కూడా ఎత్తివేయాలని ప్రతిపాదనల్లో ప్రస్తావించింది. హర్మూజ్ జలసంధిలో దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించడం వంటివి కూడా ఇందులో ఉన్నాయి.

బంతి అమెరికా కోర్టులోనే: ఇరాన్

యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే తమ ప్రతిపాదనల లక్ష్యమని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ పేర్కొన్నారు. దౌత్య మార్గాన్ని ఎంచుకోవాలా.. లేదంటే ఘర్షణ వైఖరినే కొనసాగించాలా అనే నిర్ణయం ఇప్పుడు అమెరికానే తీసుకోవాలన్నారు. తమ జాతీయ ప్రయోజనాలు, భద్రతను కాపాడుకునేందుకు ఇరాన్ రెండింటికీ సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు.

త్వరలో సమీక్షిస్తా: ట్రంప్

ఇరాన్ పంపిన ప్రతిపాదనలపై ట్రంప్ స్పందించారు. వీటిని త్వరలోనే తాను సమీక్షిస్తానని ట్రూత్ సోషల్ వేదికగా పేర్కొన్నారు. అయితే, గత 47 ఏళ్లుగా మానవాళికి, ప్రపంచానికి వారు చేసిన దానికి.. ఇంకా తగిన మూల్యం చెల్లించుకోలేదన్నారు. కాబట్టి.. ఈ ప్రణాళిక ఆమోదించేలా ఉంటుందని తాను అనుకోవడం లేదన్నారు.

# ఇజ్రాయెల్ మరింత శత్రుదుర్భేద్యం

అందుకు వారు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అదేవిధంగా దేశీయ రక్షణ తయారీ రంగాన్ని విస్తరిస్తామని చెప్పారు. రాబోయే దశాబ్దంలో తమ రక్షణ బడ్జెట్‌కు అదనంగా 350 బిలియన్ షెకెల్స్ (118 బిలియన్ డాలర్లు) కేటాయించాలని యోచిస్తున్నట్లు తెలిపారు.కొత్తగా కొనుగోలు చేయనున్న యుద్ధ విమానాలు ప్రాంతీయ ముప్పులను ఎదుర్కొంటూ.. ఇజ్రాయెల్ గగనతల ఆధిపత్యాన్ని కాపాడుతూ.. ఐడీఎఫ్ దీర్ఘకాలిక అభివృద్ధికి మూలస్తంభంగా నిలుస్తాయని రక్షణశాఖ తెలిపింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ వద్ద 48 ఎఫ్-35ఐ ఫైటర్ జెట్లు ఉన్నాయి. ఈ తరహా మరో 25 యుద్ధవిమానాల కోసం 2023లో ఆర్డర్ చేసింది. 2024లో 25 ఎఫ్-15ఐఏల కోసం ఆర్డర్ ఇవ్వగా.. 2031 నుంచి డెలివరీ ప్రారంభమవుతుందని అంచనా.

## పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీని ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోంది

**రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్న ఎంపీ రాఘవ్ చద్దా**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆమ్ ఆద్మీ పార్టీని వీడిన ఎంపీలను లక్ష్యం చేసుకోవడానికి ఆ పార్టీ పంజాబ్‌లో ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా ఆరోపించారు. అవినీతిపరులు, రాజీపడిన వారి చేతుల్లోకి ఆ పార్టీ వెళ్లిపోవడం వల్లే తాము బయటకు రావాల్సి వచ్చిందన్నారు. భాజపాలో చేరిన ఎంపీలపై తప్పుడు కేసులు పెట్టడానికి ఆప్ ప్రయత్నిస్తోందని..అందులో భాగంగానే ఎంపీ సందీప్ పాఠక్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్లేందుకు అపాయింట్‌మెంట్ కోరినట్లు తెలిపారు. మే 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం కానున్నట్లు చడా&ధ తెలిపారు. ఆయనతో పాటు మరో ముగ్గురు ఎంపీలు కూడా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. కాగా తమ పార్టీని వీడిన ఏడుగురు ఎంపీలు భాజపాలో విలీనమవ్వడాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకువెళ్తానని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ ఇటీవల పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చడా&ధ రాష్ట్రపతిని కలవనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేడే ఐదు రాష్ట్రాల ఫలితాలు

ఫలితాల వెల్లడికి సమయం ఆసన్నమైంది. సోమవారం ఓట్ల లెక్కింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి ఎన్నికల్లో అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేతో పాటు ప్రముఖ నటుడు విజయ్ పార్టీ 'టీవీకే' రంగంలోకి దిగడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. డీఎంకేకు ప్రజలు మళ్లీ పట్టంకట్టనున్నారా? లేక ప్రతిపక్ష అన్నాడీఎంకే మళ్లీ పుంజుకుంటుందా? లేదా విజయ్ సరికొత్త చరిత్ర లిఖించనున్నారా? ఈ ప్రశ్నలకు నేడే జవాబు దొరకనుంది.ముఖ్యంగా బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కోసం యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హోరాహోరీ ప్రచారం, రికార్డు స్థాయి పోలింగ్, టీఎంసీ- బీజేపీ మధ్య గట్టిపోటీ నెలకొందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల మధ్య సోమవారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. నాల్గోసారి మళ్లీ అధికారం చేపట్టాలని అధికార టీఎంసీ భావిస్తుండగా, చరిత్రాత్మక విజయంతో బంగాల్ గడ్డపై తొలిసారి కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ పట్టుదలతో ఉంది. గత ఎన్నికల్లో ఉనికి కోల్పోయిన సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి.బంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకుగానూ 293 నియోజకర్గాల ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' నియోజకవర్గంలో ఎన్నికల అక్రమాల కారణంగా పోలింగ్‌ను ఈసీ రద్దుచేసింది. అక్కడ ఈనెల 21న రీ-పోలింగ్, మే 24న కౌంటింగ్ జరగనుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 2నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారం రీపోలింగ్ ముగిసింది. 87శాతం ఓటింగ్ నమోదైంది. రెండు విడతల పోలింగ్ ముగిసిన తర్వాత కూడా బంగాల్‌లో రాజకీయంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రధానపోటీదారులైన ఽఓఅ, ఃఏఖలు కూడా తమదే విజయమని ధీమా వ్యక్తం చేశాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బంగాల్‌లో 92.47 శాతం ఓటింగ్ జరగడం ఇదే తొలిసారి. 2.5లక్షల మంది కేంద్ర పారా మిలిటరీ బలగాలు, రాష్ట్ర పోలీసుల భారీ బందోబస్తు మధ్య చెదురుమదురు ఘటనలు మినహా రెండు విడతల్లో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

**ఆ 11 జిల్లాల్లో హై అలర్ట్**

మరోవైపు ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించింది. ఎన్నికల ఫలితాల సమయంలో హింస చెలరేగే అవకాశమున్న 11 జిల్లాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించింది. ఆయా జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు ప్రకటించింది. ఈ జాబితాలో ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, ఉత్తర 24 పరగణాలు, కూచ్ బెహార్, మాల్దా, నాడియా, బీర్భూం, పశ్చిమ మేదినీపూర్, హుగ్లీ వంటి జిల్లాలు ఉన్నాయి. ఫలితాలు వెలువడే సమయంలో ఎటువంటి హింస, అల్లర్లు జరగకుండా ఉండేందుకు అన్ని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను హై అలర్ట్‌లో ఉంచినట్లు అధికారులు వివరించారు.

**ప్రాణనష్టం కూడా జరగకపోవడం ఇదే మొదటిసారి**

రాష్ట్రవ్యాప్తంగా 75వేల మంది కేంద్ర పారామిలిటరీ దళాలను మోహరించినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు చెప్పారు. బుల్లెట్లు, పేలుళ్లను తట్టుకోగల అధునాతన మార్క్‌మ్యాన్ సాయుధ వాహనాలను రంగంలోకి దించారు. బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న సరిహద్దు జిల్లాల్లో అదనపు నిఘాను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే కంటెంట్‌ను వ్యాప్తి చేయకుండా అడ్డుకునేందుకు రాజకీయ పార్టీల సోషల్ మీడియా అకౌంట్లు, వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని పలు ముఖ్యమైన ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎన్ఐఏ అధికారులు నిఘా ఉంచారు. అధికారిక లెక్కల ప్రకారం 2011 ఎన్నికల సమయంలో 25మంది ప్రాణాలు కోల్పోయారు. 2016 ఎన్నికల్లో 30మంది మృతిచెందగా, 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అత్యధికంగా 58మంది మరణించారు. మళ్లీ అటువంటి హింస జరగకుండా నివారించేందుకు ఈ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. దశాబ్దాల బంగాల్? ఎన్నికల చరిత్రలో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకపోవడం ఇదే మొదటిసారి.

90లక్షల మంది ఓటర్లను తొలగించిన వివాదాస్పద 'ఎస్ఐఆర్' ప్రక్రియ తర్వాత బంగాల్‌లో జరిగిన తొలి ఎన్నికలు ఇవి. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఇతర అగ్రనేతలు బీజేపీ తరఫున ప్రచారం చేశారు. బంగాల్ సర్కార్ అవినీతి, శాంతిభద్రతలు, అక్రమచొరబాట్లు, మహిళా భద్రత, నిరుద్యోగం వంటి అంశాలపై టీఎంసీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అమలుచేస్తామని హామీ ఇచ్చారు. టీఎంసీ తరఫున సీఎం మమతాబెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ అన్నీ తామై ప్రచారం చేశారు. ౹ాఎఖీ వేధింపులు, బెంగాలీల అణచివేత, స్థానికేతరులనే అంశాలతోపాటు జాతీయ హామీలను నెరవేర్చడంలో బీజేపీ విఫలమైందని ఆరోపించారు. రికార్డు స్థాయిలో ఓటు వేసిన బంగాల్? ప్రజలు ఎవరికి పట్టం కట్టారో తెలియాలంటే సోమవారం వరకు వేచి చూడాల్సిందే.ఉన్న యూడీ ఎఫ్ సీఎం పీఠంపై గురి పెట్టింది. మరోవైపు కామ్రేడ్ల కోటలో ఉనికి చాటుకోవాలని ఎన్డీయే ఉవ్విళ్లూరు తోంది. 3 కూటములకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన ఈ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెల కొంది.అలాగే యావత్ దేశం ఆసక్తిగా ఎదురు చూస్తున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల మొత్తం 77 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. కోల్‌కతాలోని 11 నియోజకవర్గాలకుగానూ 5 ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యే అవకాశం ఉందన్న టీఎంసీ ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది.

## అందరి చూపు భవానీపూర్ పైనే..

ఇప్పుడు అందరి దృష్టి 'భవానీపూర్' నియోజకవర్గంపైనే నెలకొంది. సీఎం మమతా బెనర్జీ, బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి ఇక్కడ బరిలో ఉన్నారు. దీనికి సంబంధించిన కౌంటింగ్ సఖావత్ మెమోరియల్ కేంద్రంలో జరగనుంది.సీఎం మమత సిట్టింగ్ స్థానంలో ఉద్రిక్తత భవానీపూర్ అసెంబ్లీ స్థానం కోల్‌కతా జిల్లాలో ఉంది. ఇది సీఎం మమతా బెనర్జీ సిట్టింగ్ స్థానం. అందుకే అక్కడ ఏం జరిగినా సీఎం మమత వెంటనే స్పందిస్తారు. ఈ నియోజకవర్గంలో ఈవీఎంలను భద్రపర్చిన సఖావత్ మెమోరియల్ గర్ల్స్ హైస్కూల్ ఆవరణలోకి బీజేపీ జెండాలతో కూడిన రెండు కార్లను అనధికారికంగా అనుమతించారంటూ గురువారం (ఏప్రిల్ 30న) రాత్రి టీఎంసీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బీజేపీ జెండా కలిగిన కార్లు ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంల సమీపం దాకా వెళ్లాయని వారు ఆరోపించారు. దీంతో వెంటనే సీఎం మమత అక్కడికి చేరుకున్నారు. గురువారం రాత్రి అక్కడ నాలుగు గంటలు ఆమె ధర్నా చేశారు. కొత్త అప్‌డేట్ ఏమిటంటే, ఆదివారం (మే 3న) ఉదయం సమయానికి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఆ హైస్కూలుకు 100 మీటర్ల దూరంలో టీఎంసీ కార్యకర్తలు శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

## ధాన్యం కొనండి.. మహాప్రభో..

ఇచ్చి వడ్ల కొనుగోలును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పారని.. అది కాస్త బోగస్ అయ్యిందని హరీశ్‌రావు విమర్శించారు. ఎరువులు కొనాలంటే యాప్ కావాలి.. వడ్లు కొనాలంటే ఆన్‌లైన్ కావాలి అంటూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని మండిపడ్డారు.

## లక్షల మంది విద్యార్థులకు సీఎం వెన్నుపోటు

ఈ జీవో వచ్చిన క్షణం నుంచి విద్యార్థులకే కాదు, లక్షలాది మంది నిరుపేద తల్లిదండ్రులకు కూడా కంటి మీద కునుకు కరువైంది. పిల్లల భవిష్యత్తుపై గంపెడాశలు పెట్టుకున్న తల్లిదండ్రుల ఆశలు మీ ప్రభుత్వ దిక్కుమాలిన చర్యలు నీళ్లు జల్లుతున్నాయి. ఇప్పటికే గురుకుల వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చడంతో 142 మందికి పైగా చందమామల్లాంటి పిల్లలు తనువు చాలించారు. కనీసం సరైన భోజనం కూడా కల్పించలేని చేతకాని సర్కారు వల్ల ఇప్పటికీ వేలాది మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతూనే ఉన్నారు.తెలంగాణ వార్తలుఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంచి ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని రాజకీయాలకతీతంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా కొనసాగించారు, విద్యార్థుల ఉన్నత చదువులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ పథకానికి గ్రహణం పట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలకు ఇప్పటికే గాలికొదిలేసి నాలుగు కోట్ల ప్రజలకు తీరని ద్రోహం చేశారు. చివరికి గతంలో మీ సొంత పార్టీ ప్రభుత్వం అమలుచేసిన ఫీజుల పథకానికి తూట్లు పొడవడానికి మీకు సిగ్గనిపించడం లేదా ?? ఆర్థిక స్థోమత లేని నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించే ఈ పథకాన్ని సమాధి చేసేలా విడుదల చేసిన జీవో 7 ముమ్మాటికీ ఫీజు రీయింబర్స్ మెంట్ ను ఎత్తేసేందుకు తెచ్చిన చీకటి జీవో మాత్రమే. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవో 7ను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాను.విద్యకోసం చేసే ఖర్చును ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడిగా, బాధ్యతగా చూడాలే తప్ప, భారంగా భావించి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటు. కాంగ్రెస్ సర్కారు తీసుకున్న దారుణమైన నిర్ణయం వల్ల అత్యధికంగా నష్టపోయేది సమాజంలోని బడుగు, బలహీనవర్గాల పిల్లలే. రాష్ట్రవ్యాప్తంగా 2500కు పైగా నడుస్తున్న ఉన్నత విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఒక్క పైసా చెల్లించకుండా రెండున్నరేళ్లుగా తీవ్ర వేధింపులకు చేశారు.. పైగా బాకీల చెల్లింపు విషయంలో వన్ టైమ్ సెటిల్ మెంట్ పేరిట కొంతకాలం, ట్రస్ట్, టోకెన్ల పేరిట ఇంకొంత కాలం, కమిటీల పేరిట మరికొన్ని రోజులు మభ్యపెట్టారు. చివరికి అసలుకే ఎసరు తెచ్చిన మీ దివాళాకోరు విధానాన్ని చూసి విద్యార్థి లోకం తీవ్రంగా అసహ్యించుకుంటోంది . పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోవడంవల్ల కళాశాలలు నడపలేక యాజమాన్యాలు బంద్ పాటిస్తే, మీ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు విజిలెన్స్ దాడుల పేరిట కళాశాలలపై బెదిరింపులకు పాల్పడ్డారు.

## గృహ సముదాయంలో పేలిన ఏసీ..

సురక్షితంగా రక్షించారు. ఇప్పటివరకు 9 మృతదేహాలను అధికారులు గుర్తించారు. మృతుల సంఖ్య మరితం పెరిగే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతుంది. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## ఆర్టీఐ కింద జీవిత భాగస్వామి ఆదాయం వివరాలు పొందలేరు

ఓ మహిళ.. పన్ను పరిధిలోకి వచ్చే అతని ఆదాయ వివరాలు వెల్లడించాలని కోరుతూ గతంలో ఆర్టీఐ కింద దరఖాస్తు చేశారు. ఈ వివరాలను బహిర్గతం చేయాలని ఐటీ అధికారులను 2021లో కేంద్ర సమాచార కమిషనర్ (సీఐసీ) ఆదేశించారు. సీఐసీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ భర్త.. దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. భార్య కోరిన వివరాలు పిటిషనర్ వ్యక్తిగత సమాచారమని, అది ప్రజాప్రయోజనం కిందికి రానందున దానిని వెల్లడించాలని ఆదేశించలేమని పేర్కొంది. ఈ క్రమంలోనే సీఐసీ ఉత్తర్వులను పక్కన పెడుతూ ఇటీవల తీర్పు వెలువరించింది.ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకతను తీసుకొచ్చేందుకు ఆర్టీఐ చట్టాన్ని రూపొందించారని హైకోర్టు పేర్కొంది. విస్తృత ప్రజానీకంతో సంబంధం లేని వ్యక్తిగత సమాచారం వెల్లడికి అనుమతించడం దాని ఉద్దేశం కాదని తెలిపింది. భరణం దావా పరిష్కారానికి భర్త ఆదాయ వివరాలు అవసరమని ఆమె వాదించినప్పటికీ.. దానికి ఇతర మార్గాలు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. భరణం కేసుల్లో ఇరుపక్షాలూ తమ ఆదాయం, ఆస్తులు, అప్పులకు సంబంధించిన అఫిడవిట్‌లను దాఖలు చేయాలని చట్టం నిర్దేశిస్తోందని తెలిపింది.

## కామారెడ్డిలో భారీ అగ్నిప్రమాదం

**23 షాపులు దగ్ధం**

కామారెడ్డి(జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ పక్కన గల ఇందిరా గాంధీ చౌక్ ఎదురుగా ఉన్న షాపుల్లో అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 23 దుకాణాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగిందా లేదా ఇతర కారణాలవల్ల జరిగి ఉండవచ్చా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. షాపుల పక్కన చెత్తను కాల్చడంతో పక్కన గల ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు అంటుకుని వ్యాపించినట్లు అనుమానిస్తున్నారు. సుమారు రూ.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఓదార్చారు. ఉన్నత అధికారులతో మాట్లాడి వారికి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.



# రాష్ట్రవ్యాప్తంగా చెడగొట్టు వానలు

ఎగిరిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు గంట పాటు భారీ వర్షం కురవడంతో జన జీవనం కాసేపు స్తంభించింది.మహబూబ్‌నగర్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో విషాదం చోటుచేసుకుంది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగుపడి కార్మికుడు మృతిచెందాడు. కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుడుతుండగా పిడుగుపాటు సంభవించింది. ఈ క్రమంలోనే అక్కడ పనిచేస్తున్న నీలం వెంకన్న ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఇద్దరు రైతులు అస్వస్థతతకు గురయ్యారు.సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్?లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ధాన్యం, మొక్కజొన్న తడిసిముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షార్పణం అవ్వడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మార్కెట్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

ధాన్యం తెచ్చి 15 రోజులు దాటినా కొనుగోలు చేయట్లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలు కురిసి ధాన్యం తడుస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంబాలు నేలకొరిగాయి. మందమర్రి, సింగరేణి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. భద్రాద్రి జిల్లా ఇల్లందు, గుండాల మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రహదారులపై ఆరబోసిన మొక్కజొన్న కొట్టుకుపోయింది. ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ, రేపు కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. ఎల్లుండి జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మిగతా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ఐఎండీ విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. రానున్న రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగి, తదుపరి మూడు రోజుల్లో క్రమేపి రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

## కరీంనగర్‌లో పట్టపగలే బంగారం షాపులో దోపిడీ.. కాల్పులు..

చేసిన ఆభరణాలతో వెళ్తూ ఓ దుండగుడు కింద పడిపోయిన దృశ్యాలు సీసీకెమెరాల్లో నమోదయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న సీపీ గౌస్ ఆలం విచారణ చేస్తున్నారు. జ్యువెల్లరీ షాపు సమీపంలోని డ్రైనేజీలో కత్తెర, ప్లాస్టర్, తుపాకీ మ్యాగ్జిన్‌ను పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలంలోనూ బుల్లెట్లను గుర్తించారు. సీసీ ఫుజేటీ ఆధారంగా దుండగుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశారు.

నిందితుల జాడ తెలిపితే రూ.లక్ష బహుమతి

కరీంనగర్‌లోని పీఎంజీ జ్యువెల్లరీ షాపులో కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నగల దుకాణంలో చోరీకి పాల్పడ్డ నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఐదుగురు నిందితుల ఫొటోలను విడుదల చేశారు. వారి జాడ తెలిపిన వారికి రూ.లక్ష బహుమతి ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఆదివారం ఉదయం బైకులపై వచ్చిన ఐదుగురు దుండగులు కస్టమర్లలా నగల దుకాణంలోకి ప్రవేశించారు. నగలు చూపించిన తర్వాత.. గన్‌తో బెదిరించారు. సిబ్బందిపై కాల్పులు జరిపి నగలను దోచుకెళ్లారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు సిబ్బందికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**వెలుగులోకి సీసీటీవీ దృశ్యాలు**

కరీంనగర్‌లోని పీఎంజే నగల దుకాణంలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఆదివారం ఐదుగురు దుండగులు కస్టమర్లలా దుకాణంలోకి ప్రవేశించారు. నగలు చూపించిన తర్వాత తుపాకీలతో సిబ్బందిని బెదిరించి వారిపై కాల్పులు జరిపి నగలను దోచుకెళ్లారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు సిబ్బందికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిందితులు సిబ్బందిని గన్స్‌తో బెదిరించిన దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వార్త చదివారా: కారుతో ఢీ కొట్టి.. 2 కి.మీ ఈడ్చుకెళ్లి..



**పథకం ప్రకారమే దోపిడీ**

సమాచారం బండి సంజయ్?కు చేరడంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు విచారణ ప్రారంభించారని, గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తున్నట్లు చెప్పారు. క్లూస్ టీమ్ వివరాలు తీసుకుంటున్నారని, నిందితులు తెలుగు, హిందీ మాట్లాడుతున్నట్టు తెలిసిందన్నారు. పథకం ప్రకారమే ఈ దొంగతనం జరిగిందని భావిస్తున్నామన్న బండి సంజయ్, నిందితులను తప్పకుండా పట్టుకుంటారన్న నమ్మకం ఉందన్నారు. షాపు సిబ్బంది సాహసోపేతంగా వ్యవహరించారన్న ఆయన, గాయపడిన వారికి ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు చెప్పారని స్పష్టం చేశారు.

**బాధితులను పరామర్శించిన ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి**

తెలంగాణ మల్టీజోన్ -1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఆదివారం రోజు స్థానిక పి.ఎం.జె. జ్యువలర్స్ షాపు క్రైమ్ సీన్‌ను పరిశీలించి, చోరీ ఘటన జరిగిన ప్రాంతంలో పర్యటించారు. ముందుగా ఆయన క్రైమ్ సీన్‌ను (ఘటనా స్థలాన్ని) క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తు పురోగతి పై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం, ఐజీపీ స్థానిక ఆసుపత్రిని సందర్శించి, ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచిస్తూ, వారికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట కరీంనగర్ సీపీ గౌష్ ఆలం పలువురు పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారు.

## 7న ఎయిరిండియా బోర్డు కీలక సమావేశం..

**కొత్త బాస్ ఎవరో తేలేది ఆరోజేనా?**

న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా బోర్డు మే 7న కీలక సమావేశం కానుంది. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో ముంబయిలో ఈ సమావేశం జరగనుంది. ఖర్చులు తగ్గింపు, తదుపరి సీఈఓ ఎంపిక వంటి అంశాలు ఎజెండాగా ఈ సమావేశం జరగనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.పశ్చిమాసియలో ఘర్షణల కారణంగా జెట్ ఇంధన ధరలు భారీగా పెరగడం, గగనతలాల మూసివేత వల్ల సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించడం వంటి సవాళ్లను ప్రస్తుతం ఎయిరిండియా ఎదుర్కొంటోంది. దీనికితోడు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.22వేల కోట్లు పైగా నష్టం రావొచ్చని సంస్థ అంచనా వేస్తోంది. ప్రస్తుతం సీఈఓగా ఉన్న క్యాంప్‌బెల్ విల్సన్ ఇప్పటికే రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బోర్డు సమావేశం అవుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.విమాన ఇంధన ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో పొదుపు చర్యల్లో భాగంగా టికెట్ ధరల నుంచి మీల్స్‌ను వేరు చేయడం, బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు లాంజ్ యాక్సెస్‌ను ఆప్షనల్ చేయడం వంటి ఐచ్ఛికాలను ఎయిరిండియా పరిశీలిస్తోంది. దీనివల్ల మీల్స్ వద్దనుకునేవారికి ప్రయాణికులకు తక్కువ ధరకే టికెట్లు అందించడం వీలవుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తదుపరి సీఈఓ ఎంపికపైనా బోర్డులో చర్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉంది. ఈ నేపథ్యంలో ఎయిరిండియా, సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్‌లతో పాటు, ఐరోపాకు చెందిన వ్యక్తుల పేర్లు తదుపరి సీఈఓ పదవికి పరిశీలనలో ఉన్నాయి. జాయింట్ ఎండీ లేదా సీఈఓను నియమించే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# నేటి నుంచి రైతు వారోత్సవాలు

**▫ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుండి 9 వరకు రైతు వారోత్సవాలు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ వారోత్సవాలు రైతుల ఇంటి వద్దకే చేరే కార్యక్రమంగా రూపొందించామని, రాబోయే వ్యవసాయ సీజన్‌కు రైతుల్లో నమ్మకం పెంపొందించేందుకు దోహదపడుతుందని ఆయన వివరించారు. శాఖల మధ్య సమన్వయం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తూ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి రోజును ఒక ప్రత్యేక శాఖకు కేటాయించి కార్యక్రమాలు నిర్వహిస్తామని, మొదటి రోజు మట్టి ఆరోగ్యం, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రెండో రోజు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పంటల విభిన్నీకరణ, మైక్రో ఇరిగేషన్ వంటి అంశాలపై కార్యక్రమాలు జరుగుతాయని, మూడో రోజు సహకార, మార్కెటింగ్ శాఖల ద్వారా మార్కెట్ లింకేజులు, రుణ సదుపాయాలపై వివరాలు అందిస్తామని పేర్కొన్నారు. నాలుగో రోజు యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, సౌర శక్తి పరిష్కారాలపై ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదో రోజు పశుసంవర్ధక, మత్స్య శాఖలు పశు ఆరోగ్యం, చేపల ఉత్పత్తి పెంపుపై అవగాహన కల్పిస్తాయని, చివరి రోజు సాగునీటి శాఖ వర్షాకాలానికి ముందస్తు చర్యలు, నీటి వనరుల నిర్వహణపై మార్గనిర్దేశనం చేస్తుందని వివరించారు.

# తూర్పును కుదిపేస్తున్న బీటీ త్రీ దందా!

## ఆంధ్రా బాయ్ బీటీ దందాకు డాన్?

- ▫ జరుగుతున్న ప్రచారం తప్పిదమా?
- ▫ చట్టంలోని లొసుగులు కారణమా?
- ▫ గతంలో విత్తనాలు పట్టుబడ్డ రవాణా మారలే



కాటారం, మే 3 (జనంసాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మహాదేవపూర్ కాటారం, మలహర్, మా ముత్తారం మండలాల్లో గత కొన్ని సంవత్సరాలుగా నిషేధిత బిటి త్రీ పత్తి విత్తనాలు అధికారులు వద్దన్నా రహస్యంగా ఒక ముఠాగా ఏర్పడి ఏజెన్సీ తరహాలో ప్రతి గ్రామానికి ఏజెంట్ను పెట్టుకొని కొనసాగుతుంది. కానీ అధికారులు ఏప్రిల్ మాసం రాగానే బీటీ పత్తి విత్తనాలు కొనుగోలు చేయకూడదని ఎట్టి పరిస్థితిలో దుక్కులే పెట్టరాదని ఆఫీసులో యందు ప్రచారం చేసిన మానుకోవడం లేదు కానీ ఈరోజు వరకు ఆ విత్తనాలు దొరకని గ్రామాలు ఉండవు అని రైతులు ప్రచారం జరుగుతుంది. గత సంవత్సరం కొంతవరకు చివరి దశలో ముఠాను పట్టుకొని కొన్ని కొంత స్వాధీనపర్చుకున్నారు. అప్పటికే రైతులు గ్రామాల్లో విత్తనాలు భూమిలో నాటారు. బీటీ త్రీ పత్తి విత్తనాలు రైతు నాటుకోవడం వలన భూమియందు గడ్డి మొలవకుండా గ్రైసిల్ మందులు వాడిన కూడా మొలక చనిపోకుండా అలాగే ఉండడం రైతుకు కూలి నాగలి దున్నిన ఖర్చులు మిగులుతున్నాయి. రైతుకు విత్తనాలు హానికరమైన తెలిసిన కేవలం సుఖం కొరకు పత్తి దిగుబడి కూడా ఎలాంటి పురుగు ఆశించకుండా లాభం దొరుకుతుందని వారి భావన. అందుకే దొంగ చాటున ఈ విత్తనాలు కొనుగోలు చేసి నాటుతున్నారు.

బీటీ త్రీ పత్తి విత్తనాలు నాటడం రైతు చేస్తున్న గడ్డి మందు పిచికారి ఉన్న దుమ్ము దూళి రైతు కూలీలకు అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. సారవంతమైన భూమి కూడా ఈ గడ్డి మందు పిచికారి సారవంతం పోయి చౌడు భూముగా మారుతుంది. భవిష్యత్తులో ఎలాంటి పంట వేసినా పంట రాకుండా పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే శాస్త్రవేత్తలు ఆ విత్తనాలు వాడకూడదని పదే పదే చెబుతున్నారు.

### దళారులకు విత్తనాలు అమ్మడం వలన అధిక లాభాలు

విత్తనాలు హద్దులు దాటాయి ఒకచోట నిల్వ చేశారని రైతుల్లో గుసగుసలు వినపడుతున్నాయి. పంచడమే ఆలస్యం. రైతులు ఇప్పటికే గతంలో తీసుకున్న ఏజెంట్ల వద్దకు పోయి ఆ రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. విత్తనాలు నాటితే వ్యవసాయ ఖర్చులు తప్పి సుఖపడతామని ఎలాగైనా తీసుకువచ్చి ఎక్కువ శాతం నాటే కొరకు చాలా మంది రైతులు ప్రయత్నం లో ఉన్నారు. విత్తనాలు హద్దులు దాటి నిల్వ చేశారని ప్రచారం జరిగిన పట్టుకోవడంలో జాప్యం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. తూర్పు డివిజన్లో బీటీ త్రీ పత్తి విత్తనాలు చేరుకున్నాయని పత్రికల్లో వార్తలు వస్తున్న ప్రచారం మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతున్న ఇప్పటివరకు అయితే పట్టుకున్న పరిస్థితి లేదు ఈ ప్రచారం ఉత్త ప్రచారమా లేక నిజమా అనే సందేహం కూడా కలుగుతున్నది. ఆ డంపు నుంచి విత్తనాలు రైతుల వద్దకు చేరితే పట్టుకోవడం చాలా కష్టమని రైతులే చెబుతున్నారు. గ్రైసిల్ గడ్డి మందు కొట్టిన పత్తి మొక్క చనిపోలేదంటే ఆ మొక్క ప్రభావం ఆ గడ్డి మందు ప్రభావం ఎలా ఉంటుందో గ్రహించవచ్చు. ఆ పత్తిలోని ఆ పత్తిని తీసిన రైతు కూలీలకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు . ఆ పత్తిలో పిచికారి చేసిన కలుపు నివారణ పనులు చేసిన మనుషులకు అనారోగ్యమని ప్రమాదం అని హెచ్చరికలు చేస్తున్నారు. విత్తనాలు నాటకముందే అదుపులోకి తీసుకోవాలని నాటకుండా ప్రయత్నం చేయాలని ఈ ప్రాంత ప్రజానికం కోరుతున్నారు.

# నేడు మూడు జిల్లాల్లో కేటీఆర్ పర్యటన



హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం మూడు జిల్లాల పర్యటనతో బిజీగా ఉండనున్నారు. తొలుత సంగారెడ్డిలో అనంతరం కరీంనగర్, సిరిసిల్లలో కేటీఆర్ పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సంగారెడ్డి జైలులో ఉన్న మన్నె క్రిశాంక్‌ను, కరీంనగర్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పీఎంజే జువెల్లర్స్ సిబ్బందిని పరామర్శించి.. సిరిసిల్లలో బీజేపీ కౌన్సిలర్ బోలగం నాగరాజును కార్యకర్తల సమక్షంలో కేటీఆర్ బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తారు. సోమవారం ఉదయం 9 గంటలకు నార్సింగి నివాసం నుంచి కేటీఆర్ సంగారెడ్డి నియోజకవర్గానికి బయలుదేరుతారు. అక్రమ కేసులో అరెస్టై.. సంగారెడ్డి జైలులో ఉన్న మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్‌తో ఆయన ములాఖత్ అవుతారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతారు. అక్కడి నుంచి 11 గంటలకు సంగారెడ్డి నియోజకవర్గం, సదాశివపేట మార్కెట్ యార్డులో శనిగల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తారు. అనంతరం.. 11:30 గంటలకు సదాశివపేట నుంచి కరీంనగర్‌కు కేటీఆర్ బయలుదేరుతారు. స్థానిక జ్యోతినగర్‌లో నిందితుల తుపాకీ కాల్పుల్లో గాయపడి వెంకటాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆవీజీ జ్యువెలరీ సిబ్బందిని మధ్యాహ్నం 3 గంటలకు పరామర్శిస్తారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో సాయంత్రం 5 గంటలకు బీజేపీ కౌన్సిలర్ బోలగం నాగరాజుకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి.. బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తారు. అనంతరం పలు ప్రైవేట్ కార్యక్రమాలు శుభకార్యాలకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు హాజరవుతారు.

# జాతీయ రహదారిపై ట్రాక్టర్ డ్రైవర్ల ధర్నా

**ఎమ్మెల్యే స్పందించాలని నినాదాలు**



వర్ధన్నపేట (జనంసాక్షి) : ఐదు నెలలుగా వర్ధన్నపేట ఆకేరు పరివాహక ప్రాంతాల ఇసుక ట్రాక్టర్లు నిలిచిపోవడంతో ట్రాక్టర్ యజమానులతో పాటు డ్రైవర్లు కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఇసుక ట్రాక్టర్లను నిషేధించడంతో డ్రైవర్లు కార్మికులు ఆదివారం రోజున ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఖమ్మం వరంగల్ రహదారిపై గంటపాటు ధర్నా చేపట్టారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన వివిధ గ్రామాల ఇసుక ట్రాక్టర్ యజమానులు డ్రైవర్లు కార్మికులు ఆందోళన నిర్వహించారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు స్పందించాలని, ధర్నా వద్దకు రావాలని, అసెంబ్లీలో ఇసుక ట్రాక్టర్ యజమానులకు కార్మికులకు ఉపాధి కల్పించాలని, మాట్లాడిన మాట ప్రకారంగా ఆదుకోవాలన్నారు. మూడు మండలాలకు చెందిన పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని ఆందోళనకారులను శాంతింపచేశారు. పర్వతగిరి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల వాగుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్వతగిరి – ఐనవోలు వర్ధన్నపేట మండలాలలో పలు గ్రామాల నుంచి సుమారు 5000 మందికి ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు. ఆకేరు వాగుపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న తమకు పని లేక ట్రాక్టర్ల ఈఎంఐలు కుటుంబ పోషణ గడవక అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని తమ కుటుంబాలను ఆదుకుని ఇసుకకు అనుమతి ఇవ్వాలన్నారు. ధర్నాతో రోడ్డు ఇరు వైపులా ట్రాఫిక్ స్తంభించింది.

# వేడి సాంబారులో పడి చిన్నారి మృతి



గద్వాల (జనంసాక్షి) : వేడి వేడి సాంబార్లో పడి బాలిక మృతి చెందిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని వాయు కుంట తండాలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గట్టు మండల పరిధిలోని వాయుకుంట తండాలో శంకర్ నాయక్ నివాసం ఉంటున్నారు. వారం రోజుల క్రితం ఇంటి పక్కన పెళ్లి సంబంధం ఉండడంతో శంకర్‌నాయక్ కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లారు. తల్లితోపాటు ఆమె కూతురు 18నెలల అను కూడా నడుచుకుంటూ వెళ్లింది. నడుస్తున్న క్రమంలో అదుపు తప్పి అక్కడే ఉన్న సాంబార్ కుండిలో చిన్నారి పడింది. దీంతో వెంటనే చిన్నారిని చికిత్స కొరకు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో బస్సు బోల్తా..

**26 మందికి గాయాలు..**



కంగ్రా (జనంసాక్షి) : హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రాలో ఆదివారం బస్సు ప్రమాదం జరిగింది. బస్సు బోల్తా పడిన ఘటనలో 26 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లాలో జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో చంబా నుంచి ఉనా వెళ్తోంది. ఈ క్రమంలో నుర్పూర్ సమీపంలోని నియాజ్‌పూర్ వద్ద బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సులోని ప్రయాణికుల్లో 26 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. బస్సు డ్రైవర్ గుండె పోటుకు గురికావడం, ఈ సమయంలో బస్సును నియంత్రించలేకపోవడం వల్లే బోల్తాపడి ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా. బస్సు అదుపుతప్పుతున్న సమయంలోనే కొందరు ప్రయాణికులు గమనించి తమను తాము రక్షించుకునేందుకు అప్రమత్తమయ్యారు. బస్సు బోల్తా పడినే వెంటనే స్థానికులు స్పందించారు. అధికారులకు వెంటనే సమాచారం అందించారు. వెంటనే అధికారులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికుల్ని బయటకు తీశారు.

గాయపడ్డవారిని నుర్పూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స అందుతోంది. ఈ 26 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని మెరుగైన చికిత్సకోసం టాండా మెడికల్ కాలేజీకి పంపించినట్లు వైద్యులు తెలిపారు. మిగతా వారికి గాయాలైనప్పటికీ, ప్రాణాపాయం లేదని తెలిపారు. నుర్పూర్ ఎస్పీ ఆధ్వర్యంలోని పోలీసుల బృందం ఈ ఘటనపై విచారణ జరుపుతోంది. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామని అధికారులు తెలిపారు.

## రోడ్డు పక్కన అమ్మే చిరుతిండి తిని..

# 58 మందికి అస్వస్థత



భువనేశ్వర్ (జనంసాక్షి) : రోడ్డు పక్కన అమ్మే చిరుతిండి తిని 27 మంది పిల్లలతో సహా 58 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం మూడు కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒడిశాలోని జాజ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం పటాపూర్ గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలు స్థానిక విక్రేత వద్ద 'కటక్ దహిబారా' తిన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే వాంతులు, విరోచనాలు, జ్వరంతో అస్వస్థతకు గురయ్యారు. కాగా, అనారోగ్యం చెందిన 27 మంది పిల్లలు, 31 మంది పెద్దలను దశరథపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, జాజ్‌పూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స తర్వాత 21 మంది డిశ్చార్జ్ అయ్యారని జాజ్‌పూర్ జిల్లా కలెక్టర్ అంబర్ కుమార్ కర్ తెలిపారు. మరోవైపు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్, జిల్లా ప్రధాన ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ చేరిన వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఈ ఘటనపై విచారణకు మూడు స్వతంత్ర బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు.ండి తిని.. 27 మంది పిల్లలతో సహా 58 మంది ఆసుపత్రిపాలు భువనేశ్వర్: రోడ్డు పక్కన అమ్మే చిరుతిండి తిని 27 మంది పిల్లలతో సహా 58 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం మూడు కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒడిశాలోని జాజ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం పటాపూర్ గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలు స్థానిక విక్రేత వద్ద 'కటక్ దహిబారా' తిన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే వాంతులు, విరోచనాలు, జ్వరంతో అస్వస్థతకు గురయ్యారు. కాగా, అనారోగ్యం చెందిన 27 మంది పిల్లలు, 31 మంది పెద్దలను దశరథపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, జాజ్‌పూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స తర్వాత 21 మంది డిశ్చార్జ్ అయ్యారని జాజ్‌పూర్ జిల్లా కలెక్టర్ అంబర్ కుమార్ కర్ తెలిపారు. మరోవైపు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్, జిల్లా ప్రధాన ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ చేరిన వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఈ ఘటనపై విచారణకు మూడు స్వతంత్ర బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు.

# గజ్వెల్ ఔటర్ రింగ్ రోడ్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

**▫ ఇద్దరు మృతి**

సిద్దిపేట (జనంసాక్షి) : జిల్లాలోని గజ్వెల్ ఔటర్ రింగ్ రోడ్‌పై ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కారు డివైడర్‌ను ఢీకొని, కరీంనగర్‌కు వెళ్తున్న లారీ ని ఢీకొడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది .

# వరంగల్ రైతు సభను విజయవంతం చేయాలి

**బీఆర్ఎస్ ఎన్నారై ఆస్ట్రేలియా పిలుపు**



వరంగల్ (జనంసాక్షి) : ఈనెల 6న వరంగల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరంగల్ రైతు సదస్సును విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఎన్నారై ఆస్ట్రేలియా సీనియర్ నాయకులు అనిల్ బైరెడ్డి పిలుపునిచ్చారు. రైతు సభను విజయవంతం చేయాలని రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించి 30 నెలలవుతున్న అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు చేసిన మోసాన్ని వరంగల్ నుంచి ఎండగట్టి రైతులను చైతన్యం చేసేందుకు రైతు సభను నిర్వహిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ నడిదే , రమేష్ ముత్యాల ,మధు పార్శ , సత్య గుండా, రవీందర్ చుక్క ,శ్రీకాంత్ రోహిత్ , హరీష్ రెడ్డి, సజ్జాద్ పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

# సినీగేయ రచయిత చంద్రబోస్ సోదరుడు గుండెపోటుతో మృతి



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ చిట్యాల, (జనంసాక్షి): ప్రముఖ సినీగేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్ సోదరుడు కనుకుంట్ల రాజేందర్(60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చల్లగరిగ గ్రామానికి చెందిన కనుకుంట్ల నరసయ్య మధునమ్మ దంపతులకు రాజేందర్, కోటి, చంద్రబోస్ అను ముగ్గురు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు రాజేందర్ గతంలో కండక్టర్ గా పనిచేశారు. అదేవిధంగా గత ప్రజారాజ్యం పార్టీలో కొద్ది రోజులు పని చేశారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటున్న రాజేందర్ బిజినెస్ పనులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో రాజేందర్ మరణం ఆయన కుటుంబ సభ్యులను, సన్నిహితులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్నమయ్య జిల్లా కలికిరి మండల కేంద్రంలో ఉన్న తన స్నేహితుడిని కలిసేందుకు రాజేందర్ శనివారం అక్కడికి చేరుకున్నారు. రాత్రి తన స్నేహితుడి ఇంట్లోనే బస చేసిన ఆయన, ఆదివారం ఉదయం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో స్నేహితులు తక్షణమే స్పందించి ఆయనను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న సమయంలోనే రాజేందర్ పరిస్థితి విషమించింది. వైద్యులు శ్రమించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న చంద్రబోస్ కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రాజేందర్ మృతి పట్ల సినీ ప్రముఖులు, చంద్రబోస్ అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. రాజేందర్ మృతితో స్వగ్రామమైన చల్లగరిగలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్డ్ అవార్డు గ్రహీత అయిన చంద్రబోస్ పెద్ద సోదరుడు రాజేందర్ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆస్కార్ అవార్డు పొందిన చంద్రబోస్ కు స్వగ్రామమైన చల్లగరిగలో ఇటీవలే గ్రామస్తులు ఘనంగా సన్మానించిన విషయం తెలిసిందే. కాగా ఆ వేడుకల్లో రాజేందర్ ముందు వరుసలో ఉండి స్థానికంగా ఏర్పాట్లను పరిశీలించి కార్యక్రమాన్ని సక్సెస్ చేశారు. చంద్రబోస్ కు సంబంధించిన అన్ని విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకునే సోదరుడు ఆకస్మికంగా మృతి చెందడం ఆ కుటుంబం కన్నీటిసంద్రంలో మునిగింది. సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# సొంత పొలంలో పుచ్చకాయలు కోసిన బాలుడు

**హత్య చేసిన కౌలుదారులు**

లక్నో(జనంసాక్షి) : ఒక బాలుడు తన కుటుంబానికి చెందిన పొలంలో పుచ్చకాయలు కోశాడు. అయితే ఆ పొలాన్ని కౌలుకు తీసుకున్న వ్యక్తులు కత్తితో పొడిచి అతడ్ని హత్య చేశారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పోలీసులను మోహరించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాలో ఈ దారుణం జరిగింది. జగ్నేర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోని ఖేడా గ్రామానికి చెందిన ఒక కుటుంబం తమ పొలాన్ని కౌలుకు ఇచ్చారు. కాగా, మే 1న ఆ కుటుంబానికి చెందిన 13 ఏళ్ల అవనీష్ కుష్వాహా సొంత పొలానికి వెళ్లాడు. ఆ పొలంలోని పుచ్చకాయలను కోశాడు. ఆగ్రహించిన కౌలుదారులు కత్తితో పొడిచి ఆ బాలుడ్ని చంపారు. సోదరుడి కోసం వెతుకుతూ వచ్చిన సోదరి అతడి మృతదేహాన్ని చూసి షాక్ అయ్యింది. తన కుటుంబానికి ఈ విషయం చెప్పింది. ఆ కుటుంబం ఆగ్రహంతో రగిలిపోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. నిందితులైన రియాజుద్దీన్, షిరాజుద్దీన్‌ను శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పలు పోలీస్ స్టేషన్ల నుంచి అదనపు పోలీస్ బలగాలను రప్పించి అక్కడ మోహరించినట్లు వెల్లడించారు.

# లైబ్రరీ ఆటోమేషన్ - ప్రపంచ ధోరణులు

## భారతదేశంలో ఇన్‌ఫ్లిబ్‌నెట్ కార్యక్రమాలు

లైబ్రరీ ఆటోమేషన్ ఆధునిక జ్ఞాన సమాజంలో అత్యంత కీలకమైన మార్పులలో ఒకటి. ప్రపంచవ్యాప్తంగా లైబ్రరీలు సంప్రదాయ పుస్తకాల నిల్వ కేంద్రాల నుంచి డిజిటల్ జ్ఞాన కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ మార్పుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సమాచార సాంకేతికత) పురోగతి, వినియోగదారుల మారుతున్న అవసరాలు, వనరుల సమర్థ నిర్వహణ అవసరం కారణం. ఈ నేపథ్యంలో భారతదేశం కూడా ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ సెంటర్ - (ఇన్‌ఫ్లిబ్‌నెట్) (INFLIBNET Centre) ద్వారా గణనీయమైన ముందడుగు వేసింది.

ప్రపంచ స్థాయిలో ప్రధానంగా చర్చించబడుతున్న అంశాలలో ఒకటి ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ సిస్టమ్ (ఐఎల్ఎస్) నుంచి క్లౌడ్ కంప్యూటింగ్ ఆధారిత లైబ్రరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లకు మార్పు జరిగింది. గతంలో లైబ్రరీలు తమ సొంత సర్వర్లు, సాఫ్ట్‌వేర్ నిర్వహించేవి. ఇప్పుడు క్లౌడ్ టెక్నాలజీ ద్వారా ఇంటర్నెట్ ద్వారా సేవలు పొందడం సులభమైంది. దీని వల్ల ఖర్చులు తగ్గి, యాక్సెస్ పెరిగింది. ఇంకొక ముఖ్య అంశం స్టాండర్డైజేషన్ (ప్రమాణీకరణ), పరస్పర అనుసంధానం (interoperable) మెషీన్ రీడబుల్ క్యాటలాగింగ్ (ఎమ్ఏఆర్‌సీ), డబ్లిన్ కోర్ (Dublin Core), జడ్ 39.50 - (39.50 - జడ్ 39.50) వంటి ప్రమాణాలు ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

డిజిటల్ లైబ్రరీలు, ఇన్‌స్టిట్యూషనల్ రిపోజిటరీలు కూడా ముఖ్యమైన అంశాలు. ఈ-బుక్స్, ఈ-జర్నల్స్, థీసిస్‌లు, మల్టీమీడియా వనరులు ఇప్పుడు లైబ్రరీలలో భాగమయ్యాయి. ఓపెన్ యాక్సెస్ ఉద్యమం ద్వారా శాస్త్రీయ సమాచారాన్ని ఉచితంగా అందిస్తున్నారు. డి-స్పేస్ (DSpace), ఈ-ప్రింట్స్ (EPrints) వంటి ప్లాట్‌ఫారమ్‌లు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

యూజర్ ఎక్స్‌పీరియన్స్ & యాక్సెసిబిలిటీ (Accessibility - యాక్సెసిబిలిటీ) కూడా ముఖ్యమైన అంశాలు. మొబైల్ యాప్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ ఆధారిత సెర్చ్ టూల్స్ ఉపయోగిస్తున్నారు. డేటా సెక్యూరిటీ, ప్రైవసీ అంశాలు కూడా కీలకం కానుంది. డిజిటల్ డేటా పెరుగుతున్న కొద్దీ సైబర్ ప్రమాదాలు పెరుగుతున్నాయి. డిజిటల్ డివైడ్ (Digital Divide) కూడా ఒక ప్రధాన సమస్య. అభివృద్ధి చెందిన దేశాలు ముందంజలో ఉండగా, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇంకా వెనుకబడి ఉన్నాయి. ఈ గ్లోబల్ పరిణామాల మధ్య భారతదేశంలో ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ సెంటర్ - (ఇన్‌ఫ్లిబ్‌నెట్) (INFLIBNET Centre) ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఇది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆధ్వర్యంలో 1991లో స్థాపించబడింది. ఇన్‌ఫ్లిబ్‌నెట్ అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్ ఫర్ యూనివర్సిటీ లైబ్రరీస్ (సోల్) లైబ్రరీ నిర్వహణకు ఉపయోగపడుతోంది.

శోధగంగ (Shodhganga) ద్వారా భారతీయ పరిశోధనలకు ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం లభిస్తోంది."ఈ-శోధసింధు" (e-ShodhSindhu) ద్వారా ఈ-జర్నల్స్, ఈ-బుక్స్ అందుబాటులో ఉన్నాయి. విద్వాన్ (VIDWAN) ద్వారా నిపుణుల డేటాబేస్ అందిస్తున్నారు. ఇన్‌ఫ్లిబ్‌నెట్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ లైబ్రేరియన్లకు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందిస్తోంది.

**భారత్‌కు ఎదురవుతున్న సమస్యలు :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత, ఇంటర్నెట్ సమస్యలు, నిధుల లోపం, శిక్షణ పొందిన సిబ్బంది కొరత ప్రధాన సమస్యలు. కొన్ని సంస్థల్లో కొత్త టెక్నాలజీపై అవగాహన కూడా తక్కువగా ఉంది.

**పరిష్కార మార్గాలు, సూచనలు :** ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులు పెట్టాలి. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి. లైబ్రేరియన్లకు శిక్షణ కార్యక్రమాలు పెంచాలి. సంస్థల మధ్య సహకారం పెంచాలి. ఓపెన్ యాక్సెస్ ను ప్రోత్సహించాలి. ప్రాంతీయ భాషా కంటెంట్‌ను అభివృద్ధి చేయాలి. చివరిగా, లైబ్రరీ ఆటోమేషన్ ప్రపంచవ్యాప్తంగా జ్ఞాన వినియోగాన్ని మార్చుతోంది. భారతదేశం ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ సెంటర్ - (ఇన్‌ఫ్లిబ్‌నెట్) ద్వారా మంచి పురోగతి సాధించినప్పటికీ, ఇంకా సవాళ్లు ఉన్నాయి. సరైన విధానాలు, పెట్టుబడులతో భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధ్యమే.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
ramkishore.1504@gmail.com

# ప్రజల ప్రయోజనాలను రక్షించే భూసేకరణ చట్టం-2013

సోనియా గాంధీ పదవీ త్యాగం చేసి మన్మోహన్ సింగ్ గారిని ప్రధానిగా ఎన్నుకున్న 2004-2014 దశాబ్ది కాలం లో అనేక నూతన చట్టాలు వచ్చాయి. రెండవ దఫా యుపిఏ ప్రభుత్వం అవీతి చర్చల వల్ల వ ప్రపంచంలో నే మొట్టమొదటి సారి చేసిన గొప్ప చట్టాలకు కూడా ప్రాచుర్యం లభించ లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 2004-2005 లోనే జరగాల్సి వుండగా పదేళ్లు ఆలస్యంగా నైనా ఏర్పడింది. నూరేళ్ల అన్యాయాలు సరిదిద్ది రూపొందించిన నూతన చట్టమే భూసేకరణ 2013 చట్టం.

భూమి అంటే కేవలం మట్టి కాదు.. అది తరతరాల చరిత్రకు సాక్ష్యం, రైతు అస్తిత్వం. అది మానవుల నివాస ప్రాంతం. చరిత్ర సంస్కృతి పరిణామాల కేంద్రం. సింధు నాగరికత గురించి వాటి అవశేషాలతో మన చరిత్ర తెలుసుకున్నాం. అవశేషాలైనా లేకుండా సాగిన చరిత్రే 1894 భూసేకరణ చట్టం. ఈ మానవ అస్తిత్వాన్ని శాసించేది నేటి పాలకుల కలం పోటు. ఒక గదిలో కూర్చుని తీసుకునే ఒక రాజకీయ నిర్ణయం, రాత్రికి రాత్రే కోట్లాది మంది జీవితాలను తలకిందులు చేయగలదు. ఒక చట్టం ఒకరికి వరమైతే, మరొకరికి శాపంగా మారుతుంది.

అభివృద్ధి పేరుతో పాలకులు గీసే రేఖలు పచ్చని పొలాలను చీల్చవచ్చు లేదా నిర్జీవమైన ఎడారులను నగరాలుగా మార్చవచ్చు. కానీ, ఈ ప్రక్రియలో మనుషులను పరిగణనలోకి తీసుకోనప్పుడు, అది కేవలం భూమి సేకరణ కాదు.. సామాజిక విధ్వంసం అవుతుంది. 1894 నాటి వలస పాలన చట్టం నుండి 2013 నాటి హక్కుల చట్టం వరకు మనం ప్రయాణించినా, నేటికీ రైతు రాజకీయ చదరంగంలో ఒక పావుగానే మిగిలిపోతున్నాడు. పాలకుల ప్రాధాన్యతలు మారినప్పుడల్లా భూమి విలువలు మారుతున్నాయి, రైతుల బతుకులు మారుతున్నాయి. ఈ పుస్తకం కేవలం గణాంకాల సంకలనం కాదు; రాజకీయ నిర్ణయాలు సామాన్యుడి పేగు బంధాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో విశ్లేషించే ఒక సామాజిక దర్పణం.

భారతదేశం ఆత్మ గ్రామాల్లో ఉంది, ఆ గ్రామాల ఉనికి సాగు భూమిపై ఆధారపడి ఉంది. పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల కల్పన పేరుతో ప్రభుత్వం భూమిని సేకరించడం అనివార్యమైనప్పటికీ, ఆ ప్రక్రియలో రైతును అణచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. 1894 నాటి వలసపాలన చట్టాన్ని తుడిచిపెడుతూ, 2013లో పార్లమెంటు ఆమోదించిన 'భూసేకరణలో పారదర్శకత, సరైన పరిహారం మరియు పునరావాస హక్కు చట్టం' (LARR Ac, 2013) ఒక చారిత్రక మలుపు. ఇది కేవలం భూమిని కొనే చట్టం కాదు, భూమిని కోల్పోయిన కుటుంబాల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే ఒక సామాజిక సాధనం.

**1. చీకటి చట్టం - 1894 నేపథ్యం, లోపాలు**

బ్రిటీష్ ప్రభుత్వం 1894లో చేసిన చట్టం పూర్తిగా ఏకపక్షమైనది. "ఎమినెంట్ డొమైన్" (Eminent Domain) అనే సిద్ధాంతం ప్రాతిపదికన, ప్రభుత్వం ప్రజా ప్రయోజనం అని చెబితే చాలు, రైతుకు ఇష్టం ఉన్నా లేకున్నా భూమిని స్వాధీనం చేసుకునే అధికారం ఉండేది. పరిహారం నిర్ణయించడంలో రైతు ప్రమేయం ఉండేది కాదు. అత్యవసర నిబంధన (Urgency Clause) కింద నోటీసు ఇవ్వకుండానే భూములను లాక్కునేవారు. దీనివల్ల స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సుమారు 5 కోట్ల మంది భారతీయులు వివిధ ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులయ్యారని అంచనా. వీరిలో 40 శాతం మంది గిరిజనులు కావడం గమనార్హం. పాత చట్టం కేవలం భూమి యజమాని గురించి ఆలోచించింది తప్ప, ఆ భూమిపై ఆధారపడిన కూలీలు లేదా కౌలు రైతుల గురించి పట్టించుకోలేదు.

**2. చట్టం కోసం జరిగిన చారిత్రక పోరాటాలు**

ఈ అన్యాయమైన సేకరణపై దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు ఎగిశాయి. 2013 చట్టం వెనుక దశాబ్దాల రక్తపాతం, కన్నీళ్లు ఉన్నాయి:

**నర్మదా బచావో ఆందోళన్ :** సర్దార్ సరోవర్ ప్రాజెక్టు వల్ల మునిగిపోయే వేలాది గ్రామాలకు పునరావాసం కల్పించాలని మేధా పాట్కర్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఇది 'అభివృద్ధి ఎవరి కోసం?' అనే ప్రశ్నను లేవనెత్తింది.

**సింగూరు - నందిగ్రామ్ (2006-07) :** పశ్చిమ బెంగాల్‌లో టాటా నానో ప్లాంట్ కోసం సారవంతమైన భూములను బలవంతంగా తీసుకోవడం పెద్ద ఎత్తున హింసకు దారితీసింది. పదుల సంఖ్యలో రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఇది జాతీయ స్థాయిలో భూసేకరణ విధానంపై చర్చను



రేకెత్తించి, పాత చట్టం కాలం చెల్లిందని నిరూపించింది.

**భట్టా పర్సౌల్ (ఉత్తరప్రదేశ్) :** యమునా ఎక్స్‌ప్రెస్ వే కోసం భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటం, రాజకీయ పక్షాలను కదిలించింది. అప్పటి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్వయంగా అక్కడి రైతులకు మద్దతు తెలపడం ఈ చట్టం త్వరితగతిన రావడానికి మార్గం సుగమం చేసింది.

**3. 2013 చట్టం: విప్లవాత్మక విశిష్టతలు**

ఈ చట్టం భూసేకరణ ప్రక్రియను పూర్తిగా ప్రజాస్వామీకరించింది. దీనిలోని ప్రధాన అంశాలు:

ఎ) సామాజిక ప్రభావ అంచనా (SIA) :

ఏ ప్రాజెక్టుకైనా భూమిని సేకరించే ముందు, స్వతంత్ర సంస్థతో SIA చేయించాలి. దీనివల్ల:

భూమి కోల్పోతున్న వారి సంఖ్య, వారి జీవనాధారంపై పడే ప్రభావం తెలుస్తుంది.

ప్రాజెక్టు వల్ల కలిగే లాభం కంటే, సామాజిక నష్టం ఎక్కువగా ఉంటే ఆ ప్రాజెక్టును నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

బి) గ్రామసభల సమ్మతి:

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో (గిరిజన ప్రాంతాలు) భూసేకరణ చేయాలంటే గ్రామసభ అనుమతి తప్పనిసరి. సాధారణ ప్రాంతాల్లో ప్రైవేట్ ప్రాజెక్టులకు 80%, పీపీపీ (Public-Private Partnership) ప్రాజెక్టులకు 70% మంది భూ యజమానులు రాతపూర్వక అంగీకారం తెలపాలి.

**సి) ఆహార భద్రతకు రక్షణ:**

నిరంతరం పంటలు పండే బహుళ పంటల భూములను సాధ్యమైనంత వరకు సేకరించకూడదు. ఒకవేళ అనివార్యమైతే, జిల్లా మొత్తం సాగు భూమిలో ఒక నిర్దిష్ట శాతం మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సేకరించిన అంతే భూమిని వేరే చోట సేద్యం కిందకు తీసుకురావాలి.

**4. పరిహారం: రైతుకు ఆర్థిక వెన్నుదన్ను**

పాత చట్టంలో అతిపెద్ద లోపం 'తక్కువ పరిహారం'. 2013 చట్టం దీన్ని శాస్త్రీయంగా మార్చింది:

**గ్రామీణ ప్రాంతాలు :** రిజిస్ట్రేషన్ విలువకు, మార్కెట్ విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనిస్తూ, నిర్ణయించిన ధరకు 2 నుండి 4 రెట్లు పరిహారం చెల్లించాలి.

**పట్టణ ప్రాంతాలు :** మార్కెట్ విలువకు కనీసం 2 రెట్లు చెల్లించాలి.

సోలేషియం (Solatium) : భూమిని బలవంతంగా కోల్పోయినందుకు కలిగే మానసిక వేదనకు గాను, నిర్ణయించిన పరిహారానికి సమానమైన అదనపు మొత్తాన్ని (100% Solatium) ఇవ్వాలి. అంటే రైతుకు దక్కే మొత్తం అంచనా వేసిన దానికంటే రెట్టింపు అవుతుంది.

5. పునరావాసం, పునరుద్ధరణ (R&R) - మానవీయ కోణం

ఈ చట్టం అసలైన విశిష్టత ఇక్కడే ఉంది. కేవలం భూయజమానులకే కాకుండా, ఆ భూమిపై ఆధారపడిన వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, వృత్తి పనివారికి కూడా పునరావాసం కల్పిస్తుంది:

నివాస స్థలం: ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి పట్టణాల్లో లేదా గ్రామాల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

జీవనోపాధి: కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలి లేదా ఒకేసారి రూ. 5 లక్షల పరిహారం లేదా 20 ఏళ్ల పాటు నెలకు రూ. 2000 చొప్పున పెన్షన్ ఇవ్వాలి.

వ్యాపార సౌకర్యం: చిన్న వ్యాపారస్తులు, చేతివృత్తుల వారికి షాపులు నిర్మించుకోవడానికి ఒకేసారి నగదు సహాయం అందించాలి.

**మౌలిక సదుపాయాలు :** పునరావాస కాలనీల్లో రోడ్లు, తాగునీరు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు కల్పించాలి.

**6. సెక్షన్ 24 : చారిత్రక ఉపశమనం**

ఈ చట్టంలోని సెక్షన్ 24 పాత కేసులకు సంబంధించి కీలకమైనది. 1894 చట్టం కింద భూసేకరణ జరిగి, ఐదేళ్ల లోపు రైతులకు పరిహారం అందకపోయినా లేదా ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోయినా, ఆ సేకరణ రద్దవుతుంది. అప్పుడు కొత్త చట్టం ప్రకారం మళ్ళీ ప్రక్రియ మొదలుపెట్టాలి. ఇది వేలాది మంది రైతులకు న్యాయం చేసింది.

**7. అమలులో సవాళ్లు, ప్రస్తుత పరిస్థితి**

2013 చట్టం అద్భుతమైనది అయినప్పటికీ, దాని అమలులో కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయి:

**సవరణల ప్రయత్నం :** ప్రాజెక్టుల జాప్యాన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 2014-15లో కొన్ని సవరణలు (SIA తొలగింపు వంటివి) తలపెట్టింది, కానీ రైతు సంఘాల తీవ్ర వ్యతిరేకతతో వెనక్కి తగ్గింది.

**రాష్ట్రాల సొంత చట్టాలు :** కేంద్ర చట్టంలోని కఠిన నిబంధనలను తప్పించుకోవడానికి కొన్ని రాష్ట్రాలు (ఉదాహరణకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) సెక్షన్ 10(A) కింద సొంతంగా సవరణలు తెచ్చుకున్నాయి. ఇది కొన్ని చోట్ల రైతులకు నష్టం కలిగిస్తోంది. ఉదాహరణకు మల్లన్న సాగర్ (తెలంగాణ) ప్రాజెక్టు పరిహారం విషయంలో పెద్ద ఎత్తున కోర్టు కేసులు జరగడం మనం చూశాం.

**భూ రికార్డుల లోపం :** సరైన భూ రికార్డులు లేకపోవడం వల్ల అసలైన రైతులకు పరిహారం అందడంలో జాప్యం జరుగుతోంది. డిజిటల్ రికార్డుల అవసరం ఇక్కడ ఎంతైనా ఉంది.

సుప్రీం కోర్టు అనేక తీర్పుల్లో 2013 చట్టాన్ని సమర్థించింది. "అభివృద్ధి పేరుతో రైతుల జీవన హక్కును కాలరాయకూడదు" అని కోర్టు స్పష్టం చేసింది. ఇండోర్ డెవలప్‌మెంట్ అథారిటీ కేసు వంటి తీర్పులు ఈ చట్టంలోని అంశాలను మరింత విపులీకరించాయి. భూసేకరణ చట్టం - 2013 అనేది కేవలం చట్టపరమైన పత్రం కాదు, అది ఒక సామాజిక ఒప్పందం. అభివృద్ధి జరగాలి, కానీ అది రైతుల ప్రాణాల మీద, వారి ఉపాధిని దెబ్బతీస్తూ జరగకూడదు. భూమిని కోల్పోయిన వ్యక్తి మళ్ళీ గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా చేయడమే ఈ చట్టం పరమార్థం. ప్రభుత్వాలు ఈ చట్టం యొక్క స్ఫూర్తిని గౌరవిస్తూ, పారదర్శకంగా అమలు చేసినప్పుడే "అందరి అభివృద్ధి - అందరి నమ్మకం" సాధ్యమవుతుంది. రైతు రాజ్యమైన మన దేశంలో భూమిని రక్షించుకోవడం అంటే జాతి భవిష్యత్తును రక్షించుకోవడమే.

**అధికారం - బాధ్యత - భాగస్వామ్యం**

"రాజకీయ నిర్ణయాలు కోట్లాది మంది తలరాతలను మారుస్తాయి. అమరావతిలో తీసుకున్న ఒక నిర్ణయం వేలాది మందిని కోటీశ్వరులను చేస్తే, అదే రాజధానిపై వచ్చిన రాజకీయ అనిశ్చితి వారిని రోడ్డుపైకి తెచ్చింది. అలాగే మూసీ తీరాన దశాబ్దాలుగా గూడు కట్టుకున్న పేదల భవిష్యత్తు కూడా ఇప్పుడు ఒక రాజకీయ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

ప్రభుత్వాలు మారవచ్చు, విధానాలు మారవచ్చు.. కానీ రైతులకు, పేదలకు ఇచ్చే హామీలు పకడ్బందీగా ఉండాలి. అధికారం అనేది కేవలం భూములను లాక్కోవడానికి ఇచ్చే లైసెన్స్ కాదు, అది నిర్వాసితుల భవిష్యత్తును భద్రపరిచే బాధ్యత. పూణే మగర్పట్టా లేదా అమరావతి లాంటి భాగస్వామ్య నమూనాలు కేవలం ఆర్థిక ఒప్పందాలు మాత్రమే కావు, అవి రాజకీయ నిబద్ధతకు నిదర్శనాలు.

ఇకనైనా పాలకులు 'బలవంతపు సేకరణ' అనే అణచివేత ధోరణిని విడనాడాలి. అభివృద్ధి చెందే నగరంలో రైతును, పేదవాడిని కూలీలుగా మార్చడం కాదు.. వారిని ఆ సంపదలో వాటాదారులుగా గుర్తించాలి. రాజకీయ నిర్ణయాలు కేవలం ఎన్నికల కోసం కాకుండా, తరతరాల సామాజిక న్యాయం కోసం జరిగినప్పుడే 'ఫ్యూచర్ సిటీ' అయినా, 'మూసీ పునరుజ్జీవనం' అయినా నిజమైన ప్రజా విజయాలుగా నిలుస్తాయి. పౌర సమాజం మేల్కొని ప్రశ్నించినప్పుడే, రాజకీయ నిర్ణయాలు ప్రజల పక్షాన నిలుస్తాయి.



బిఎస్ రాములు
ఫోన్ : 8331966987

# రాజకీయ వ్యవస్థ - ప్రజల ఆలోచన విధానంపై ప్రభావం

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాలు కేవలం పాలనకు పరిమితం కావు; అవి సమాజ ఆలోచనా విధానాన్ని, ప్రవర్తనను, విలువలను ప్రభావితం చేసే శక్తిగా మారుతాయి. ఒక దేశంలో అమలులో ఉన్న రాజకీయ వ్యవస్థ, రాజకీయ పార్టీలు అనుసరించే వ్యూహాలు, నాయకుల వ్యాఖ్యలు - ఇవన్నీ కలిపి ప్రజల మనోభావాలను తీర్చిదిద్దుతాయి. ముఖ్యంగా భారతదేశం వంటి విస్తారమైన ప్రజాస్వామ్య దేశంలో రాజకీయాలు సామాజిక నిర్మాణంపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి.

ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఒకరిపై ఒకరు తీవ్రమైన ఆరోపణలు చేసుకోవడం సాధారణంగా మారింది. 1990ల వరకు ఈ ఆరోపణలు పరిమితంగా ఉండేవి. కానీ 2010 తర్వాత సోషల్ మీడియా విస్తరణతో ఈ ధోరణి 300% వరకు పెరిగిందని మీడియా విశ్లేషణలు సూచిస్తున్నాయి. రాజకీయ నాయకులు ప్రత్యర్థులపై ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలలో అనుమానం, విభజన భావనలను పెంచుతున్నారు. ఈ ప్రక్రియలో ప్రజలను కూడా ఈ వివాదాల్లో భాగస్వామ్యం చేస్తున్నారు.

ఒక అధ్యయనం ప్రకారం, ఎన్నికల సమయంలో ప్రచారం చూసే ప్రజలలో 58% మంది తమ అభిప్రాయాలను రాజకీయ ప్రచారంపై ఆధారపడి మార్చుకుంటున్నారు. ఇది రాజకీయ వ్యవస్థ ప్రజల ఆలోచనలపై ఎంత ప్రభావం చూపుతుందో స్పష్టంగా తెలియజేస్తుంది. మరో సర్వే ప్రకారం 62% మంది ప్రజలు రాజకీయ నాయకుల వ్యాఖ్యలను నిజమని నమ్మే ప్రవణత కలిగి ఉన్నారు. ఇది విమర్శనాత్మక ఆలోచన కంటే భావోద్వేగాలకు ప్రాధాన్యత పెరిగిందని సూచిస్తుంది.

రాజకీయ పార్టీల మధ్య ఆరోపణలు, ప్రతిఆరోపణలు చాలాసార్లు ప్రజల దృష్టిని అసలు సమస్యల నుండి దారి మళ్లించే ఎత్తుగడగా భావించవచ్చు. నిరుద్యోగం, విద్య, ఆరోగ్యం వంటి ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాల్సిన సమయంలో, వ్యక్తిగత విమర్శలు, అపవాదాలు ప్రధానంగా మారుతున్నాయి. దీనివల్ల ప్రజలు అసలు సమస్యలపై దృష్టి పెట్టకుండా భావోద్వేగ రాజకీయాలకు లోనవుతున్నారు.

భారతదేశంలో 2014 నుండి 2024 మధ్య జరిగిన ఎన్నికల విశ్లేషణలో, ప్రచారంలో వ్యక్తిగత ఆరోపణల వాటా 40% నుండి 68% వరకు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో అభివృద్ధి అంశాల చర్చ 55% నుండి 32%కి పడిపోయింది. ఇది రాజకీయ వ్యవస్థలో ప్రాధాన్యతలు ఎలా మారుతున్నాయో సూచిస్తుంది.

2.ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే రాజకీయ ప్రక్రియలో మీడియా పాత్ర అత్యంత కీలకంగా మారింది. 2000 తర్వాత ప్రైవేట్ మీడియా విస్తరణ, 2015 తర్వాత సోషల్ మీడియా విప్లవం రాజకీయ ప్రచారాన్ని పూర్తిగా మార్చివేసింది. ఒక అధ్యయనం ప్రకారం 2019 సాధారణ ఎన్నికల సమయంలో 72% మంది ఓటర్లు తమ రాజకీయ అభిప్రాయాలపై టెలివిజన్, సోషల్ మీడియా ప్రభావం ఉందని తెలిపారు. ఇందులో 48% మంది ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వేదికల ద్వారా వచ్చిన సమాచారాన్ని నమ్మినట్లు గుర్తించారు. ఈ పరిస్థితి సమాచార నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతుంది.

రాజకీయ ప్రచారంలో అర్ధసత్యాలు, తప్పుడు సమాచారం, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇచ్చే ప్రసంగాలు ఎక్కువవుతున్నాయి. 2014 నుండి 2024 మధ్య కాలంలో ఫేక్ న్యూస్ వ్యాప్తి సుమారు 400% పెరిగిందని డిజిటల్ పరిశోధన సంస్థలు వెల్లడించాయి. ఈ తప్పుడు సమాచారాన్ని నమ్మే ప్రజల శాతం 35% నుండి 61% వరకు పెరిగింది. దీనివల్ల ప్రజలలో వాస్తవాన్ని గుర్తించే సామర్థ్యం తగ్గిపోతున్నది. రాజకీయాలు ప్రజల భావోద్వేగాలను లక్ష్యంగా చేసుకొని ఆలోచనలను మలచే సాధనంగా మారుతున్నాయి.

ఇక సామాజిక విభజన అంశాన్ని పరిశీలిస్తే, రాజకీయాలు కులం, మతం, ప్రాంతం ఆధారంగా ప్రజలను విభజించే ధోరణి పెరుగుతున్నది. ఒక జాతీయ సర్వే ప్రకారం 2022లో 67% మంది ప్రజలు ఎన్నికల సమయంలో ఈ విధమైన విభజన రాజకీయాలు ఎక్కువగా జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. 1990లలో ఈ శాతం కేవలం 32% మాత్రమే ఉండేది. ఇది కాలక్రమేణా రాజకీయ వ్యూహాలలో వచ్చిన మార్పును స్పష్టంగా చూపుతుంది.

రాజకీయ నాయకుల మాటతీరు కూడా ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. గతంలో రాజకీయ ప్రసంగాలు విధానాలపై దృష్టి సారించేవి. కానీ ప్రస్తుతం వ్యక్తిగత విమర్శలు, దూషణలు 55% వరకు పెరిగినట్లు కమ్యూనికేషన్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ విధమైన భాష ప్రజలలో అసహనం, విభేదాలను పెంచుతుంది. ముఖ్యంగా యువతలో రాజకీయ చర్చలు వాస్తవాల కంటే భావోద్వేగాలకు ఆధారపడే స్థితి ఏర్పడింది.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక శక్తివంతమైన సాధనం. అయితే ఈ హక్కును ఉపయోగించే విధానం కూడా రాజకీయ ప్రభావానికి లోనవుతుంది. ఒక విశ్లేషణ ప్రకారం 2014 ఎన్నికలలో 66% ఓటింగ్ నమోదైతే, 2019లో అది 67.4%కి పెరిగింది. ఇది ప్రజల భాగస్వామ్యం పెరిగిందని సూచించినప్పటికీ, ఓటింగ్ నిర్ణయం తీసుకునే సమయంలో 52% మంది ప్రజలు పార్టీ ప్రచారం ప్రభావంలోనే ఓటు వేసినట్లు తెలిపారు. ఇది స్వతంత్ర నిర్ణయం కంటే ప్రభావిత నిర్ణయం ఎక్కువగా ఉన్నదని సూచిస్తుంది.

రాజకీయాలు విద్యా వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతున్నాయి. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో, చరిత్ర బోధనలో రాజకీయ దృక్కోణాలు ప్రతిబింబించే అవకాశం ఉంది. ఒక అధ్యయనం ప్రకారం 58% మంది విద్యార్థులు తమకు బోధించబడిన చరిత్రలో రాజకీయ ప్రభావం ఉన్నదని భావిస్తున్నారు. ఇది భవిష్యత్తు తరాల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే అంశంగా మారుతుంది.

ఇక ఆర్థిక అంశాలను పరిశీలిస్తే, రాజకీయ నిర్ణయాలు ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తాయి. కానీ ఈ నిర్ణయాలపై ప్రజల అవగాహన తక్కువగా ఉండడం వల్ల వారు భావోద్వేగాల ఆధారంగా స్పందిస్తున్నారు. 2023లో జరిగిన ఒక సర్వే ప్రకారం కేవలం 41% మంది మాత్రమే ప్రభుత్వ ఆర్థిక విధానాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉన్నారు. మిగతా 59% మంది ప్రచారం ఆధారంగా అభిప్రాయాలు ఏర్పరుచుకుంటున్నారు.

రాజకీయాల్లో వ్యక్తి పూజ కూడా ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే ఒక ముఖ్య అంశంగా మారింది. నాయకుల వ్యక్తిత్వం, వారి వ్యక్తిగత ఇమేజ్ ఆధారంగా ఓటింగ్ ధోరణి పెరిగింది. ఒక అధ్యయనం ప్రకారం 2019లో 57% మంది ఓటర్లు పార్టీ కంటే నాయకుడి వ్యక్తిత్వాన్ని ఆధారంగా చేసుకొని ఓటు వేశారు. ఇది ప్రజాస్వామ్యంలో విధానాల కంటే వ్యక్తుల ప్రాముఖ్యత పెరుగుతున్నదని సూచిస్తుంది.

ఇక అంతర్జాతీయ ప్రభావాన్ని పరిశీలిస్తే, ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ధోరణులు భారతదేశంలో కూడా ప్రతిబింబిస్తున్నాయి. పాపులిజం, నేషనలిజం వంటి భావజాలాలు 2010 తర్వాత 45% వరకు పెరిగినట్లు రాజకీయ విశ్లేషణలు తెలియజేస్తున్నాయి. ఈ భావజాలాలు ప్రజల ఆలోచనలను సులభంగా ప్రభావితం చేస్తాయి, ఎందుకంటే అవి భావోద్వేగాలకు దగ్గరగా ఉంటాయి.

రాజకీయ వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం కూడా ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. అవినీతి కేసులు, స్కాంలు వెలుగులోకి వచ్చినప్పుడు ప్రజలలో నిరాశ పెరుగుతుంది. ఒక సర్వే ప్రకారం 2024లో 69% మంది ప్రజలు రాజకీయ వ్యవస్థలో అవినీతి ఎక్కువగా ఉందని భావించారు. ఈ భావన ప్రజలలో రాజకీయాలపై నమ్మకాన్ని తగ్గిస్తుంది.

అయితే అన్ని రాజకీయాలు ప్రతికూలం అని భావించడం సరైనది కాదు. కొన్ని సందర్భాలలో రాజకీయాలు ప్రజలలో చైతన్యాన్ని పెంచుతాయి. సామాజిక ఉద్యమాలు, హక్కుల కోసం పోరాటాలు ప్రజలలో అవగాహన పెంచుతాయి. ఉదాహరణకు 2011లో జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమం తర్వాత రాజకీయ అవగాహన 15% వరకు పెరిగినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ముగింపు దశలో విశ్లేషిస్తే, రాజకీయ వ్యవస్థ ప్రజల ఆలోచన విధానాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. పార్టీలు ఒకరిపై ఒకరు చేసే ఆరోపణలు కేవలం రాజకీయ వ్యూహాలే కాకుండా ప్రజల మనస్సులను ఆకర్షించే సాధనాలుగా మారాయి. ప్రజలు ఈ ప్రభావాన్ని గుర్తించి విమర్శనాత్మక దృష్టితో ఆలోచించాలి. సమాచారం నిజస్వరూపాన్ని పరిశీలించాలి. భావోద్వేగాలకు లోనుకాకుండా తార్కికంగా స్పందించాలి. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా కొనసాగుతుంది.

3.ఇప్పటి వరకు పరిశీలించిన అంశాలన్నింటినీ సమగ్రంగా విశ్లేషిస్తే, రాజకీయ వ్యవస్థ ప్రజల ఆలోచనా విధానంపై చూపుతున్న ప్రభావం గాఢంగా, బహుముఖంగా ఉందని స్పష్టమవుతుంది. ప్రజాస్వామ్య నిర్మాణం సిద్ధాంతపరంగా ప్రజల చేతుల్లో అధికారాన్ని ఉంచుతుందని చెప్పబడుతున్నప్పటికీ, ఆ ఆలోచనా ప్రక్రియను ప్రభావితం చేసే శక్తులు రాజకీయ వ్యవస్థలోనే నిర్మితమై ఉన్నాయని గమనించవచ్చు. అంటే ప్రజలు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కనిపించినప్పటికీ, ఆ నిర్ణయాల మూలాలు చాలాసార్లు రాజకీయ వ్యూహాలలోనే రూపుదిద్దుకుంటున్నాయి.

ఇక పార్టీ రాజకీయాల స్వభావాన్ని గమనిస్తే, ఒక పార్టీ మరో పార్టీపై చేసే ఆరోపణలు కేవలం విమర్శలుగా కాకుండా వ్యూహాత్మక సాధనాలుగా ఉపయోగించబడుతున్నాయి. 2014 నుండి 2024 మధ్య కాలంలో జరిగిన ప్రధాన ఎన్నికల ప్రచారాన్ని విశ్లేషించినప్పుడు, వ్యక్తిగత ఆరోపణలు, పరస్పర విమర్శలు మొత్తం ప్రచారంలో సగటున 60% వరకు స్థానం సంపాదించాయి. అదే సమయంలో విధానాలపై చర్చలు 30% లోపే పరిమితమయ్యాయి. ఇది ప్రజల దృష్టిని అసలు సమస్యల నుండి మళ్లించడానికి ఉపయోగించే ఒక రాజకీయ ఎత్తుగడగా భావించవచ్చు.

ప్రజలను ఈ ఆరోపణలలో భాగస్వామ్యం చేయడం ఒక ముఖ్యమైన వ్యూహంగా మారింది. సోషల్ మీడియా వేదికలు ఈ ప్రక్రియను వేగవంతం చేశాయి. 2020 తర్వాత భారతదేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 700 మిలియన్లకు పైగా చేరింది. వీరిలో సుమారు 65% మంది రోజువారీగా రాజకీయ విషయాలను చూస్తున్నారని అంచనా. ఇందులో 50% మంది ఈ సమాచారాన్ని షేర్ చేయడం, కామెంట్ చేయడం ద్వారా రాజకీయ చర్చల్లో పాల్గొంటున్నారు. ఈ విధంగా ప్రజలు ప్రత్యక్షంగా రాజకీయ ప్రచార యంత్రాంగంలో భాగస్వాములవుతున్నారు.

ఇక ప్రజల మేలు అనే అంశాన్ని విశ్లేషిస్తే, రాజకీయాలు నిజంగా ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నాయా అనే ప్రశ్న మరింత ప్రాముఖ్యత పొందుతుంది. ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, వాటి అమలు, ప్రచారం మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఒక విశ్లేషణ ప్రకారం ప్రభుత్వ పథకాల గురించి 68% మంది ప్రజలు ప్రచారం ద్వారా మాత్రమే తెలుసుకుంటున్నారు; కానీ వాటి అసలు లబ్ధి పొందుతున్నవారి శాతం 42% మాత్రమే ఉంది. ఇది ప్రచారం ప్రధానంగా ఉండి, అమలు పరిమితంగా ఉండే పరిస్థితిని సూచిస్తుంది.

రాజకీయాల్లో నైతిక విలువల క్షీణత కూడా ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే అంశంగా మారింది. అవినీతి, అధికార దుర్వినియోగం, వాగ్దానాలు నిలబెట్టుకోకపోవడం వంటి అంశాలు ప్రజలలో రాజకీయాలపై నమ్మకాన్ని తగ్గిస్తున్నాయి. 2024లో ఒక సర్వే ప్రకారం 72% మంది ప్రజలు రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలలో ఎక్కువ భాగం అమలు కావడం లేదని అభిప్రాయపడ్డారు. ఇది ప్రజలలో నిరాశను పెంచుతుంది.

అయితే మరో కోణంలో చూస్తే, రాజకీయ వ్యవస్థ ప్రజలను చైతన్యవంతులుగా మార్చే శక్తిని కూడా కలిగి ఉంది. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం, సామాజిక సమస్యలపై చర్చించడం, హక్కుల కోసం ఉద్యమాలు చేయడం -- ఇవన్నీ ప్రజలలో అవగాహన పెంచే అంశాలు. 2010 తర్వాత యువతలో రాజకీయ చైతన్యం 35% నుండి 62% వరకు పెరిగినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది సానుకూల అభివృద్ధి అని చెప్పవచ్చు.

ఇక భవిష్యత్ దిశగా పరిశీలిస్తే, రాజకీయ వ్యవస్థ ప్రజల ఆలోచనలను ఎలా మలచబోతుందో అనేది ప్రజల అవగాహనపై ఆధారపడి ఉంటుంది. సమాచార సాంకేతికత మరింత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ వంటి సాధనాలు రాజకీయ ప్రచారంలో ఉపయోగించబడుతున్నాయి. 2025 నాటికి డిజిటల్ రాజకీయ ప్రచారం మొత్తం ప్రచారంలో 80% వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా. ఇది వ్యక్తిగతీకరించిన ప్రచారానికి దారితీస్తుంది, అంటే ప్రతి వ్యక్తికి వేర్వేరు సందేశాలు చేరే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది ప్రజల ఆలోచనలను మరింత లక్ష్యబద్ధంగా ప్రభావితం చేసే అవకాశాన్ని పెంచుతుంది. అందువల్ల ప్రజాస్వామ్యాన్ని బలపరచాలంటే ప్రజలు చైతన్యవంతులై ఉండాలి. విమర్శనాత్మక దృష్టితో రాజకీయాలను విశ్లేషించాలి. నిజమైన సమస్యలపై దృష్టి పెట్టాలి. అభివృద్ధి, సమానత్వం, న్యాయం వంటి విలువలను ప్రాముఖ్యంగా పరిగణించాలి. అప్పుడు మాత్రమే రాజకీయ వ్యవస్థ ప్రజల మేలు దిశగా పనిచేసే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో రాజకీయాలు ప్రజల ఆలోచనలను నియంత్రించే సాధనంగా మారిపోతాయి. ఇదే ఈ పరిశోధనాత్మక విశ్లేషణలో స్పష్టమయ్యే ముఖ్యమైన సందేశం.



డాక్టర్ . రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం.

# ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానం అమలయ్యేనా..?

- మౌన బాటలో జిల్లా అధికారులు
- అధికారులు స్పందిస్తారా..స్పందించరా..
- ఎదురు చూస్తున్న జనం..?




**ధారూర్, మే 3 (జనంసాక్షి) :** ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత ప్రజలకు సమర్థవంతమైన సేవలందించేందుకు బయోమెట్రిక్ విధానం అమలు చేస్తేనే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజల నిర్ణయని ప్రభుత్వం జిల్లా అధికారులు అమలు చేస్తారా ప్రజల నిర్ణయాన్ని స్వాగతిస్తారా స్వాగతించరా గడిచిన రోజులు,నెలలు సంవత్సరాలు అయినప్పటికీ జిల్లా అధికారులు బయోమెట్రిక్ హాజరు విధానం అమలు విషయంలో సంబంధిత అధికారుల నుండి ఎలాంటి స్పష్టత కనిపించడం లేదు.ఉన్నత అధికారులు ఈ అంశంపై ఇప్పటికీ స్పందించకపోవడం ప్రజల్లో అనిశ్చితిని మరింత పెంచుతోంది.బయోమెట్రిక్ విధానం అమలులోకి వస్తే, ఉద్యోగుల హాజరు,సేవల సమయపాలనలో పారదర్శకత పెరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. అలాగే,అవినీతి తగ్గి,ప్రజలకు సేవలు త్వరగా అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.కానీ బయోమెట్రిక్ విధానం కార్యాలయాల్లో ఎప్పుడు అమల్లోకి వస్తుందో అని ప్రజలు ఎదురుచూపుల్లోనే ఉన్నారు. గత ప్రభుత్వ హయంలో తీసుకున్న నిర్ణయం ప్రజా పాలన లో ఎందుకు అమలు కావడం లేదో స్పష్టత లేకపోవడం గమనార్హం.కొంతమంది ప్రజలు,స్థానిక నాయకులు ఈ అంశంపై అధికారులను ప్రశ్నిస్తున్నప్పటికీ,పై అధికారులనుండి సరైన సమాధానం మాత్రం లభించడం లేదు.దీనివల్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి, ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తారా.? చెయ్యరా.?అన్నది వేచి చూడాల్సిందే.ప్రజలు మాత్రం త్వరితగతిన బయోమెట్రిక్ హాజరు విధానం అమలు కావాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా అధికారులు స్పందించరా.?స్పందించరా. స్పందించి బయోమెట్రిక్ విధానం ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేస్తారా చేయరా వేచి చూడాల్సిందే.ప్రభుత్వ కార్యాలయాలలో బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేస్తే అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఉన్న సమస్యలను పరిష్కరించడంలో తోడ్పడుతారని ప్రజలు అంటున్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్ (యూజీ) - 2026 పరీక్ష




**సంగారెడ్డి, మే 3 (జనం సాక్షి) :** జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ)--2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణను పర్యవేక్షించేందుకు అడిషనల్ కలెక్టర్ పాండు పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సంగారెడ్డి లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తార డిగ్రీ కళాశాల, ఇస్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్నాపూర్ టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, అలాగే ఎద్దు మైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాలలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణ విధానం తదితర అంశాలను ఆయన సమీక్షించారు. పరీక్ష సజావుగా, నిబంధనల ప్రకారం జరుగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 2,772 మంది అభ్యర్థులకు గాను 2,704 మంది పరీక్షకు హాజరైనట్లు,68 మంది గైరాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేశాయి. అడిషనల్ కలెక్టర్ వెంట జిల్లా కోఆర్డినేటర్ భారతీదేవి ఉన్నారు.

## తుక్కాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం



**కొల్చారం, మే 3 (జనం సాక్షి) :** కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కొల్చారం మండలం రంగంపేట సొసైటీ ఆధ్వర్యంలోని తుక్కాపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గౌరీ శంకర్, మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్, ఉప సర్పంచ్ రవీందర్, యూత్ అధ్యక్షులు సంతోష్ రావు, వార్డ్ మెంబర్స్ సుధాకర్, మమత శ్రీనివాస్,అంజయ్య, గంగయ్య, సీఈఓ నవీన్, గ్రామస్తులు టేక్మాల్ సిద్ధప్ప, మల్లయ్య, ఆయిలి శేఖర్, మల్లప్ప, మంగలి కృష్ణ, నర్సింలు,బిక్షపతి, ప్రభాకర్, అజయ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## కూరెళ్ళ గ్రామంలో బొడ్రాయి ఉత్సవాలు



**కోహెడ, మే 3 (జనంసాక్షి) :** మండలంలోని కూరెళ్ల గ్రామంలో గ్రామ దేవతలైన పోచమ్మ తల్లి, బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ హాజయ్యారు. కూరెళ్ల గ్రామంలో గత నాలుగు రోజులుగా గ్రామదేవతలైన పోచమ్మ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూరెళ్ళ గ్రామ వాస్తవ్యులు స్వచంద సంస్థ అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు. గ్రామ ప్రజల ఐక్యతతో ఇంత పెద్ద కార్యక్రమం చేయడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అమ్మవారి దీవెనలతో గ్రామంలో పాడిపంటలతో, రైతన్నలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆయన అన్నారు. అమ్మవార్ల కరుణ కటాక్షం గ్రామంలో అందరిపై ఉండాలని ఆయన అన్నారు. గ్రామ ఐక్యతకు గ్రామదేవతల వేడుకలు చేయడం గొప్ప విషయమని ఇంత పెద్ద చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామ సర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులకు గ్రామ పెద్దలకు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో హాజరైన వలస సుభాష్ చంద్రబోస్ సర్పంచ్ బండారి లక్ష్మి- బాలరాజు , యువకులు ఘనంగా శాలువతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మార్గం తిరుపతి,వార్డు సభ్యులు బండారి సాయి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల వెంకటేశ్వర్లు ,బిజెపి సీనియర్ నాయకులు కొండేటి నగేష్, మాజీ వార్డు సభ్యులు బండారి నరేష్, బండారి సుధాకర్ ,చేపూరు అజయ్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితోనే అబివృద్ధి సాధ్యం



**యాలాల, మే 3 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితోనే అబివృద్ధి సాధ్యమని దేవనూర్ గ్రామ కాంగ్రెస్ యువనాయకులు పేర్కొన్నారు. ఆదివారం యాలాల మండలం దేవనూర్ గ్రామంలో గ్రామం నుంచి పెద్దవాగు వరకు సుమారు 1కిలోమీటర్ సీసీ రోడ్డును ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో గ్రామ యువకు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ యువనాయకులు మాట్లాడుతూ ఎన్నో ఎల్లుగా ఎదురుస్తున్న రోడ్డు పనులు ప్రారంబంకావడంతో హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు మార్గంతో రైతులకు ఇబ్బందులు తొలిగిపోతాయన్నారు.రాత్రి వేళల్లో రైతులు తమతమ పోలాలకు వేల్లడానికి విలుపడుతుందన్నారు. ఎందరో నాయకులకు మొరపెట్టుకున్న పనులు జరగలేవన్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తోనే గ్రామాల అబివృద్ధి సాద్యమని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పి ఖాసీం సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్ల శ్రీనివాస్, హన్మ్య నాయక్, మసుల మొగులు, డి శ్రీనివాస్, లక్ష్మణ్ణాయక్, మైముదు, వార్తయ్య రాజు నాయక్, సంత్య నాయక్, రైతులు పాల్గొన్నారు.

## పోతేపల్లి గ్రామ అభివృద్ధికి సర్పంచ్ నిరంతర కృషి



**వెల్దండ, మే 3 (జనంసాక్షి) :** వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి సర్పంచ్ తగుళ్ళ కొండల్ యాదవ్ నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.తనదైన శైలిలో నిత్యం ప్రజల్లో ఉంటూ జననేతగా పేరు ప్రతిష్టలు సంపాదించుకుంటున్న గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ గారు తమ సొంత నిధులతో గ్రామ అభివృద్ధిలో భాగంగా ఎన్నో ఏళ్ల నుంచి భారీ వర్షాలు వచ్చి, మురికి కాల్వలనుండి దుర్వాసన వలన ప్రజల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అందరికీ తెలిసిందే ప్రజలకు ఏ సమస్య రాకుండా సర్పంచ్ కృషివల్లే డ్రైనేజ్ నిర్మాణాలు వేగవంతంగా పనులు పూర్తి కావడం జరిగింది. అలాగే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి ఎద్దడిని నివారించడానికి, గ్రామ సర్పంచ్ కొత్త మోటర్ కొని గ్రామ ప్రజలకు మంచినీరు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్స్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి గ్రామ అభివృద్ధిలో పాల్గొనడం జరిగింది. నాయకులు బాలయ్య గౌడ్, మార్కండేయుడు, ఎగిరిశెట్టి శివ, వావిళ్ళ యాదగిరి, బాలు యాదవ్, చిన్న సైదయ్య, తిరుపతయ్య, వరుణ్, మహేష్, మట్టయ్య, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# మొయినాబాద్‌లో బైక్ దొంగల అరెస్ట్

- 6 బైకులు స్వాధీనం, ఇద్దరు నిందితులు అదుపులోకి..




**మొయినాబాద్, మే 3 (జనంసాక్షి) :** 2026 ఏప్రిల్ నెలలో మొయినాబాద్ పీఎస్ పరిధిలో జరిగిన బైక్ దొంగతనాల కేసుల్లో మొయినాబాద్ క్రైమ్ టీమ్ పురోగతి సాధించింది. 02.05.2026 నాడు నంబర్ ప్లేట్ లేని యమహా వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు.

**అరెస్ట్ అయిన నిందితులు :**

హరిజన రామకృష్ణ - వయస్సు 20 సం.లు, గోవింద్ పల్లి గ్రామం, గండీడ్ మండలం, మహబూబ్ నగర్ జిల్లా, బద్దుల విజయ్ కుమార్ - వయస్సు 22 సం.లు, కొరటిపల్లి గ్రామం, గండీడ్ మండలం, మహబూబ్ నగర్ జిల్లా, విచారణలో నిందితులు మొయినాబాద్‌లో (04) బైకులు, చేవెళ్లలో (01) బైక్, కూకట్‌పల్లిలో (01) బైక్ మొత్తం (06) బైకులు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వీరి ఇంటి వద్ద దాచిపెట్టగా, పోలీసులు ఆ 6 బైకులను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం చేసిన అట్టి వ్యక్తులను 03.05.2026 నాడు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం రాజేంద్రనగర్ కోర్టు నందు హాజరుపరిచారు. పోలీసులను అభినందించిన ఉన్నతాధికారులు.

## ప్రైవేట్ ఉద్యోగుల సంక్షేమానికి గుర్తింపు

- సంఘం నేత గంధం రాములకు తెలంగాణ ప్రభుత్వ శ్రమశక్తి అవార్డు



**కూకట్‌పల్లి, మే 3 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తూ, నిరుద్యోగ యువతకు ఉచిత జాబ్ మేళాలు నిర్వహించి వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు గారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక శ్రమశక్తి అవార్డు ప్రదానం చేసింది. మే డే ఉత్సవాల సందర్భంగా రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వి. వెంకటస్వామి గారి చేతుల మీదుగా గంధం రాములు ఈ అవార్డును అందుకున్నారు. ప్రైవేట్ రంగ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమం కోసం పోరాటం చేయడం, నిరుద్యోగులకు మార్గనిర్దేశం చేయడం వంటి సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, కనీస వేతనాల మండలి బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ దాసరి హరిచందన, కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రైవేట్ ఉద్యోగుల సంఘం నాయకులు గ్యార శ్రీనివాస్, కలకోటి సత్యనారాయణ, చంద్రశేఖర్, రవికుమార్ తదితరులు హాజరై గంధం రాములను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రైవేట్ రంగ ఉద్యోగుల సంక్షేమానికి గంధం రాములు చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత రాజేందర్‌కు మాదిగల సన్మానం



**చేర్యాల, మే 3 (జనంసాక్షి) :** ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దళిత నాయకులకు అందించే దళితరత్న అవార్డును చేర్యాలకు చెందిన ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు భూమిగారి రాజేందర్ ను ఆదివారం మాదిగ కుల సంఘం పెద్దమనుషులు సన్మానం చేసి అభినందించారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళిత సమాజం కోసం నేను చేస్తున్న సేవను గుర్తించి దళితరత్న అవార్డు ఇవ్వడం జరిగిందని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముస్త్యాల బాల్ నర్సయ్య. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ముస్త్యాల నాగేశ్వరరావు, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ముస్త్యాల కిష్టయ్య, కుల పెద్దమనిషి మల్లిగారి యాదయ్య, సీనియర్ అడ్వకేట్ భూమిగారి మనోహర్, భూమిగారి రత్నం, ఎర్రోళ్ల శ్రీనివాస్, మల్లిగారి సూరయ్య, రామగల్ల బాబు, మల్లిగారి శ్రీనివాస్, భూమిగారి శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

**తలకొండపల్లి, మే 3 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో ఆదివారం శ్రీ ఆంజనేయ స్వామి పునఃప్రతిష్ఠ,ధ్వజస్థంభ ప్రతిష్ఠ,గణపతి,సీత రామచంద్ర స్వామి, విగ్రహాల ప్రతిష్టాపన వైభవంగా జరిగింది.గత మూడు రోజులుగా వేద పండితులు గూడ నరసింహ శర్మ,గూడ శ్రీనివాసమూర్తి,ల మంత్రోచరణల మధ్యన పూజలు కొనసాగగా చివరి రోజు విగ్రహ ప్రతిష్టాపన కన్నుల పండుగవగా సాగింది.ఈ మహోత్సవ కార్యక్రమం తిలకించడానికి గ్రామస్థులే కాకుండా తలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఐక్యత ట్రస్ట్ చైర్మన్ టాస్క్ సీ.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,లు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ప్రజలు భక్తి శ్రద్ధలతో హోమాలు,యాగాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత మూడు రోజులుగా ప్రతిష్ట ఉత్సవాలకు సంబంధించి నిర్వహించిన హోమాలు, పూజలు నిర్వహించడంతో పాటు,విగ్రహ ప్రతిష్ట ఉత్సవం వేద పండితుల మంత్రోచ్చారణలతో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు.యాగశాలకు సంబంధించి ప్రధాన కలశాలకు పూజలు,గణపతి పూజ, పుణ్యాహవచనం,నిర్వహించడంతో పాటు గ్రామస్థులు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నీరాజనం, మహామంత్ర పుష్పం,వేద పండితులచే ఆశీర్వచనం, పండిత సత్కారం జరిగాయి.అనంతరం ఆలయం వద్ద సీతారాముల కళ్యాణం కన్నులపండువగా సర్పంచ్ భారతమ్మ గోపాల్,కొమిరెడ్డి రఘుమారెడ్డి కిష్టమ్మ దంపతులు కూర్చొని ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు వేలాదిమంది భక్తజనం హాజరై తిలకించి పులకించారు.శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఆలయ భక్త కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కన్నులపండువగా సాగిన ఈ మహోత్సవంతో చౌదర్ పల్లి గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొన్నది.అనంతరం ఆలయ భక్త బృందం అతిథులను శాలువాతో సన్మానించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెరిగే భారతమ్మ గోపాల్,ఉప సర్పంచ్ తడిసిన జ్యోతి ప్రదీప్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహా,తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి



ప్రభాకర్ రెడ్డి,లింగారావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,సిఐ జానకిరాం రెడ్డి,నాయకులు కసిరెడ్డి వెంకట్ రెడ్డి,హరిందర్ రెడ్డి,తడిసిన నరేష్ రెడ్డి,చంద్రయ్య,రామస్వామి,తూర్పు శ్రీను,బీసా శ్రీనివాస్ రెడ్డి,రాంరెడ్డి,రవికిరణ్ రెడ్డి,బహుగుణ రెడ్డి,పాండు గౌడ్,కొండల్ రెడ్డి,గణేష్,శ్రీనివాస్ రెడ్డి,జల్గం శ్రీశైలం,బండారు శ్రీను,సత్యనారాయణ,జాజాల నరేష్,మాడ్గుల అఖిల్,ఆలయ కమిటీ సభ్యులు,భక్త బృందం,భక్తులు,మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో అక్షరాభ్యాసాలు, చిన్నారులకు అన్నప్రసాలు



**నాగర్ కర్నూల్, మే 3 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గర గల శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో ఆదివారం నాడు దేవతా నక్షత్రం అనురాధ నక్షత్రం ఉండటంతో శుభ కార్యాలయంలో భాగంగా నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల నుండి వచ్చిన శాస్త్రోక్తంగా 4కి అక్షరాభ్యాసాలు, ఇద్దరికి చిన్నారులకు అన్నప్రాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి. నవీన్ కుమార్ తెలిపారు. అనంతరం ఆలయంలో భక్తులు అమ్మవారికి సామూహిక అర్చనలు, కుంకుమార్చన నిర్వహించారు.ఈ సరస్వతి దేవాలయంలో ప్రతిరోజు అక్షరాభ్యాసాలు 3 సంవత్సరాల లేదా 5 సంవత్సరాల నుండి చిన్నారులకు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజ అన్నప్రాస కార్యక్రమాన్ని 5 నెలలు పూర్తిగా నిండి 6వ రోజు పడిన వారికి అన్న ప్రాస కార్యక్రమం వేద మంత్రోచరణనల మధ్య నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారిని దర్శించిన భక్తులందరికీ ఆలయ ఆవరణలో ప్రతిరోజు అన్నప్రసాద వితరణ ఉందని తెలిపారు. అనంతరం భక్తులందరికీ వేద ఆశీర్వచనం తీర్థప్రదల పంపిణీ చేశారు. పూజా వివరాలకు 9441303182లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆకారపు విశ్వనాథం, నరహరి, బాలస్వామి, శివకుమార్ నవీన్, భార్గవి, భక్తులు, మహిళలుతదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
04 మే 2026

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- **ఎమ్మెల్యే రోహిత్ రావు**



**మెదక్, మే 3 (జనం సాక్షి) :** మెదక్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మెదక్ నియోజకవర్గంలోని ఒక్క రైతుకైనా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని స్పష్టంగా పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎం. నగేష్ తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా మరియు ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు తగిన ధర సమయానికి అందేలా చూడటం అధికారుల బాధ్యత అని అన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావు మరింతగా మాట్లాడుతూ, రైస్ మిల్లర్ల ద్వారా రైతుల ధాన్యం కొనుగోలులో ఎటువంటి అవకతవకలు, ఆలస్యాలు లేదా ఇబ్బందులు కలిగితే వాటిని తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రైతుల నుండి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలు సక్రమంగా నిర్వహించబడాలని, ఎక్కడైనా నిర్లక్ష్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా సౌకర్యాలు, గోదాముల ఏర్పాట్లు, అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వారికి అండగా నిలబడటం తమ కర్తవ్యమని అన్నారు. చివరగా, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తక్షణమే చేపట్టాలని అదనపు కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## మొక్కజొన్న వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మల్దకల్, మే 3 (జనంసాక్షి) :** గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆదేశాలతో మల్దకల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ విద్యాలయం పక్కనఆదివారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మల్దకల్ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,మాజీ ఎంపీపీ వై రాజారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సింగల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి, వెంకటన్న,మాజీ సర్పంచ్, నరేందర్, మధు,పరుశరాముడు, తిమ్మరాజు,ఏఈఓ రాహుల్,సీఈఓ కిరణ్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాలు రూపాయలు 2400మద్దతు ధర నిర్వహించిందని,తేమ శాతం 14 శాతం ఉండాలని, వరిమద్దతు ధర క్వింటాలు 2389 రూపాయలు,తేమ శాతము 17 శాతం ఉండాలని,రైతులు ప్రభుత్వ కేంద్రాలలో అమ్ముకోవాలని సూచించారు.

## హజ్ యాత్రికులకు ఘన సన్మానం



**మెదక్, మే 3 (జనం సాక్షి) :** ప్రతి ముస్లిం తన జీవితకాలంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయడం ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక కర్తవ్యమని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు.మెదక్ జిల్లా కేంద్రంలోని షాదీఖానాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులను పద్మ దేవేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హజ్ యాత్ర ముస్లింలకు అత్యంత పవిత్రమైనదిగా భావించబడుతుందని, అల్లాహ్‌కు మరింత దగ్గరయ్యే అవకాశం ఈ యాత్ర ద్వారా లభిస్తుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది పలు మంది ముస్లింలు హజ్ యాత్రకు వెళ్తున్నారని, ఇది జిల్లాకు గర్వకారణమని అన్నారు. యాత్రలో శారీరక, మానసిక సిద్ధతతో పాటు క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని సూచించారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు,మౌలానా జావీద్ అలీ, ఖాజీ మొయిజ్, ముఫ్తీ సాబేర్, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిండ్ల. ఆంజనేయులు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కిరెడ్డి. కృష్ణారెడ్డి, కో కన్వీనర్లు గడ్డమీది. కృష్ణ గౌడ్, లింగారెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్ లు జుబెర్ అహ్మద్, సోహెల్, బట్టి. ఉదయ్ కుమార్,దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, నాయకులు హామీద్, సాదిక్ అలీ,ఫాజిల్, ఇందాద్,ఇస్మాయిల్, మహమ్మద్, ఫరూక్, అమీర్, సర్దార్,సాయి కుమార్, వనం.లత తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- **జిల్లా ఎస్పీ వినీత్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 3 (జనం సాక్షి) :** జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవ హరించి కలిసికట్టుగా ముందుకు రావాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. బాల్యవివాహాలు చట్టప రంగా నిషేధించబడినవని, 18 సంవత్సరాల లోపు బాలికలు మరియు 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం జరపడం చట్ట ప్రకారం నేరమని స్పష్టం చేశారు.బాల్యవివాహాలు బాలల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూప డమే కాకుండా, వారి విద్యాభ్యాసాన్ని మధ్యలోనే నిలిపివేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల భవిష్యత్తు, ఆర్థిక స్వావలంబన, ఆరోగ్య భద్రతపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. సమాజంలో అజ్ఞానం, సంప్రదాయాల పేరుతో ఇలాంటి ఘటనలు జరుగుతుండటం ఆందోళనకరమని అన్నారు.తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక నాయకులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని బాల్యవివాహాలను నిరోధించడంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, తమపై బలవంతంగా వివాహం జరపడానికి ప్రయత్నిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాల్యవివాహాల నిరోధానికి ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని అన్నారు.ఎవరైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు గమనించినట్లయితే సమీప పోలీస్ స్టేషన్, డయల్ 100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ "బాల్యవివాహాలకు చెక్ బాలల భవిష్యత్తుకు సెక్యూర్" అనే సందేశాన్ని సమాజానికి అందించాలన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయున్ని సన్మానించిన ఎమ్మెల్యే



**పెబ్బేరు, మే 3 (జనం సాక్షి) :** ఇటీవల ఉపాధ్యాయ వృత్తిలో పదవీ విరమణ పొందిన పెబ్బేరు మున్సిపాలిటీకి చెందిన బచ్చల కూర స్వామినాథ్ ను వారి నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి ఘనంగా శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు సమాజానికి అమూల్యమైన సేవలు అందించిన మహానుభావులని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు జ్ఞానం మాత్రమే కాకుండా నైతిక విలువలు, శీలం, క్రమశిక్షణలను కూడా బోధించారు. మార్గదర్శకత్వం వల్లనే అనేక మంది విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించారు. అందుకే, విశ్రాంత ఉపాధ్యాయులను గౌరవించడం మన బాధ్యత అని మీూా మేఘారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు దయాకర్ రెడ్డి రణధీర్ రెడ్డి కౌన్సిలర్ జములమ్మ పెద్ద రాముడు ఉపాధ్యాయులు చిన్న రాములు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

- **నీట్ పరీక్షకు 911 మంది అభ్యర్థుల హాజరు**
- **కట్టుదిట్టమైన ఏర్పాట్లతో సజావుగా ముగిసిన నీట్ పరీక్ష**



**గద్వాల నడిగడ్డ, మే 3 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో నీట్ పరీక్షను ఆదివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలలతో పాటు బాలుర, బాలికోన్నత పాఠశాలలలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో పరీక్షను సజావుగా నిర్వహించారు. మొత్తం 930 మంది అభ్యర్థులకు గాను 911 మంది పరీక్షకు హాజరైనట్లు నీట్ సిటీ కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతి ఇవ్వడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖ సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించగా అభ్యర్థులను మధ్యాహ్నం 1:30 గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తమ పోలీసు బృందంతో ఆయా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును నియమించారు. బాలికల జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి నీట్ పరీక్షను విజయవంతం చేసినట్లు ఈ సందర్భంగా సిటీ కోఆర్డినేటర్ తెలిపారు. అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగిలయ్య, ముఖ్య పర్యవేక్షకులు వీరన్న,కృష్ణ, జహీరుద్దీన్,రేణుకా దేవి, పరిశీలకులు, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు, తదితరులు పరీక్షను సజావుగా నిర్వహించేందుకు విధులు నిర్వహించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పురిగుడిసె దగ్ధం



**చిన్నశంకరంపేట, మే 3 (జనం సాక్షి) :** ప్రమాదవశాస్తు షార్ట్ సర్క్యులేట్ తో పురి గుడిసె సోమవారం పూర్తి దగ్ధమైన సంఘటన మండలంలోని మల్లుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటింబుకుల వివరాలు ఇలా ఉన్నాయి.. ఇదే గ్రామానికి చెందిన అరికెల నాగమణి– రమేష్ నివాస పురిగుడిసె షార్ట్ సర్క్యూట్ పూర్తిగా దగ్ధం అయింది.నిత్యవసర వస్తువులు, బట్టలు, బంగారం,వెండి, లక్ష రూపాయల నగదు కాలిపోయాయి. ప్రభుత్వం బాధితులను ఆదుకొని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ ఇమ్మడి నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పల్లె దవాఖాన నిర్మాణానికి భూమి పూజ



**కేటీదొడ్డి, మే 3 (జనం సాక్షి) :** గ్రామ ప్రజలకు మెరుగైనా వైద్య సదుపాయాలు చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ పల్లె దవాఖానను ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచు నాగమ్మ తెలిపారు. మండలంలోని నందిన్నె గ్రామంలోని ఆదివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఆదేశాల మేరకు సంత బజారు సమీపన దవాఖాన భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చిన్న జ్వరం వచ్చినా లేదా, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నా మనం మండలం కేంద్రానికో లేదా గద్వాల్‌కో వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు మన ఊరిలోనే వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు పుష్ప, వార్డు మెంబర్లు హుజురప్ప, మల్లయ్య, దేవప్ప, మహాదేవ్, నాగేశ్, వెంకటేశ్వర్ రెడ్డి, రతన్‌పాండు, తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- **టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి**

**సదాశివపేట, మే 3 (జనం సాక్షి) :** ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి ఆరూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలను సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, గ్రామ సర్పంచ్ నాయి కోటి లావణ్య మధు,స్థానిక నాయకులు, లబ్ధిదారులతో కలిసి నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు సొంతింటి కల సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి గూడు కలిపించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంగారెడ్డి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించి, వాటిని లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు.అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని టీజీఐఐసి చైర్మన్ సూచించారు.నూతన ఇంటి గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులకు నాయకులు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ రేష్మ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్దన్న,ఆరూర్ గ్రామ మాజీ సర్పంచ్ నాయికోటి మధు,గ్రామ ఉప సర్పంచ్ విఠల్,వార్డు మెంబర్లు భారత్,భాగ్యలక్ష్మి, అంజయ్య, మన్నె నాగేష్,పద్మ,భారతమ్మ,రమేష్,లక్ష్మీ,నాగేష్,సర్పంచులు బలరాం అనిత శ్రీనివాస్, షాబొద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై నిరంతర పోరు

- **ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకుడు ఈరి భూమయ్య**
- **చేర్యాల మండలంలో సంఘం ఆవిర్భావ దినోత్సవం**



**చేర్యాల, మే 3 (జనంసాక్షి) :** విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై నిరంతరం పోరు సాగించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మాజీ జిల్లా నాయకుడు ఈరి భూమయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గూడెపు సుదర్శన్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం చేర్యాల, ముస్త్యాల, ఆకునూరులో సంఘం జెండాను ఆవిష్కరించి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్త్యాలలో ఈరి భూమయ్య జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ.. మన దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైందన్నారు. యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలను, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను, నైతిక విలువలను, మానవత్వాన్ని పాదుకొల్పడానికి ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు గూడెపు సుదర్శన్, సుంకోజు రజిత, నంగి సత్తయ్య, చింత బాబా, గూడెపు సంతోష, మనేపల్లి కృష్ణ, స్పర్జన్, సంయుక్త, సహస్ర, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనకు ఆత్మవిశ్వాసం ముఖ్యం




**మక్తల్, మే 3 (జనంసాక్షి) :** మక్తల్ మండలంలోని మాధ్వార్ గ్రామంలో విద్యా ప్రాధాన్యతను ప్రతిబింబించే విధంగా గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పదవ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఘనంగా అభినందన సన్మాన సభ నిర్వహించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో విజయాన్ని సాధించిన సుమారు 50 మంది విద్యార్థులను శాలువాలతో సత్కరించి, ప్రోత్సాహకంగా రామకృష్ణ మఠం వారు ప్రచురించిన మేలుకో నేస్తమా అనే పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్ కెరీర్‌పై సమగ్ర మార్గదర్శకత్వం అందించారు. పది, ఇంటర్ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులపై అవగాహన కల్పిస్తూ, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమైన నైతిక విలువలు, మంచి అలవాట్లు, సానుకూల దృక్పథం, మంచి స్నేహితుల ప్రాధాన్యతను వివరించారు. లక్ష్య సాధనకు ఆత్మవిశ్వాసం ముఖ్యమని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కవి కాళోజీ నారాయణరావు "పుట్టుక నీది, చావు నీది, బ్రతుకంత దేశానిదే" అనే స్ఫూర్తిదాయకమైన మాటలను గుర్తు చేస్తూ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులను ప్రేరేపించారు.గ్రామ పెద్దలు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ, ఉన్నత విద్య కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ సంఘం నాయకులు, లతారాజా ఫౌండేషన్ వరి"డా. అంబేద్కర్ ఎవరు? ఆయన ఏం చేశారు? భారత భాగ్య విధాత బాబాసాహెబ్ జీవితం – కార్యాచరణ" అనే పుస్తకాన్ని విద్యార్థులకు బహుమతిగా అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ రిటైర్డ్ హెచ్ఎం జగదీష్ కుమార్, జంగం బసవరాజ్, పాఠశాల హెచ్ఎం వెంకట్రాములు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఉప సర్పంచ్ శివాని,డాక్టర్ ఆశప్ప, బాట నరసింహ, గణపురం నగేష్, కురువ మల్లేష్, బాట జయమ్మ, గుడిసె తిమ్మయ్య, గాల్ల రాములు, బిచ్చలి బ్యాంకు నరసింహ, పంచాయతీ కార్యదర్శి నస్లాయి తిమ్మయ్య నస్లాయి, నాగరాజు, ఆర్ఎంపీ రామకృష్ణ, శివపుల్ల లక్ష్మయ్య, వడ్ల భాను ప్రసాద్, బుడబోయి చంద్రప్ప, పోలీస్ లక్ష్మారెడ్డి గుడిసె రాజు, బాట రాజు,బాట బీమాప్ప, జంగం నరసింహులు తదితరులు, గ్రామ యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసుల సమయస్ఫూర్తి



- విద్యార్థినికి అండగా నిలిచిన సిబ్బంది

**వరంగల్ బ్యూరో, మే 03 (జనం సాక్షి) :** హన్మకొండ నక్కలగుట్టలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో (కేజీబీవీ) పరీక్ష రాయడానికి వచ్చిన శ్రావ్య అనే విద్యార్థిని తన హాల్ టికెట్ పోగొట్టుకోవడంతో ఆందోళనకు గురైంది. జనగామ జిల్లా సూరారం గ్రామానికి చెందిన ఆమె పరిస్థితిని గమనించిన కాజీపేట ట్రాఫిక్ పెట్రోలింగ్ సిబ్బంది పిసి రాజేందర్ (1415), హెచ్‌జి సతీష్ (321) వెంటనే స్పందించారు. పరీక్షకు కేవలం 15 నిమిషాల సమయం మాత్రమే ఉండటంతో, మొబైల్ ద్వారా హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసి, సమీపంలోని జిరాక్స్ సెంటర్‌లో ప్రింట్ తీసి సకాలంలో విద్యార్థినికి అందజేశారు. వారి సమయస్ఫూర్తి వల్ల విద్యార్థిని ఏడాది కష్టం వృథా కాకుండా కాపాడబడింది. ఈ ఘటనపై స్థానికులు పోలీసుల మానవత్వాన్ని ప్రశంసించారు.

# నిర్దేశిత లక్ష్యాలతో అభివృద్ధి పనులు వేగవంతం

- రూ.163 లక్షలతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన
- వచ్చే ఎన్నికల నాటికి అభివృద్ధిలో కాజీపేటకు నూతన రూపం
- ప్రజా పాలన మెరుగుపరచడమే లక్ష్యం ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి మే 3 (జనంసాక్షి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నామని శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కాజీపేట 63వ డివిజన్ పరిధిలో సుమారు రూ.163 లక్షల వ్యయంతో చేపట్టిన అంతర్గత రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు నిర్దేశిత లక్ష్యాలను ఏర్పరచి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంబంధిత కాంట్రాక్టర్లు పనులను ఆలస్యం చేయకుండా సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అధికారులకు నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు.గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రతి డివిజన్‌లో గతంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.గత పాలనలో కేవలం శంకుస్థాపనలకే పరిమితమై, అభివృద్ధి పనులు నిలిచిపోయాయని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నప్పటికీ ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడైనా లోపాలు లేదా అన్యాయం జరిగితే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి కాజీపేటను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి నూతన రూపంలో తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ఎంబీబీఎస్ పట్టా పొందిన హరిప్రియ

- వ్యవసాయ కుటుంబం నుంచి వైద్య రంగంలోకి తొలి అడుగు



**చింతలమానేపల్లి మే 3 (జనం సాక్షి) :** సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి ఉన్నత విద్యను అభ్యసించి వైద్యురాలిగా ఎదిగిన హరిప్రియ మండలానికి గర్వకారణంగా నిలిచింది. చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన డోంగ్రే సదాశివ్-అమృత దంపతుల కుమార్తె హరిప్రియ ఎంబీబీఎస్ పట్టా సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. ముఖ్యంగా మండల కేంద్రం నుంచి ఎంబీబీఎస్ పట్టా అందుకున్న తొలి మహిళగా నిలవడం విశేషం.

హరిప్రియ తన ప్రాథమిక విద్యను సిర్పూర్(టి) సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు అభ్యసించింది. అనంతరం కరీంనగర్‌లోని సి.ఓ.ఈ పాఠశాలలో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివి ప్రతిభ కనబరిచింది. ఇంటర్మీడియట్‌ను హైదరాబాద్ గౌలిదొడ్డి సి.ఓ.ఈ కళాశాలలో పూర్తి చేసిన ఆమె, 2020లో ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.పట్టుదల, కృషితో వైద్య విద్యను విజయవంతంగా పూర్తిచేసిన హరిప్రియ శనివారం నిర్వహించిన 175వ బ్యాచ్ పట్టాభిషేక వేడుకలో ఎంబీబీఎస్ గ్రాడ్యుయేషన్ పట్టా తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రుల ఆశీర్వాదాలతో ఆమె డాక్టర్ పట్టా స్వీకరించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతి వైద్యురాలిగా ఎదగడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక, సామాజిక పరిమితులు ఉన్నప్పటికీ లక్ష్యసాధన కోసం కష్టపడి చదివితే గ్రామీణ విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనే నమ్మకాన్ని హరిప్రియ విజయగాథ మరోసారి చాటిచెప్పిందని పలువురు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. హరిప్రియ సాధించిన ఈ విజయం మండలంలోని విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తోందని స్థానికులు పేర్కొన్నారు.

# నీట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):** జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తూ సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో వినాయక్ చౌక్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్, బంగారిగూడలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్-,బంగారిగూడలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, బంగారిగూడ తెలంగాణ లోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, కేఆర్కే కాలనీ క్రాస్ రోడ్ లోని తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలుర), కేఆర్కే కాలనీ రోడ్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ / జూనియర్ కాలేజ్ గర్ల్స్ కేంద్రాలను ఎస్పీ తో కలిసి తనిఖీ చేశారు. ప్రధానంగా పరీక్షా కేంద్రాల్లో అమలవుతున్న బయోమెట్రిక్ విధానం, సీసీ కెమెరాల పనితీరు, అభ్యర్థుల అటెండెన్స్ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రూ, ఆర్డీఓ జగదీశ్వర్ గౌడ్, కో-ఆర్డినేటర్ అశోక్, వివిధ కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి విలయతాండవం.. భగ్గుమంటున్న భానుడు..

- అగ్నికి ఆహుతవుతున్న పంటలు..
- దిక్కుతోచక దిగులు చెందుతున్న బాధితులు..
- చేతికందే సమయంలో అగ్గిపాలు..
- ఆందోళన చెందుతున్న రైతన్నలు..
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు..







**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రస్తుత వేసవికాలంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పచ్చని పంటలు అగ్ని ప్రమాదాలకు ఆహుతవుతున్నాయి. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో భానుడు బగ్గుమంటుండడంతో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడం, లేదా పోడు భూముల వద్ద కార్చిచ్చు కారణంగా ఎకరాల కొద్దీ పంటలు దగ్ధమవుతున్నాయి. ముఖ్యంగా మక్కజొన్న పంటలు అత్యధికంగా అగ్నికి ఆహుతవుతున్నాయి. జిల్లాలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఇటీవలె నిప్పులు చెరిగే ఎండలతో మొక్కజొన్న పంటలు కాలి బూడిదవుతున్నాయి. పండిన మక్క పంట చేలలోనే కాలిపోతుండడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. మొగుళ్లపల్లి మండలం పెద్దకోమటిపల్లి, గణేశ్‌పల్లి గ్రామాల మధ్య గత నెల 26న సుమారు 9 మంది రైతులకు చెందిన 17ఎకరాల మొక్కజొన్న పంటకు నిప్పంటుకొని కాలిబూడిదైంది. ఇది జరిగి వారం గడువకముందే టేకుమట్ల మండలం రామక్రిష్టాపూర్ గ్రామంలో బోయ రమేశ్‌కు చెందిన మూడు ఎకరాల పంట మంటల్లో కాలిపోయింది. శుక్రవారం మళ్లీ మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో సుమారు 17 ఎకరాల్లో మొక్కజొన్న పంట కాలిపోయింది. చేతికొచ్చిన పంట మంటల్లో కాలిపోతుండడంతో రైతులు విలపిస్తున్నారు. అదేవిధంగా చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామ శివారులో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుని సుమారు 16ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన స్థానిక రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అగ్నిప్రమాదంలో గోపగాని రవీందర్‌కు చెందిన సుమారు నాలుగున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంటతో పాటు దాదాపు 45 పైపులు కాలిపోయాయి. అలాగే గోపగాని చిన్న వెంకన్న కౌలు తీసుకుని సాగు చేసిన నాలుగున్నర ఎకరాల్లో పంట పూర్తిగా కాలిపోయాయి, సుమారు 75 పైపులు దగ్ధమయ్యాయి. ఆరెల్లి కృష్ణమూర్తికి చెందిన రెండెకరాల్లో పంటతో పాటు సుమారు 25 పైపులు, 100 బరదాన సంచులు, రెండు పరదాలు పూర్తిగా కాలిపోయాయి. మేరుగు ప్రభాకర్‌కు చెందిన రెండెకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. శుక్రవారం చింతకుంట రామయ్య పల్లె గ్రామానికి చెందిన వీరమనేని రేణుక రెండు ఎకరాలు, పడిదల సంపత్ రావు రెండెకరాల మొక్కజొన్న అగ్నికి ఆహుతైంది. మండుతున్న ఎండలతో ఇలా రోజుకో చోట పంటలు అగ్ని ప్రమాదాలకు గురవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పుసప్పు చేసి పెట్టుబడులు పెట్టినా, పంట చేతికొచ్చే సమయంలో అగ్నిప్రమాదంలో బుగ్గి పాలవుతుండడంతో బాధిత రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బాధిత రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి, మే 3 (జనం సాక్షి) :** హనుమకొండ నగరం వడ్డేపల్లి 60వ డివిజన్ లో 1 కోటి 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వడ్డేపల్లి ప్రాంతంలో ఈ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం కావడం స్థానిక ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు తల్లి-శిశు సంరక్షణ, టీకాలు, నిర్ధారణ పరీక్షలు వంటి సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడం వల్ల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి వార్డులో అవసరమైన ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కేంద్రంలో అందించే సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని, ఆరోగ్య పరిరక్షణలో ముందుండాలని కోరారు. ప్రజలకు ఎలాంటి వైద్య సమస్యలు ఉన్నా సమీపంలోని ఈ కేంద్రాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, డీఎంహెచ్వో డాక్టర్ అల్లెం అప్పయ్య మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో గడ్డివాములు దగ్ధం



**చెన్నారావుపేట, మే 03 (జనంసాక్షి):** విద్యుద్ఘాతంతో ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండలంలోని పాపయ్యపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఇదే గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ లింగాల సారంగం, లింగాల సాంబయ్య, సూరయ్యలు పశుగ్రాసం కోసం తమ ఇంటి ఆవరణలో 13 ఎకరాల గడ్డివాములను నిలువ ఉంచారు. గడ్డివాముల పక్కనుండి వెళ్తున్న విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగులుకొని మంటలు చెలరేగి ప్రమాదవశాత్తు గడ్డివాములపై పడ్డాయి. దీంతో గడ్డివాములు మొత్తం దగ్ధమయ్యాయి. సుమారు రూ.1 లక్ష 4 వేల నష్టం వాటిల్లిందని బాధితులు లింగాల సారం గం, సాంబయ్య, సూరయ్యలు తెలిపారు.

# దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం దోహదం

**ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మన్మోహన్ రాజ్**

**వరంగల్ ఈస్ట్, మే 03 (జనం సాక్షి) :** ఎండాకాలం బాటసారుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రం ఎంతో దోహద పడుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐఎంఏ వరంగల్ ప్రెసిడెంట్ డాక్టర్ మన్మోహన్ రాజ్ అన్నారు. ముకాంబికా వరంగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంజీఎం హాస్పిటల్ ఎదురుగా ఐఎంఏ హాల్ ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సెక్రెటరీ వేములపల్లి నరేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ముకాంబికా వరంగల్ ఫౌండేషన్ దొడ్డ రమేష్ కుమార్, మంచాల విజయ్ కుమార్, దారా పూర్ణ సంతోష కుమార్ , దేవా అరవింద్, విడియాల సంక నూతన్, అంజిబాబు, ఇరుకుల నాగేశ్వరరావు, బజ్జూరి శ్రవణ్ కుమార్, తమ్మి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం రైతులను వణికిస్తున్న వరుణుడు

- ఉదయం దాన్ని ఆరబోత.. సాయంత్రం పోగు చేయడం
- గాలికి పరదాలు లేచిపోతున్నాయి



**గోవిందరావుపేట, మే 3 (జనంసాక్షి) :** ప్రతిరోజు ఎక్కడ వర్షం వస్తుందో అని రైతులు వణికిపోతున్నారు. ఉదయం పూట ఎండ మొదలవగానే ధాన్యాన్ని ఆరబోయడం సాయంత్రం వేళ ఉరుములు మెరుపులు ధాన్యాన్ని పోగు చేయడం భారంగా మారిందని రైతులు అంటున్నారు. ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులు గాలులు వస్తుండడంతో ధాన్యపు రైతులు బెంబేలెత్తిపోయారు. ఆగమేఘాల మీద పరిగెత్తుకు వచ్చి ధాన్యపు రాశులను పోగుచేసి పదాలు కప్పుకున్నారు. గాలి వేస్తుండడంతో కప్పుతున్న పరదాలు లేచిపోతుండడంతో పదే పదే వాటిని తీసుకువచ్చి కప్పడం వాటిపై బరువులు వేయడం రైతులకు కష్టంగా మారింది. యాసంగిలో సుమారు 6000 ఎకరాల్లో లక్నవరం చెరువు కింద రైతులు రబీ వరి సాగు చేశారు. అంతేకాక చిన్న చిన్న చెరువులు కుంటలు బోర్ల కింద మరో 2000 ఎకరాల వరకు యాసంగి వరి పంటను పండించారు. ఇప్పటికి సగం ధాన్యం కూడా బయటకు వెళ్లలేదు. ఈ నెలాఖరు వరకు వరి కోతలు దాన్యపు రాశలు ఉండే అవకాశం ఉంది. కానీ ప్రతిరోజు సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతం కావడం ఉరుములు మెరుపులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా 18 గ్రామ పంచాయతీలలో ఐకెపి ద్వారా 11 సెంటర్లు పిఏసిఎస్ ద్వారా మరో 10 సెంటర్ల ద్వారా రబీ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి వర్షము వడగళ్ల వాన లేకుండా రైతులు సేఫ్ జోన్ లో ఉన్నారు. ముందు ముందు ఏమైనా జరుగుతుందేమోనన్న భయం రైతులను వెంటాడుతోంది. మరో 20 రోజులు అయితే క్షేమంగా బయట పడతామని రైతులు అంటున్నారు.

# వరుస అగ్నిప్రమాదాలతో కుదేలవుతున్న రైతాంగం

- కండ్లముందే బూడిదవుతున్న 'బంగారు' పంట
- రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలవాలి.. లేదంటే ఆందోళన తప్పదు: జాదవ్ వికాస్ బీఆర్ఎస్ నాయకుడు



**కుభీర్, మే 03, (జనంసాక్షి):** కుభీర్ మండలంలో రైతన్నల కష్టం మంటల్లో కాలిపోతోంది. అహోరాత్రులు శ్రమించి పండించిన మొక్కజొన్న పంట, చేతికొచ్చే తరుణంలో వరుస అగ్నిప్రమాదాలకు ఆహుతవుతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. గత కొన్ని రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఈ ప్రమాదాలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. రెండు రోజుల క్రితమే దార్ కుభీర్, పార్డి (కె), నిగ్వా గ్రామాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దాదాపు 42 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దగ్ధమయ్యాయి. ఆ నష్టం నుంచి తేరుకోకముందే, ఆదివారం రంజిని తండా గ్రామ శివారులో మరో ప్రమాదం చోటుచేసుకుంది. నిల్వ ఉంచిన మొక్కజొన్న కుప్పలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా అంటుకున్నాయి. అటుగా వెళ్తున్న రైతులు అప్రమత్తమై, వ్యవసాయ బోరు మోటార్ల ద్వారా నీళ్లు చల్లి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయినప్పటికీ గణనీయమైన నష్టం సంభవించింది. వరుసగా జరుగుతున్న ఈ ప్రమాదాలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్లే ప్రధాన కారణమని, వేలాడే విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల తమ పంటలు బూడిదవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే తాము లక్షలాది రూపాయల పెట్టుబడిని నష్టపోవాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. "ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంట కళ్ళముందే కాలిపోతుంటే చూస్తూ ఉండలేకపోతున్నాం" అని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని కుభీర్ మండల రైతాంగం డిమాండ్ చేస్తోంది.

**అన్నదాతలకు అండగా నిలవండి : జాదవ్ వికాస్ నాయక్ బీఆర్ఎస్ నాయకుడు**



కష్టపడి పండించిన పంట కళ్లముందే కాలి పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించాలి. పాతబడిన విద్యుత్ తీగలు, లూజ్ కాంటాక్ట్ వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి, వాటిని వెంటనే సరిచేయాలి. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలి. లేదంటే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. కష్టాల్లో ఉన్న అన్నదాతలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

## దొంగతనాలు అరికట్టేందుకే సీసీ కెమెరాలు



**గరిడేపల్లి, మే 3 (జనం సాక్షి) :** పంట పొలాల్లో దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు గరిడేపల్లి ఎస్ ఐ చలికంటి నరేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఊరు బయటలో ఉన్న వ్యవసాయ భూముల వద్ద కీతవారిగూడెం శివారులో ఉన్న బృందావన్ ఫంక్షన్ హాల్ సమీపంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. హుజూర్నగర్ సిఐ చరమందరాజు ఆధ్వర్యంలో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇటీవల అప్పన్నపేట కీతవారిగూడెం పంట పొలాల్లో రైతులకు సంబంధించిన మోటర్లు కేబుల్ వైర్లు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టే భాగంలో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన మోటర్లు, కేబుల్ వైర్, ట్రాక్టర్ వీల్స్, ట్రాక్టర్ కు సంబంధించిన గొర్రు, కల్టివేటర్లు లాంటి వస్తువులకు భద్రత కల్పించేందుకుగాను ఈ సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఆయన వివరించారు. స్థానికుల సహకారంతో దొంగతనాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు



**నూతనకల్, మే 3 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు మే2, 2026న ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పుల్లూరి రమ్య భర్త ఏక స్వామి రాత్రి 11:30 గంటలకు పురిటి నొప్పులతో హాస్పటల్ కి రాగా మే3, 2026న మండల వైద్యాధికారి డాక్టర్ ఆశ్రితా రెడ్డి ఉదయం 8:45 నిమిషాలకు సాధారణ డెలివరీ చేయడం జరిగింది రమ్య ఆడ శిశువుకు జన్మనిచ్చింది తల్లి కూతురు ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ తెలిపారు రెండు మాసాలలో ఈ ప్రైమరీ హెల్త్ సెంటర్లో 6గురు తల్లులకు సాధారణ డెలివరీ చేశామని డాక్టర్ ఆశ్రితా రెడ్డి తెలిపారు మండల వ్యాప్తంగా ప్రజల నుండి హర్షం వ్యక్తం చేస్తున్నారు ప్రైవేటు హాస్పిటల్ లో లక్షలు ఖర్చుపెట్టినా నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉన్న చేయడం లేదు ప్రైవేటీకరణలో సొమ్ము చేసుకుంటున్న ఈ తరుణంలో నార్మల్ డెలివరీ చేయడం గొప్ప అవకాశం గా ప్రజలు భావిస్తున్నారు డాక్టర్ ఆశ్రితా రెడ్డి ని, సిహెచ్ఓ చరణ్ నాయక్ ని, హాస్పిటల్ బృందాన్ని మండల వ్యాప్తంగా అభినందిస్తున్నారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చరణ్ నాయక్, హెల్త్ సూపర్వైజర్ చిన్ని నర్సింగ్ ఆఫీసర్ శైలజ ప్రియాంక ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోత్కూర్‌లో ఘనంగా హిందూ సమ్మేళన వేడుక



**దోమ, మే 3 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామం లో గడప లోపల కులం గడప దాటితే హిందువులం అనే నినాదంతో హిందూ సమ్మేళన వేడుక నిర్వహించడం జరిగింది. ఈ ఇందులో భాగంగా స్వామీజీ శ్రీ శ్రీ శ్రీ రఘు త్తమాచార్యులు, మన్యశ్రీ దేవేంద్రరాజు , విభాగ్ ప్రచారక్, రాష్ట్ర సేవిక సమితి మహిళా వక్త కాసుల మానస, వేడుకలో భాగంగా ఆధ్యాత్మిక విషయాలను గురించి సంస్కృతిక కార్యక్రమాల గురించి మహిళలపై జరుగుతున్న సామూహిక అత్యాచారాల గురించి ఆమె ప్రసంగించి వాటిని ఎలా ఎదుర్కొనేలా తెలుపడం జరిగింది. సంఘ సంఘటితంగా హిందువులం కలిసి ఉండాలని తెలపడం జరిగింది. అదేవిధంగా చిన్నారులు సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా చిన్నపిల్లల భగవద్గీత పారాయణం, ఆద్యశ్రీ నందిని అశ్విని భరతనాట్యం, వివాన్ విలాస్ లవకుశ అభినయం, చిన్నారుల చేత రఘుకుల తిలక రామ కోలాటం, లక్షిత శ్రీ వర్ష, శ్రీ నిత్య కూచిపూడి, సాయి తనీష్ పియానో పైన ప్రార్థన గీతం, ఇట్టి వేడుకకు భారీగా తరలివచ్చిన చిన్నారులు, పురుషులు మహిళలు యువతి యువకులు బాలబాలికలు అధికంగా పాల్గొని హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సూర్యాపేట, మే 3 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1995-2000 విద్యా సంవత్సరాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాటి విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలోని తమ యొక్క నాటి స్మృతులు మరిచిపోలేని మధురానుభూతులని అన్నారు.26 ఏళ్ల తర్వాత నాటి విద్యార్థులంతా ఒకచోట కలుసుకొని జ్ఞాపకాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు.తమకు విద్యాబుద్ధులు నేర్పి నేడు ఉన్నత స్థాయిలో ఉండేలా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.అంతకు ముందు తమ నుండి దూరమైన ఉపాధ్యాయులకు,తోటి విద్యార్థులకు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుల్లయ్య, సోమేశ్వరరావు, సుదర్శన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పటేల్ నరసింహారెడ్డి, బ్రహ్మాచారి,గోపారపు రాజు, అరుణకుమారి, చంద్రకళ,నాటి విద్యార్థులు కౌన్సిలర్ ఎల్గూరి ఇందిరా వీరయ్య గౌడ్,నీరుడు రమేష్, సాంబచారి, శైలేందర్, సతీష్ కుమార్, మీరావలీ, గోపి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానానికి దుకాణాల వల్ల లాభమే తప్ప నష్టం లేదు

- వర్తక సంఘం స్పష్టం



**యాదగిరిగుట్ట మే 3 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం యాదగిరిగుట్ట దేవస్థానం కొండపై వ్యాపారం చేసుకుంటున్న వర్తక సంఘం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుత యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైన పూర్వం అరణ్యం లాగా ఉన్న సమయంలో, రవాణా సదుపాయం లేకున్నా భక్తుల కోసం కాలినడక మెట్ల మార్గం ద్వారా టెంట్ హౌస్ సామాగ్రి , పూజా ద్రవ్యములు, పాలు, పెరుగు, ఆహార పదార్థాలు లాంటి అనేక వస్తు సామాగ్రిని , సదుపాయాలను భక్తులకు అందిస్తూ స్వామివారిని నమ్ముకొని జీవిస్తున్న పేద మధ్య తరగతి కుటుంబాలు పెద్ద ఎత్తున ఉన్నాయి. కొండపైన దుకాణాల ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందుతున్న సుమారు 500 మందికి పైగా పేద మధ్యతరగతి కుటుంబాలను రోడ్డున పడేసే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని పలువురు కొండపైన దేవస్థానం వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ప్రతి సంవత్సరం 33 నుండి 50% పెంచి రెన్యువల్ చేసే విధానం రాష్ట్రంలోని అనేక దేవాలయాలలో ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇదే తరహాలో కొనసాగిందని వారు అన్నారు. దేవాదాయ శాఖ హిందూ రిలీజియన్ యాక్ట్ 30/87 నిబంధన ప్రకారమే ఈ రెన్యువల్ ప్రక్రియ జరుగుతుందని యాదగిరిగుట్ట దేవస్థానంలో దుకాణాల రెన్యువల్ అనేది కొత్తగా వచ్చింది ఏం కాదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కొంతమంది తరచుగా పదేపదే కొండపైన దుకాణాలను టెండర్ నిర్వహించాలని అనడం ఎంతవరకు సమంజసం అని వారు అన్నారు. 114 దుకాణాలకు గాను కొండపైన ప్రస్తుతం పది దుకాణాలే ఉన్నాయని అన్నారు. ఈ పది దుకాణాలపై 114 మంది దుకాణాల యజమానులతో పాటు పరోక్షంగా అందులో పని చేసేవారు కలిపి మొత్తం 500 మంది ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఒకవేళ టెండర్ నిర్వహిస్తే పది దుకాణాలకే నిర్వహిస్తారా ? లేక 114 దుకాణాలకు నిర్వహిస్తారా ? అనేది ఫిర్యాదు చేస్తున్నవారు స్పష్టం చేయాలి అని కోరారు . 10 దుకాణాలకే టెండర్ నిర్వహిస్తే ఆ 10 దుకాణాలు ఇతర ప్రాంతాలకు చెందిన ధనవంతులు కార్పొరేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోతాయని అన్నారు. ఇదే జరిగితే ప్రస్తుతం ఈ దుకాణాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న సుమారు 500 ల పేద మధ్యతరగతి కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతారని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ దేవస్థానం దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తే నిరుద్యోగులు ఐదు నుంచి పదిలక్షల రూపాయల డిపాజిట్ కట్టి కోట్ల రూపాయల అద్దెను చెల్లించ గలుగుతారా ? అంత స్తోమత వారికి ఉంటుందా అనేది ఆలోచించాలని వారు అంటున్నారు. దుకాణాలకు టెండర్ నిర్వహించడం అంటేనే ఏ ప్రాంతం వారైనా పాల్గొనవచ్చు అనేది దాని ఉద్దేశం అంటే ఆ దుకాణాలకు స్థానికులు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన ధనవంతులు కార్పొరేట్ వ్యక్తులు టెండర్లు పాల్గొంటారు. దీనివల్ల ధనవంతులు కార్పొరేట్ వ్యక్తులైన ఇతర ప్రాంతాల వారికే ఆ దుకాణాలు దక్కుతాయి తప్ప స్థానికులకు ఆ దుకాణాలు దక్కవు అనేది స్పష్టం అవుతుందని పలువురు చెబుతున్నారు. అటువంటప్పుడు టెండర్ వేయడం వల్ల స్థానికులు నిరుద్యోగులకు లాభం ఎలా జరుగుతుంది ? టెండర్ నిర్వహించడం వల్ల ఇతర ప్రాంతాలకు చెందిన ధనవంతులు కార్పొరేట్ వ్యక్తులకే లాభం చేకూర్చినట్లు అవుతుంది కదా అని వారు అంటున్నారు కింద స్థానికులు కూలీలుగా పని చేయాల్సి వస్తుందని అంటున్నారు . కొండపైకి ఆర్టీసీ బస్సులను ఉచితంగా నడపడం వల్ల దేవస్థానానికి ప్రతినెల సుమారు రెండు కోట్ల రూపాయల చొప్పున సంవత్సరానికి యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైకి వచ్చే బస్సులలో మహిళలకు కూడా టికెట్ రుసుమును చెల్లిస్తుంది ఇది న్యాయమా ? దీనివల్ల దేవస్థానానికి భారం కాదా ? దేవాదాయ శాఖ కు సంబంధం లేని స్వర్ణ గిరి దేవాలయం వరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ ఇస్తూ పురుషులకు టికెట్ తీసుకుంటున్నారు. కొండపైకి వెళ్లే బస్సులలో కూడా మహిళలకు ఫ్రీగా ఇచ్చినా పురుషుల నుండి టికెట్ వసూలు చేయాలి కానీ ఎందుకు చేయడం లేదు దీనివల్ల దేవస్థానానికి నష్టమే కదా... కొండపైన దుకాణాల వల్ల దేవస్థానానికి లాభమే కానీ ఏనాడు నష్టం జరగలేదు. ఈ విషయాన్ని దుకాణాలు టెండర్ వేయాలని పదేపదే విమర్శిస్తున్న వారు గుర్తుంచుకోవాలి. అనాదిగా ఎంతో కాలం నుండి కొండపైన దుకాణాలను కష్టపడి నిర్వహిస్తున్న వారు స్థానికులైన పేదలు మధ్య తరగతి వారు నిరుద్యోగులే ఉన్నారు. వారంతా స్థానికులే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వారు అంటున్నారు.

## యువత భవిష్యత్తుకు మెగా జాబ్ మేళా



**భువనగిరి, మే 3 (జనం సాక్షి) :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని 23వ వార్డులో నిరుద్యోగ యువతతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ఆయన కుమార్తె కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 8, 9 తేదీల్లో అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి టోకెన్లు జారీ చేయడం, 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక పత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. ఈ జాబ్ మేళాలో ప్రైవేట్ రంగానికి చెందిన సుమారు 20 కంపెనీలు పాల్గొని 3500కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థలు పాల్గొనడం ద్వారా స్థానిక యువతకు నేరుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిరుద్యోగ సమస్యను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, యువత ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల విద్యాధికారి బండారు రవివర్ధన్, నిరుద్యోగ యువకులు గోపే బాబు, ఉడుత దుర్గాప్రసాద్, జంగిటి వరుణ్ తేజ, బర్రె నరేందర్, గంగారం రవితేజ, భూషపాక మల్లేష్, కొండమడుగు రాము, బుచ్చాల అనిల్, బర్రె క్రాంతి, బర్రె శ్రీకాంత్, భూషపాక రవి, నరాల శివ సాయి, బర్రె స్వామి, దర్గాయి మహేష్, కసిరబోయిన సాయి, గుడ్డంకి ప్రమోద్, నాయిని బింటు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**గుర్రంపోడు, మే 3 (జనంసాక్షి) :** గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో ఎంఈసి , సీఈసి గ్రూపుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ఫారూక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఎస్సెస్సీలో ఉత్తీర్ణులైన ముస్లిం, బౌద్ధ, క్రిస్టియన్, సిక్కు, విద్యార్థులు ఓసీ- 2, ఎస్సీ-2, ఎస్టీ-2, బీసీ- 5 నాన్ మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మైనారిటీలకు ఎంఈసీ, సీయిసి గ్రూప్ లలో సీట్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9985808900, 8464850954 ఫోన్ నంబర్లో సంప్రదించాలని సూచించారు.

## ఒక్క చిరునవ్వుతో సర్వ రోగాలు దూరం




**సూర్యాపేట, మే 3 (జనంసాక్షి) :** ఒక్క చిరునవ్వుతో సర్వ రోగాలు దూరమవుతాయని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం గురూజీ చాడపాపిరెడ్డి తెలిపారు.ఆదివారం జాతీయ నవ్వుల దినోత్సవం సందర్భంగా సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం తో పాటు బ్రాహ్మణ కళ్యాణ మండపంలో ప్రపంచ నవ్వుల వేడుకలలో శ్రీవాసవి సేవా సమితి అధ్యక్షులు బచ్చు పురుషోత్తం , బ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాధకులు భాస్కరాచారి, లింగయ్య, మల్లారెడ్డి, గోరెంట్ల శ్రీనివాస్, వేల్పుల సుధాకర్, సుదర్శన్ రెడ్డి, మమత, మంజుల, సరిత,జ్యోతి, రవికుమార్, సైదులు, బాణాల శ్రీనివాస్,వెంకన్న, మధు, మాధవి, ధనలక్ష్మి, కవిత,సంధ్య,రాజు, లింగయ్య, లక్ష్మి రవికుమార్,మురళీకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## మండుటెండల్లో తాగునీటి కోసం గ్రామస్థుల తంటాలు



**హాలియా, మే 3 (జనం సాక్షి) :** అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామపంచాయతీ పరిధిలోని సూరేపల్లి ఎక్స్ రోడ్ సమీపంలోని హాజారిగూడెం స్టేజి వద్ద నివసిస్తున్న ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండుతున్న వేసవి కాలంలో నీటి అవసరం మరింత పెరిగిన వేళ, తాగడానికి కూడా సరిపడా నీరు అందక స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పది ఇండ్లకు పైగా కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ, తాగునీటి సరఫరా గత కొంతకాలంగా పూర్తిగా నిలిచిపోయింది. పైపులైన్ సౌకర్యం ఉన్నప్పటికీ నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. దీంతో తాగునీటి కోసం సమీపంలోని బియ్యం మిల్లుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుని జీవనం కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆరోపిస్తున్నారు. గ్రామస్థుల మాటల్లోనే చెప్పాలంటే .. గుక్కెడు నీళ్లు ఇవ్వండి... ప్రాణాలు పోతున్నాయి.. అన్న స్థితికి పరిస్థితి చేరుకుందని వేదన వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగురాలు గుర్రం మంగమ్మ మాట్లాడుతూ తాగునీటి కొరతతో రోజువారీ జీవితం దుర్భరంగా మారిందని, చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీరు అందక ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో తాగునీటి అవసరం అత్యవసరమైనదని, ఇలాంటి సమయంలో నీటి సరఫరా నిలిచిపోవడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా ఆరోగ్యంపై పట్టింపు ఏది...?

- ఆహారంలో అధికంగా అజినామోటో
- ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై నియంత్రణ ఎక్కడ..?



**నాంపల్లి, మే 3 (జనం సాక్షి) :** శక్తి కోసం తినే ఆహారంలో రుచి కోసం వాడే అజినోమిటో వాడుతున్నారు.ముఖ్యంగా పేద ప్రజలు తక్కువ ధరకు లభించే చైనీస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లలో అధిక రుచి కోసం,ప్రాణానికి హానికరమైన విషపదార్థం అజినోమోటో అధికంగా వాడుతున్నారు.ఇది నాంపల్లి మండల కేంద్రంలో ఉన్న ఫాస్ట్ సెంటర్లలో విచ్చలవిడిగా వాడుతున్నారు.దీనిమీద అధికారులకు అలాంటి నియంత్రణ లేకపోవడంతో ప్రజలు అనారోగ్యంతో హాస్పిటల్‌కి క్యు కడుతున్నారు. అజినామోటో అనే పదార్థం మీద ప్రజలకి అవగాహన కూడా లేకపోవడం మరొక్క కారణం.చైనీస్ వంటకాలు,ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలలో వాడే అజినామోటో అంటే (మోనోసోడియం గ్లూటమెట్) వల్ల కలిగే ప్రధాన నష్టాలు తలనొప్పి, మైగ్రేన్, గుండె వేగంలో మార్పులు, నరాల బలహీనత వంటి వ్యాధులు వస్తాయి ఇది తేనె పూసిన కత్తిలాంటిది,రుచిని పెంచినప్పటికీ, దీర్ఘకాలంలో ఊబకాయం, అధిక రక్తపోటు (బి పి), థైరాయిడ్,మధుమేహం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు శరీరం చైతన్యాన్ని కోల్పోవడం, ఒళ్లంతా మొద్దుబారినట్లు అనిపించడం, తీవ్రమైన తలనొప్పి రావచ్చు గుండె కొట్టుకునే వేగంలో మార్పులు, పొట్టలో మంట, వికారం వంటి సమస్యలు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు ఇది మంచిది కాదు,సంతానోత్పత్తిపై కూడా ప్రతికూల ప్రభావం చూపవచ్చు రుచి బాగుండటంతో, దీన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఇతర ఆరోగ్యకరమైన ఆహారాలను ఇష్టపడకపోవడం జరుగుతుంది అజినోమోటోను మోతాదుకు మించి తీసుకుంటేనే ఈ దుష్ప్రభావాలు ఎక్కువగా ఉంటాయి. బయట దొరికే ఫాస్ట్ ఫుడ్, నూడుల్స్, మంచూరియన్ వంటి వాటిలో ఇది ఎక్కువగా ఉంటుంది కాబట్టి, వాటిని తగ్గించడం మంచిది.అలాగే అధికారులు కూడా ఫాస్ట్ సెంటర్ ల మీద ఒక్క కన్ను వేసి ఉంచి ప్రజా ఆరోగ్యాని కాపాడాలి అని మండల ప్రజల కోరుతున్నారు.

# బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను అధిగమించాలి

**టేకులపల్లి, మే 3 (జనంసాక్షి) :** బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజువారి లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి డైరెక్టర్ (పి. పి.)కే వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆదివారం ఇల్లందు ఏరియా లోని కోయగూడెం ఓ.సి.లలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కే.ఓ.సి. వ్యూ పాయింట్ నుంచి పని స్థలాలను సందర్శించి అక్కడ జరుగుచున్న పనులను పరిశీలించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జి.యం వి.కృష్ణయ్య ను అడిగి తెలుసుకున్నారు. తరువాత డైరెక్టర్ (పి. పి) కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధికమించాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని, ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. అంతేకాకుండా రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని, సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని అన్నారు.తరువాత ఇల్లందు ఏరియాలోని జి.యం కార్యాలయాన్ని సందర్శించి, జెకె-5ఓసీ, నూతన జే కే కోల్ మైన్ ప్రాజెక్ట్ కు సంబంధించిన రికార్డ్స్ పరిశీలించి రివ్యూచేపట్టారు. నూతన ఓ.సి కి సంబంధించిన పనులను త్వరగా పూర్తిచేసి బొగ్గు రవాణా జరిగేటట్లు చూడాలని ఏరియా జి.యం వి.కృష్ణయ్యకు సూచించారు.ఈ కార్యక్రమంలో యస్వో టు జియం రామస్వామి, పి.ఓ కే.ఓ.సి. గోవింద రావు, జే.కే.పి.ఓ. జాకీర్ హుస్సేన్, డీజిఎం పర్సనల్ అజ్మీర తుకారాం, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సి.ఆర్.బి. ప్రసాద్ రావు, డిజియం ఐ ఈ డి ప్రభాకర్, డీజిఎం (సివిల్) రవి కుమార్, డీజీఎం(యఫ్ ఏ) నాగలక్ష్మి కే.ఓ.సి మేనేజర్ శ్రీనివాస రావు,జే.కే మేనేజర్ పూర్ణచందర్, క్వాలిటీ మేనేజర్ రామదాసు, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.






## ఐస్‌క్రీమ్‌కూ యుద్ధం సెగ



**న్యూఢిల్లీ:**ఎండాకాలంలో చల్లని ఐస్‌క్రీమ్ తినాలని అనుకునే వారికి, ఇరాన్ యుద్ధం వేడి తగలనుంది. పశ్చిమాసియా ఘర్షణల కారణంగా అంతర్జాతీయంగా సరకు రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా ముడి సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో.. ఈ వేసవిలో ఐస్‌క్రీమ్ ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని నివేదికలు వస్తున్నాయి. ఐస్‌క్రీమ్‌లు, ప్రీమియం చాక్లెట్లలో రుచి కోసం వాడే అత్యంత కీలకమైన ఎండు ఫలాలు (డ్రై ఫ్రూట్స్), నట్స్ వంటి ముడి పదార్థాల ధరలు యుద్ధానికి ముందుతో పోలిస్తే.. 15-22% పెరిగాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వేసవి ఎండల వల్ల ఐస్‌క్రీమ్‌లకు గిరాకీ పెరుగుతుండగా, ముడి సరకుల వ్యయం అధికం కావడంతో కంపెనీల లాభాల మార్జిన్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.ప్రస్తుతం భరిస్తున్నా: ప్రస్తుతానికి చాలా సంస్థలు అదనపు భారాన్ని పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేయకుండా భరిస్తున్నాయి. అయితే పెరిగిన రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు ఆ వ్యయాలను తట్టుకోలేని స్థితికి నెట్టేస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 'డ్రై ఫ్రూట్స్, కోకో వంటి ముడి సరకుల సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడటంతో పాటు, అవి చేరడానికి ఎక్కువ సమయం పడుతోంది' అని చెబుతున్నారు. కొన్ని సంస్థలు ఇప్పటికే ఎంపిక చేసిన ఐస్‌క్రీమ్ ఉత్పత్తుల ధరలను పెంచాయి. ప్రత్యామ్నాయానికి మారే వీలు లేకుండా వేసవి ప్రారంభమయ్యే సమయంలోనే పశ్చిమాసియా సంక్షోభం తలెత్తడంతో.. ఐస్‌క్రీమ్ ఉత్పత్తుల తయారీ విధానాన్ని మార్చడానికి లేదా ప్రత్యామ్నాయ ముడి సరకులను అన్వేషించేందుకు కంపెనీలకు సమయం దొరకలేదు. 'ఉత్పత్తుల నాణ్యత విషయంలో రాజీపడలేం. కాబట్టి ఖర్చు భయంతో డ్రై ఫ్రూట్స్, నట్స్ వాడకాన్ని తగ్గించడం సాధ్యపడదని' కంపెనీలు చెబుతున్నాయి. అందువల్ల ఆయా ఉత్పత్తుల గరిష్ఠ చిల్లర ధరలను పెంచక తప్పదని పేర్కొంటున్నాయి.

# ఎల్ఐసీలో 20 శాతానికే ఒకే..

### బీమా రంగంలోకి 100% ఎఫ్‌డీఐలపై నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్:** భారతీయ బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) అనుమతిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో విదేశీ కంపెనీలు ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండానే పూర్తి స్థాయిలో పెట్టుబడులు పెట్టొచ్చు. భారీగా మూలధనాన్ని ఆకర్షించడం, పోటీని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌డీఐను నేరుగా (ఆటోమేటిక్) అనుమతించడం ద్వారా విదేశీ పెట్టుబడిదారులకు ఇకపై ప్రభుత్వ ముందస్తు అనుమతులతో పనిలేదు. ప్రస్తుతం బీమా సంస్థల్లో 74 శాతం వరకే ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. ఇకపై విదేశీ సంస్థలు 100 శాతం పెట్టుబడితో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) అనుమతితో సొంతంగా భారత బీమా వ్యాపారంలోకి ప్రవేశించవచ్చు. ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓలో ఎవరో ఒకరు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలన్న నిబంధన ఉంది. ఈ విధానపరమైన మార్పులకు పార్లమెంటు డిసెంబర్ 2025లో 'సబ్‌కా బీమా సబ్‌కీ రక్ష (బీమా చట్టాల సవరణ) బిల్లు-2025'ను ఆమోదించింది. ఈ బిల్లు ద్వారా 1938 నాటి బీమా చట్టం, 1956 నాటి ఎల్ఐసీ చట్టం, 1999 నాటి ఐఆర్‌డీఏఐ చట్టాలకు మార్పులు చేసింది. నిబంధనలను నవీకరించడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, విదేశీ రీఇన్సూరర్లకు మూలధన అవసరాలను తగ్గించడం వంటివి ప్రభుత్వం ఈ చట్టంలో పొందుపరచింది.బీమా రంగంలో విదేశీ పెట్టుబడులకు పూర్తిగా తలుపులు తెరుచుకున్నప్పటికీ, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కి మాత్రం ఒక ప్రత్యేకమైన నియంత్రణ హోదాను ప్రభుత్వం కొనసాగించింది. ఆటోమేటిక్ మార్గం ద్వారా ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 20 శాతానికే పరిమితం చేశారు. ఒక ప్రధాన ఆర్థిక సంస్థపై ప్రభుత్వ నియంత్రణను కొనసాగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. బీమా రంగం విస్తరణకు ఏటా రూ.40,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్ల వరకూ భారీ మూలధనం అవసరం అని అంచనా. తాజా 100% ఎఫ్‌డీఐ విధానం ద్వారా ఈ మూలధన అవసరాలు తీరనున్నాయి.

**సవాళ్లూ ఉన్నాయి..**

కొత్త విధానం మూలధనాన్ని తీసుకురావడంతోపాటు, పోటీని పెంచుతుంది. దీంతో కొన్ని సవాళ్లూ ఎదురుకానున్నాయి. బలమైన విదేశీ సంస్థల ప్రవేశంతో పోటీ తీవ్రమై, అన్ని సంస్థల లాభాల మార్జిన్లు తగ్గొచ్చు. విదేశీ సంస్థలు కేవలం లాభాలను తమ దేశాలకు తరలించడంపైనే దృష్టి పెట్టి, గ్రామీణ ప్రాంతాలను విస్మరిస్తాయనే విమర్శలూ వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఎల్ఐసీకి తొలి సంవత్సర జీవిత బీమా ప్రీమియంలో 57.05 శాతం వాటా ఉండటం వల్ల కొత్తగా వచ్చే సంస్థలకు పోటీ వాతావరణం ఎదురవుతుంది. 2015లో 49 శాతానికి, 2021లో 74 శాతానికి ఎఫ్‌డీఐలను పెంచినప్పటికీ, బీమా విస్తరణ ఆశించిన స్థాయిలో జరగలేదు. కొత్త ఉద్యోగాల సృష్టి చెప్పుకోదగ్గ మేర ఉండకపోవచ్చు.

సాఫ్ట్‌వేర్ రంగంలో 18 ఏళ్ల అనుభవం..

## ఏఐ దెబ్బకి మెక్‌డొనాల్డ్స్‌లో..

**న్యూఢిల్లీ:**సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ సంచలనాలు సృష్టి స్తోంది. ఈ ఏఐ కారణంగా ఉద్యోగాలు పోతాయనే ఆందోళన రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఏళ్ల అనుభవం ఉండి.. ఏఐ కారణంగా ఉద్యోగం కోల్పోయానంటూ ఓ వ్యక్తి పెట్టిన పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఏఐ కారణంగా ఎనిమిది నెలల క్రితం తాను ఉద్యోగం కోల్పోయానంటూ ఆ వ్యక్తి తన పోస్టులో పేర్కొన్నాడు. తమ బృందంలో 12 మంది ఐటీ ఉద్యోగులం ఉండేవాళ్లమని, కంపెనీ మా అందరినీ తొలగించి కేవలం ఇద్దరు ఏఐ నిపుణులను నియమించుకుందని తెలిపాడు. 100కు పైగా ఉద్యోగాలకు అప్లై చేసినా జాబ్ దొరకలేదని వెల్లడించాడు. చివరకి కుటుంబ పోషణ కోసం ప్రస్తుతం మెక్‌డొనాల్డ్స్ (ఓఇఆనీనిజీశ్రీట'బ)లో చేరినట్లు తెలిపాడు. తనకు తెలిసిన అనేక మంది అనుభవజ్ఞులైన ఇంజినీర్లు కూడా ప్రస్తుతం ఇదే సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపాడు. వారిలో కొందరు సంబంధంలేని ఉద్యోగాల్లో చేరినట్లు వెల్లడించాడు. ఈ పోస్టు తాజాగా నెట్టింట తీవ్ర చర్చకు దారి తీయగా.. నెటిజన్లు దీనిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆ ఇంజినీర్ ఆవేదనను సమర్థిస్తూ కామెంట్లు పెడుతుండగా. మరికొందరు అనుభవం ఉన్నవారు ఏఐ సాధనాలు నేర్చుకుంటే.. వారికి డిమాండ్ పెరుగుతుందని పేర్కొంటున్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,37,900 | ₹ 1,50,440 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,65,000

## టాటా సన్స్ లిస్టింగ్ తప్పదా?

### టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ ప్రణాళికలకు ఆర్‌బీఐ గండి

**జులై 1 నుంచి కొత్త నిబంధనల అమలు**

**న్యూఢిల్లీ:**స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ కాకుండా ఉండడానికి టాటా సన్స్ చేస్తున్న ప్రయత్నాలకు ఆర్‌బీఐ గండి కొట్టింది. గ్రూప్ కంపెనీల నుంచి వచ్చే నిధులను పరోక్షంగా ప్రజల నిధుల కిందే పరిగణించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలు తీసుకొచ్చింది. ప్రధాన పెట్టుబడి కంపెనీగా డీరిజిస్టర్ చేయాలంటూ టాటా సన్స్ పెట్టుకున్న దరఖాస్తుపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. జులై 1 నుంచే అమల్లోకి రానున్న ఈ కొత్త నిబంధనలు టాటా సన్స్ భవిష్యత్ ప్రణాళికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ తన ఫైనాన్స్ లైసెన్సును సరెండర్ చేయడం ద్వారా తప్పనిసరి స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌ను తప్పించుకోవచ్చన్న వాదననూ ఇటీవలి ఒక నోటిఫికేషన్ ద్వారా ఆర్‌బీఐ తోసిపుచ్చిందని ఆంగ్ల వార్తా సంస్థ ఒకటి పేర్కొంది.ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) విడుదల చేసిన మార్గనిర్దేశాల ప్రకారం.. డెట్ మార్కెట్‌తో సంబంధాలున్న గ్రూప్ కంపెనీలు, అనుబంధ సంస్థల నుంచి ఈక్విటీని పొందిన పక్షంలో పరోక్షంగా ప్రజా నిధులను పొందినట్లుగానే పరిగణిస్తారు. న్యాయ నిపుణుల అంచనా ప్రకారం.. టాటా సన్స్‌కు చెందిన టాటా మోటార్స్, టాటా స్టీల్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్, టాటా కెమికల్స్ తమ హోల్డింగ్ కంపెనీకి నిధులను అందజేసిన సమయంలో డెట్ మార్కెట్ల ద్వారా నిధులను సమీకరించాయి. ఇంకో వైపు రూ.1,000 కోట్ల ఆస్తుల్లోపు ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలకు మాత్రమే డీరిజిస్ట్రేషన్ మార్గాన్ని తాజా ఆదేశాలు అందజేస్తున్నాయి. టాటాసన్స్ స్టాండలోన్ ఆస్తులు రూ.1.75 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంటే ఈ పరిమితికి మించి చాలా అధికంగా ఉన్నాయి. అంతక్రితం రూ.లక్ష కోట్లకు పైగా ఉన్న సంస్థలను అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా వర్గీకరిస్తామని ఆర్‌బీఐ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. సెప్టెంబరు 2022న తొలిసారిగా ఆర్‌బీఐ అప్పర్ లేయర్ జాబితాను విడుదల చేసినపుడు టాటా సన్స్ ఒక్కటే తప్పనిసరి లిస్టింగ్‌ను చేయకుండా ఉన్న కంపెనీగా ఉంది.టాటాసన్స్ లిస్టింగ్ విషయంలో టాటా ట్రస్ట్‌లో విభేదాలు కనిపించిన సంగతి తెలిసిందే. ఛైర్మన్ నోయల్ టాటా లిస్టింగ్‌కు వ్యతిరేకంగా ఉండగా, వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ మద్దతు పలుకుతున్నారు. ఏప్రిల్ 2026లో షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ, వేణు శ్రీనివాసన్‌లు టాటా సన్స్ లిస్టింగ్‌కు మద్దతు పలికారు. అది అవసరమైన పరిణామంగా మిస్త్రీ ఆ సమయంలో అన్నారు. తాజా వార్తల నేపథ్యంలోనూ మిస్త్రీ టాటా సన్స్ లిస్టింగ్‌ను అవసరమైన పరిణామంగా పునరుద్ఘాటించారు. తద్వారా గ్రూప్‌లో పాలన, పారదర్శకత, బాధ్యత బలోపేతమవుతుందన్నారు. ఒక వేళ గ్రూప్ హోల్డింగ్ కంపెనీని అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా వర్గీకరిస్తే లిస్టింగ్ తప్పనిసరి అవుతుందని శ్రీనివాసన్ అన్నారు. టాటా సన్స్‌లో షాపూర్జీ పల్లోంజీ(ఎస్‌పీ) గ్రూప్‌నకు ఉన్న 18.37 శాతం వాటా నగదీకరణకు మార్గం సుగమం అవుతుందనీ పేర్కొన్నారు.

# తాము ఓడుతూ.. ప్రపంచాన్ని ఓడిస్తూ!

**పశ్చిమాసియా యుద్ధం మొదలై రెండు నెలలైంది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే... ఇందులో భాగమైన దేశాలన్నీ ఓడుతూ... ప్రపంచాన్నీ ఓడిస్తున్నాయ్! ఆధునిక యుద్ధంలో విజేతలుండరు.. అందరూ పరాజితులే.. అంటే ఇదేనేమో..! అమెరికా:యుద్ధాన్ని ఒకట్రెండు వారాల్లో ముగిస్తామంటూ రంగంలోకి దిగిన అమెరికాకు ఈ యుద్ధం ఎదురు దెబ్బే అని చెప్పాలి.**



**న్యూఢిల్లీ:**రెండునెలలైనా యుద్ధంలో అగ్రరాజ్యం నిర్ణయాత్మక విజయం సాధించలేకపోయింది. గల్ఫ్ దేశాల్లో తన సైనిక స్థావరాలపై ఇరాన్ చేసిన దాడులను నిలువరించలేకపోయింది. దీంతో గల్ఫ్ దేశాల నమ్మకాన్ని కోల్పోయింది. ఈ యుద్ధం కారణంగా ఐరోపాతోనూ సంబంధాలు దెబ్బతిన్నాయి. హర్మూజ్ జలసంధి తెరవడానికి సహకరించాలన్న విజ్ఞప్తిని నాటో దేశాలు కూడా పక్కనపెట్టడం అమెరికాకు ఊహించని పరిణామం. మరోవైపు దేశీయంగా గ్యాస్ ధరలు పెరగడంతో అగ్రరాజ్యంలో ద్రవ్యోల్బణం 3.3 శాతానికి చేరింది. రాజకీయంగానూ ఈ యుద్ధం అధ్యక్షుడు ట్రంప్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఆయన పాపులారిటీ 37% శాతానికి పడిపోయింది. పెరిగిన ధరల కారణంగా.. యుద్ధం ఎంత కాలం సాగితే, ట్రంప్ అంత బలహీనమైన నాయకుడిగా కనిపించే అవకాశం ఉంది. ఇరాన్ అగ్రనేతలను చంపామన్న సంతోషం తప్పిస్తే... ఇజ్రాయెల్ కూడా సాధించిందేమీ లేదు. పైగా తన రక్షణ బలహీనతలను బయటపెట్టుకుంది.
ఇరాన్:పైకి గాంభీర్యం ప్రకటిస్తున్నా... యుద్ధంలో ఇరాన్ భారీగా నష్టపోయింది. ఆ దేశ మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సుప్రీంనేత ఖమేనీ సహా కీలక నేతలందరూ హతమయ్యారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయి. ద్రవ్యోల్బణం 67 నుంచి 69 శాతం మధ్యలో ఉంది. యుద్ధం కారణంగా 10 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇంటర్నెట్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. దీంతో మళ్లీ తిరుగుబాటు వస్తుందన్న భయం ఇరాన్ పాలకులను భయపెడుతోంది. ఐఆర్‌జీసీ, ప్రభుత్వం మధ్య విభేదాలు కూడా తారస్థాయికి చేరుకున్నాయి.
**గల్ఫ్ దేశాలు:**ఈ యుద్ధం కారణంగా తీవ్రంగా ప్రభావితమైంది గల్ఫ్ దేశాలే. హర్మూజ్ జలసంధి దిగ్బంధనంతో సౌదీ అరేబియా, యూఏఈ ఇరాక్, కువైట్, ఖతార్ తదితర దేశాల చమురు, సహజ వాయువు ఎగుమతులు దాదాపుగా నిలిచిపోయాయి. దీంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థలు తలాకుతలమయ్యాయి. ఇజ్రాయెల్ కంటే ఎక్కువగా గల్ఫ్ దేశాలపైనే ఇరాన్ దాడులు నిర్వహించింది. దీంతో ప్రపంచ వ్యాపార, పర్యాటక కేంద్రాలు వెలుగొందిన గల్ఫ్ నగరాల ప్రతిష్ఠ దెబ్బతింది. అమెరికా సైనిక స్థావరాలున్నాయి.. తమ రక్షణకు ఢోకా లేదని ఇన్నాళ్లూ అనుకున్న గల్ఫ్ దేశాలకు ఈ యుద్ధం ఆ భ్రమలను పటాపంచలు చేసింది. దీంతో రక్షణ కోసం అమెరికాపై ఆధారపడటంపై పునరాలోచనలో పడ్డాయి. గల్ఫ్ దేశాల ఐక్యతకూ ఈ యుద్ధంతో బీటలువారింది. ఒపెక్ నుంచి యూఏఈ నిష్క్రమించింది.
**ప్రపంచం:**హర్మూజ్ జలసంధి దిగ్బంధనంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో తమ చమురు అవసరాలకు గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధారపడుతున్న భారత్, చైనా, జపాన్ వంటి దేశాలకు ఈ యుద్ధం శరాఘాతమైంది. ఇంధన ధరలు పెరగడంతో ప్రపంచవ్యాప్తంగా వస్తువుల రవాణా ఖర్చులు పెరిగాయి. ఎరువుల తయారీలో వినియోగించే యూరియాలో మూడో వంతు కూడా హర్మూజ్ జలసంధి నుంచే వస్తుంది. ఈ మార్గాన్ని మూసివేయడంతో ఎరువుల ధరలు కూడా ఆకాశాన్ని తాకాయి. ఆఫ్రికా, ఆసియా దేశాల్లోని రైతులు పంటలు పండించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఐరోపాకు ముడి చమురు, సహజ వాయువు సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్యాస్ ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. జర్మనీ, ఇటలీ వంటి దేశాలు 2026 చివరి నాటికి ఆర్థిక మాంద్యంలోకి వెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## టీ గ్లాసులో హరివిల్లు

**బంగ్లాదేశ్‌లోని శ్రీమంగళ్ పట్టణానికి చెందిన రొమేశ్ గౌర్ అనే వ్యక్తి ఏడు రంగుల టీ తో అద్భుతం సృష్టించారు. ఒకే గ్లాసులో ఇంద్రధనుస్సులా ఏడు రంగులు వరుసగా పేర్చినట్టుగా ఉండే ఈ టీ ఒక్కో వరుసలో ఒక్కో రుచి కలిగి ఉండటం విశేషం. 2002లో తొలిసారి ఒకే గ్లాసులో రెండు రంగుల టీ తయారు చేసిన రొమేశ్.. కాలక్రమంలో రంగులు, రుచులు, వరుసల సంఖ్యను పెంచుకుంటూ పోయారు. రొమేశ్ తయారుచేసిన ఈ వింత పానీయం ప్రపంచం నలుమూలల నుంచి బంగ్లాదేశ్ సందర్శించే పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 2004లో జపాన్ నిపుణులు ఈ టీని విశ్లేషించి ఇందులో ఎలాంటి హానికర రసాయనాలూ వాటం లేదని నిర్ధారించారు.**



## నింగిలోకి దృష్టి

**న్యూఢిల్లీ:**బెంగళూరుకు చెందిన అంతరిక్ష అంకుర సంస్థ గెలాక్స్‌ఐ పంపించిన 'దృష్టి' ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లింది. కాలిఫోర్నియాలోని ప్రయోగ కేంద్రం నుంచి ఫాల్కన్-9 రాకెట్ సాయంతో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు గెలాక్స్‌ఐ వెల్లడించింది. ఇది ప్రపంచంలో ఆప్టో-సార్ సాంకేతిక కలిగిన మొట్టమొదటి ఉపగ్రహమని పేర్కొంది. భూ పరిశీలన సాంకేతికత పరిజ్ఞానంలో ఇది కీలక మైలురాయి అని తెలిపింది."190 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం.. భారత్‌లోని ప్రైవేటు సంస్థ నిర్మించిన శాటిలైట్లలో అతిపెద్దది. 1.5 మీటర్ల రిజల్యూషన్‌తో చిత్రాలను అందిస్తుంది. ఆప్టో-సార్ టెక్నాలజీతో ఇది పనిచేస్తుంది. ఎలక్ట్రో ఆప్టికల్ సింథటిక్ ఎపెర్చర్ రాడార్ సెన్సర్లతో కలిపి పరిశీలనలు సాగిస్తుంది. అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లో.. పగలు, రాత్రి తేడా లేకుండా భూమిని నిరంతరం పరిశీలించే సామర్థ్యం దీని సొంతం" అని గెలాక్స్‌ఐ పేర్కొంది. గెలాక్స్‌ఐ చేపట్టిన దృష్టి ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష పరిశోధనల్లో ఇదో కీలక విజయంగా నిలుస్తుందన్నారు. దేశ పురోగతి, ఆవిష్కరణల పట్ల యువత అభిరుచికి ఇదో నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా గెలాక్స్‌ఐ బృందానికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

## పెళ్లిలో డీజే ప్లే చేసిన యూఎస్ విదేశాంగ మంత్రి రూబియో

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొత్త అవతారం ఎత్తారు. తాజాగా ఓ పెళ్లిలో ఆయన డీజే ప్లే చేశారు. దీనికి సంబంధించి వైట్‌హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ డాన్ స్కావినో షేర్ చేసిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.విదేశాంగ మంత్రిగా, జాతీయ భద్రతా సలహాదారుగా రూబియో విధులు నిర్వహిస్తున్నారు. ఎంతో బిజీ షెడ్యూల్‌తో ఉండే ఆయన.. తాజాగా మియామిలోని ఒక నైట్‌క్లబ్‌లో జరిగిన పెళ్లి వేడుకలకు హాజం య్యారు. పెళ్లిలో ఏర్పాటు చేసిన డీజేకు అక్కడికి వచ్చిన అతిథులందరూ డ్యాన్స్ చేస్తుండగా.. డీజే వాయించి వారిలో జోష్‌ని మరింత పెంచారు.

## యువరాణులపై హత్యాయత్నం..


**రెండు గొడ్డళ్లు స్వాధీనం..!**

జనంసాక్షి:నెదర్లాండ్స్ యువరాణులపై హత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ వ్యక్తిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. డచ్ రాజ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న ఓ వ్యక్తి ఫిబ్రవరిలో యువరాణి కేథరీనా-అమాలియా ఆమె చెల్లి అలెక్సియాలను హత్య చేయడానికి ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ విషయాన్ని ఇప్పటి వరకు బయటకు వెల్లడించలేదన్నారు. ఇటీవల నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని.. అతడి వద్ద ఉన్న రెండు గొడ్డళ్లు, విద్వేషపూరిత వ్యాఖ్యలు ఉన్న కాగితాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నెదర్లాండ్స్ రాజు విల్లెం-అలెగ్జాండర్ 59వ పుట్టినరోజు సందర్భంగా రాజకుటుంబం ఓ కార్యక్రమంలో పాల్గొన్న క్రమంలో అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. యువరాణి కేథరీనా- అమాలియా భద్రతపై వార్తలు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఆమె అనేక భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొన్నారు. 2020లో ఓ వ్యక్తి యువరాణిపై సోషల్ మీడియాలో అత్యాచార, హింస బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. రెండేళ్ల తర్వాత ఆమ్‌స్టర్‌డామ్‌లోని తన విద్యార్థి వసతి గృహాన్ని ఖాళీ చేసి.. హేగ్‌లోని అత్యంత పటిష్టమైన భద్రత గల రాజభవనానికి మారారు. తర్వాత కూడా పలు అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాలు బెదిరింపులకు పాల్పడడంతో నెదర్లాండ్స్‌ను వదిలి.. ఏడాది పాటు స్పెయిన్‌లో తలదాచుకున్నారు.

## రీల్స్ చేసేందుకు వాటర్ ట్యాంక్ ఎక్కి..

**16 గంటలు అక్కడే చిక్కుకుపోయి**

**లక్నో:**రీల్స్ మోజులో పడి కొందరు మైనర్లు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. రీల్స్ తీసేందుకు ఒక పాత వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి దాదాపు 16 గంటలపాటు అక్కడే చిక్కుకుపోయారు. ఈ క్రమంలో భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ రంగంలోకి దిగి వారిని సరక్షితంగా కిందకు దించింది. ఉత్తర్‌ప్రదేశ్ లోని సిద్ధార్థ్‌నగర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. శనివారం మధ్యాహ్నం ఐదుగురు మైనర్ బాలురు రీల్స్ చేసేందుకు పాత వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కారు. ఈ క్రమంలో ట్యాంక్ నిచ్చెన విరిగిపోవడంతో.. ముగ్గురు కిందపడిపోయారు. వారిలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఇంకో ఇద్దరు ట్యాంక్‌పైనే చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు జిల్లా యంత్రాంగం ప్రయత్నించింది. వర్షం, రాత్రివేళ కావడంతో రెస్క్యూ ఆపరేషన్ విఫలమైంది. దీంతో బాధితులు రాత్రంతా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో రాష్ట్ర అధికారుల అభ్యర్థన మేరకు ఆదివారం తెల్లవారుజామున సెంట్రల్ ఎయిర్ కమాండ్ కు చెందిన ఐఏఎఫ్ హెలికాప్టర్ రంగంలోకి దిగింది. దాదాపు 15 నిమిషాలు కష్టపడి ట్యాంకర్‌పై చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా కిందకు దించింది.



## విమాన ప్రయాణికులకు సులువుగా దేశీయ-అంతర్జాతీయ కనెక్టివిటీ

**హబ్ అండ్ స్పోక్ మోడల్‌కు ఎస్‌ఓపీ జారీ**

న్యూఢిల్లీ:దేశీయ మార్గాల్లో.. అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమాన ప్రయాణికుల రద్దీ శరవేగంగా పెరుగుతోంది. దేశంలో చిన్న నగరాలకూ ఉడాన్ కింద విమాన సేవలు అందుబాటులోకి రావడంతో, విదేశాలకు వెళ్లే వారికి మరింత సౌలభ్యంగా ఉంటోంది. దేశంలో 154 విమానాశ్రయాలు కార్యకలాపాలు సాగిస్తుండగా, ఇందులో 30 ఇంటర్నేషనల్ విమానాశ్రయాలు. గత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా 16.77 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారని అంచనా. చిన్న నగరాల నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలకు వెళ్లేవారు, దేశంలోని ప్రధాన కేంద్రాలకు వెళ్లి, అక్కడ నుంచి ప్రయాణించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశీయ గమ్యస్థానాల నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలకు.. విదేశాల నుంచి మనదేశంలోని చిన్న నగరాలకు వచ్చే విమాన ప్రయాణికులను సులువుగా చేరవేసేందుకు ఉపయోగపడే హబ్ అండ్ స్పోక్ నమూనా నిర్వహణకు ఎస్‌ఓపీను పౌర విమానయాన శాఖ జారీ చేసింది. జూన్ నుంచి ఈ నమూనాపై ట్రయల్‌ను ఎయిరిండియా ప్రారంభించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. స్పోక్ విమానాశ్రయాల నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులను ఒక హబ్ లేదా పెద్ద విమానాశ్రయం ద్వారా సులభతర పద్ధతిలో అనుసంధానించేదే ఈ హబ్ అండ్ స్పోక్(హెచ్ అండ్ ఎస్) మోడల్.



# మంత్రి శ్రీధర్ బాబు అభివృద్ధి మార్క్!

**సీఆర్ఆర్ఎస్సీ కాంపోనెంట్ క్రింద రూ.15 కోట్లు మంజూరు చేయించిన మంత్రి**

**గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల అభివృద్ధికి పెద్దపీట**

**మంథని(జనంసాక్షి):** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అభివృద్ధి మార్క్..! చూపిస్తూ వస్తున్నారు. సిఆర్ఆర్ ఎస్సి కాంపోనెంట్ క్రింద మరో రూ. 15 కోట్ల నిధులు మంజూరు చేయించి .. గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం, డ్రైన్ల అభివృద్ధికి పెద్ద పేట వేశారు. పెద్దపల్లి, భూపాల్ పల్లి రెండు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న మంథని నియోజకవర్గంలోని 10 మండలాల్లో సిఆర్ఆర్ ఎస్సి కాంపోనెంట్ క్రింద సిసి రోడ్ల నిర్మాణం, డ్రైన్ల అభివృద్ధి పనులకు గాను రూ.15 కోట్ల నిధులను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. ఈ మేరకు మంథనిలోని మంత్రి కార్యాలయం నుంచి మంత్రి పిఏ ఆకుల చంద్రశేఖర్ ప్రకటన విడుదల చేశారు. మంథని మండలంలో 34 గ్రామాలకు రూ. 330 లక్షలు, ముత్తారం మండలంలో 15 గ్రామాలకు 155 లక్షలు, రామగిరి మండలంలో 17 గ్రామాలకు 135 లక్షలు, కమాన్ పూర్ మండలంలో 8 గ్రామాలకు 60 లక్షలు, మంథని నియోజక వర్గం పరిధిలోని పాలకుర్తి మండలంలోని నాలుగు గ్రామాలకు 20 లక్షలు, కాటారం మండలంలో 24 గ్రామాలకు 250 లక్షలు, మహ ముత్తారం మండలంలో 24 గ్రామాలకు 175 లక్షలు, మహాదేవ్ పూర్ మండలంలో 18 గ్రామాలకు 145 లక్షలు, మల్హార్ మండలంలో 15 గ్రామాలకు 160 లక్షలు, పలిమెల మండలంలో 8 గ్రామాలకు 70 లక్షల నిధులను మంత్రి శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. మంథని నియోజకవర్గం పరిధిలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్ పూర్, పాలకుర్తి మరియు కాటారం, మహాముత్తారం, మహదేవ్ పూర్, మల్హార్ రావు, పలిమెల మండలాలకు సిఆర్ఆర్ ఎస్ సి కాంపోనెంట్ క్రింద 15 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కి 10 మండల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు, గ్రామపంచాయతీ సర్పంచ్ లు, పాలకవర్గం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అకాల వర్షం.. అన్నదాత ఆగం

**తుంగతుర్తి ఐకెపి కేంద్రాల్లో తడిసిన ధాన్యం**



తుంగతుర్తి(జనంసాక్షి):తుంగతుర్తి మండల వ్యాప్తంగా ఆదివారం ఈదురు గాలులతో పాటు కురిసిన అకాల వర్షం అన్నదాతను నిండా ముంచింది. మండలంలో ఈదురుగాలులు, వడగండ్ల తో కూడిన వర్షానికి రైతన్న ఆరుగాలం చేసిన కష్టం ఒక్క వానతో పలు గ్రామాల్లోని ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి ఉంచిన ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యాన్ని వర్షం బారి నుండి కాపాడుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడ్డారు, పలు గ్రామాల్లో రైతులు ఐకెపి కేంద్రాల్లో ఆరబోసుకున్న ధాన్యం వర్షపు నీటిలో కొట్టుక పోయింది. నిర్వాహకులు వద్దు వర్షానికి తడవకుండా తార్పాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వర్షం బారి నుండి తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డారు, కొనుగోలు కేంద్రాల్లో సర్కారు, నిర్వాహకుల నిర్లక్ష్యంతో కాంటాలు సమయానికి కాకపోవడంతో దాన్యం తడిసింది.రైతులు ఎంతో కష్టపడి పండించిన పంట ఈ విధంగా నష్టపోవడం తో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం,అధికారులు సరైన కవర్లు, గోదాములు ఏర్పాటు చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు . ఈదురు గాలులకు చాలాచోట్ల చెట్లు విరిగి నేలమట్టమయ్యాయి, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎండల తీవ్రతకు కురిసిన వర్షానికి ప్రజలకు ఉపశమనం కలిగింది, వేడి తగ్గి వాతావరణపు చల్లబడటంతో ప్రజలు కొంత ఊరట పొందారు








# ‘యాదగిరిగుట్ట’కు పోటెత్తిన భక్తజనం

**ఆదివారం కావడంతో ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు**

యాదగిరిగుట్ట (జనంసాక్షి):ఆదివారం సెలవు రోజు కావడంతోయాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి భక్తులరద్దీ పెరిగింది. ఆలయ పరిసరాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనానికి క్యూలైన్లో భక్తులు బారులుతీరారు. ఆలయంలో మొక్కు, కళ్యాణములో అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.దీనితో స్వామి వారి ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు 2 గంటలు, ప్రత్యేక దర్శనానికి దర్శనానికి దాదాపు ఒక గంట సమయం పడింది. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ప్రసాద విక్రయ శాల, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండక్రింద విష్ణుపుష్కరణి, కారు పార్కింగ్, బస్ స్టాండ్ లో భక్తుల సందడి నెలకొంది.

# వాడిపోతున్న కూరగాయలు.. ఆరిపోతున్న గొంతు



ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రతివారం ఆదివారం సంత జరుగుతుంది. రోడ్డుపైనే సొంత నిర్వహిస్తారు. కనీసం మంచినీళ్లు కూడా దొరకవు మహిళలకు మరుగుదొడ్లు ఉండవు బాత్రూంలో ఉండాయి ఎటు చూసిన నిప్పులు కురుస్తున్న ఎండలు మంట పుట్టిస్తున్న ఆకాశం.ఎండలంటే మామూలుగా ఉండవు గదా పొద్దుగాల పది దాటిందంటే సాలు.. సూర్యుడు నిప్పుల కుప్ప లెక్క తయారవుతాడు. నెత్తి మీద అగ్గి పోసినట్టు, ఒళ్లంతా సెమటతో తడిసి ముద్దవుతది. రోడ్ల మీద ఎండమావులు కనిపిస్తున్నయ్ తప్ప, మనుషులు కనిపిస్తలేరు. గాలి కూడా వేడి వేడిగ తగిలి, ముఖం మీద సెరపలు కొట్టినట్టు అవుతుంది. ఈ మండుటెండలల్ల సామాన్యుల పరిస్థితి ఆగమాగం అవుతుంది. ఈ పరేషాన్ ఎండల పొద్దున, ఓ అవ్వ తన బతుకు దెరువు కోసం రోడ్డు పక్కన కూరగాయలు పెట్టుకుంది. కానీ ఎండ దెబ్బకు తట్టుకోలేక, ఉన్న ఒక్క పాత గొడుగు కింద ఒదిగి కూర్చుంది. ఆ గొడుగు ఇచ్చే పిసరంత నీడనే ఆమెకు ఇప్పుడు కొండంత ఆసరా. గీ ఎండలల్ల ఎట్ల బతకాలి బిడ్డా అని ఆ అవ్వ ముఖం చూస్తుంటేనే అర్థమవుతుంది. చుట్టూ మంట పుట్టించే వేడి ఉన్నా, ఆ చిన్న నీడనే ప్రాణంగా భావిస్తూ కూరగాయలు అమ్ముకుంటుంది.వాడిపోతున్న కూరగాయలు. ఆరిపోతున్న గొంతు.అవ్వ దగ్గర ఉన్న పచ్చిమిర్చి, టమాటాలు కూడా ఎండకు తట్టుకోలేక వాడిపోతున్నయ్. గిరాకీ లేకపోయినా, పట్టుదలతో కూర్చున్న అవ్వకు గొంతు ఎండిపోతుంది. అప్పుడప్పుడు ఓ ముంత నీళ్లు తాగుతూ, గొడుగు నీడలో తల దాచుకుంటుంది. ఆమె కళ్లల్లో కనిపించే అలసట, ఈ ఎండల తీవ్రతకు అద్దం పడుతుంది. కష్టపడితేనే కడుపు నిండే పరిస్థితి ఆమెది, అందుకే ఈ ఎండలో కూడా గొడుగును నమ్ముకుని కూర్చుంది.జర భద్రం. ఎండ దెబ్బ తగలకూడదంటేఅవ్వ లాంటి వాళ్లే కాదు, బయట తిరిగే ప్రతి ఒక్కరు జాగ్రత్తగ ఉండాలిఆ అవ్వ కష్టం చూస్తుంటే, ఎండకు ఎండి, వానకు తడిసి అనే మాట అక్షరాల నిజమనిపిస్తుంది. ఆ గొడుగు నీడ ఆమెకు తోడుండాలని కోరుకుందాం.

– ముస్తాబాద్ (జనం సాక్షి)

# చిగురుమామిడిలో అగ్ని ప్రమాదం..


**రూ.లక్షపేనే నష్టం జరిగిందని రైతుల ఆవేదన..**

**చిగురుమామిడి మే(జనంసాక్షి):** మండల కేంద్రంలోని పెనుకుల సదానందం,పెలుకుల తిరుపతి అనే రైతుల వ్యవసాయ పొలం వద్ద ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ అగ్ని ప్రమాదం వల్ల వ్యవసాయ బావి మోటార్ పట్టా కాలి బావిలో పడిపోయిందని, దానికి కనెక్షన్ పైపులు కూడా కాలిపోయాయని, గడ్డివాము కాలిపోయిందన్నారు. కంకుల మెషిన్ కాలిపోయిందని, 20స్ప్రింక్లర్ పైపులు కాలిపోయాయి,బోర్ పైప్ కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్ఫార్మర్ నుండి వచ్చే సర్వీస్ వైర్ కాలిపోయి, చుట్టుపక్కల గల 15ఎకరాల వరకు మంటలు వ్యాపించాయన్నారు. ఆస్తి నష్టం దాదాపు 1,20,000 రూపాయలవరకు జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూమిలో నిన్న సాయంత్రం ట్రాన్స్ఫార్మర్ నుండి వచ్చిన చిన్నపాటి మెరుగుల వల్ల పైన ఆస్తినష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని పెనుకుల సదానందం,పెనుకుల తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు.



# అధికారుల మామూళ్ల మత్తు వదిలేదెన్నడు?

- బాల కార్మికులను పంపించి మమ అనిపించారు
- నాణ్యత లేని డస్ట్ రోడ్డుపై మౌనం ఎందుకు?
- ఇందుగుల రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ దౌర్జన్యం
- ‘జనంసాక్షి’ కథనంపై అరకొర స్పందన



**మాడుగులపల్లి(జనంసాక్షి):** నిబంధనలు గాలికే పర్యవేక్షణ అటకెక్కి కాంట్రాక్టరే సుప్రీం అన్నట్లుగా మాడుగులపల్లి మండలం ఇందుగులలో రోడ్డు నిర్మాణం సాగుతోంది ఇటీవల ఈ రోడ్డు పనుల్లో వనపర్తి జిల్లా చిన్నారుల శ్రమ దోపిడీపై ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు, హడావిడి చేసి బాల కార్మికులను పనుల నుండి పంపించి వేశారు అయితే, అసలు రోడ్డు నాణ్యత విషయంలో జరుగుతున్న ఘోరమైన అవినీతిని మాత్రం అధికారులు చూసీచూడనట్లు వదిలేయడం వెనుక ఉన్న లోగుట్టు ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు సిసి రోడ్డు నిర్మాణంలో నిర్ణీత మోతాదులో ఇసుకను వాడాలనేది ప్రభుత్వ నిబంధన. కానీ ఇందుగుల రోడ్డు నిర్మాణంలో ఇసుక జాడ ఎక్కడా కనిపించడం లేదు ఇసుక ఖరీదు ఎక్కువ అవుతుందన్న కక్కుర్తితో కాంట్రాక్టర్ యథేచ్ఛగా కంకర పొడి (డస్ట్) వాడుతూ పని పూర్తి చేస్తున్నారు డస్ట్తో వేసే రోడ్లు కేవలం కొన్ని నెలలకే బీటలు వారి, మొదటి వర్షానికే కుంగిపోతాయని తెలిసినా, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం అధికారులు కాంట్రాక్టర్తో కుమ్మక్కై కమిషన్ల మత్తు లో ఉన్నారా? లేక కాంట్రాక్టరే అధికారులను శాసిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి బాల కార్మికుల ఇష్యూపై స్పందించిన అధికారులు, రోడ్డు నాణ్యతను ఎందుకు పరిశీలించడం లేదు? చిన్నారులను పంపించి వేయడంతోనే తమ బాధ్యత తీరిపోయిందని భావిస్తున్నారా? ప్రజల సొమ్ముతో నిర్మించే రోడ్డు నాణ్యత లేకపోతే ఆ నష్టానికి బాధ్యులు ఎవరు? పనులు జరుగుతున్న సమయంలో నిలబడి పర్యవేక్షించాల్సిన ఏ ఒక్క అధికారి కూడా క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం శోచనీయం ఇందుగుల రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న అక్రమాలను తక్షణమే అరికట్టాలి క్వాలిటీ కంట్రోల్ అధికారులు స్పందించి నిర్మాణ నమూనాలను సేకరించి పరీక్షించాలి నాణ్యత లేని డస్ట్ వాడకాన్ని నిలిపివేసి, నిబంధనల ప్రకారం ఇసుకతో పనులు చేయించాలి అధికారుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే గ్రామస్థులతో కలిసి ఉన్నతాధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులైన అధికారులపై, కాంట్రాక్టర్పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# సంక్షేమం, అభివృద్ధిలో పెద్దపెల్లి ముందంజ

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు
- మే 6న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలి
- రాష్ట్రంలో అగ్రస్థానంలో పెద్దపల్లి ఆసుపత్రి
- రైతులు పంట మార్పుపై దృష్టి పెట్టాలి
- పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

పెద్దపల్లి,మే 03(జనంసాక్షి) : సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా ముందంజలో ఉందని ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు తెలిపారు.పెద్దపల్లి మండలంలోని బండంపల్లి స్వరూప గార్డెన్స్లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి రామ్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాలో పూర్తి స్థాయిలో అమలవుతున్నాయని తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచి 4 అవార్డులు సాధించిందని, ఓపీ సంఖ్య 280 నుండి 900కు, ప్రసవాలు 40 నుండి 250కు పెరిగినట్లు పేర్కొన్నారు.కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఎంఆర్ స్కాన్, సీటీ స్కాన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నామని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చయ్యే చికిత్సను ఇక్కడ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల ప్రజలు కూడా పెద్దపల్లి ఆసుపత్రికి వస్తున్నారని చెప్పారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రం, డయాలసిస్, కార్డియాలజీ, 2డి ఎకో వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, వడ్డీరహిత రుణాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి కోతలు లేకుండా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు.రైతులు పంట మార్పుపై దృష్టి పెట్టాలని, వరి, మొక్కజొన్నలతో పాటు ఇతర పంటలను కూడా పండించాలని సూచించారు. మార్క్ఫెడ్ ద్వారా ప్రభుత్వం రైతులకు మద్దతు ఇస్తోందని తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహ జ్యోతి పథకం ద్వారా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, డైట్ చార్జీల పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరా మహిళా శక్తి వడ్డీరహిత రుణాలు, రేషన్లో సన్నబియ్యం, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు.ప్రజల నుండి ఫీడ్బ్యాక్ సేకరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వచ్చిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ప్రతి సోమవారం పురోగతికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు.మే 6న వెంకట పద్మ ఫంక్షన్ హాల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, సుమారు 100 కంపెనీలు పాల్గొని 2 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.ధాన్యం కొనుగోలుపై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ప్రస్తుతం కొనుగోలు వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. వేడి తీవ్రత కారణంగా హమాలి సమస్యలు ఉన్నప్పటికీ రైతులు సహకరించాలని, నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు.డీజిల్, పెట్రోల్ కొరతపై వస్తున్న వదంతులు అసత్యమని, జిల్లాలో తగినంత నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజూ స్టాకలను పర్యవేక్షిస్తూ, ప్రతి పెట్రోల్ బంక్పై నిఘా ఉంచినట్లు చెప్పారు. ప్రజలు అవసరానికి సరిపడా మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నానయ్య గౌడ్, పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లా రెడ్డి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్, ఆర్డీఓ బి. గంగయ్య, జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.





# చెరువుల నుండి మట్టి రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు

**మానేరువాగు పరిధిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి,మే 03(జనంసాక్షి) : జిల్లాలో ఇటుక బట్టీలకు చెరువుల నుండి మట్టి (గ్రావెల్) రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో మట్టి (గ్రావెల్), ఇసుక రవాణాపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నీటి మట్టం తక్కువగా ఉన్న చెరువుల నుండి మట్టి తవ్వకాలకు గత సంవత్సరం సెస్ వసూలు చేసి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఇదే విధానాన్ని ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ప్రస్తుతం కొదురుపాక చెరువు, రాయకుంట చెరువు, ముత్తారం చెరువుల నుండి మట్టి రవాణా కోసం 15 ఇటుక బట్టీలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలో ఈ మూడు చెరువులకు మాత్రమే అనుమతులు ఇస్తామని స్పష్టం చేశారు.నీరు లేని చెరువులను మాత్రమే మట్టి తవ్వకాలకు పరిగణనలోకి తీసుకుని, సాగునీటి శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ఓసీలు మంజూరు చేయాలని ఆదేశించారు.మట్టి రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి వాహన రవాణాను ఫోటోగ్రఫీ చేయాలని, ప్రతి వాహనానికి రసీదు జారీ చేయాలని తెలిపారు. వాహనాలు అధిక లోడుతో రవాణా చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మానేరువాగు పరిధిలో పెద్దపల్లి వైపు ఎలాంటి ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని, కరీంనగర్ వైపు జరుగుతున్న తవ్వకాల నేపథ్యంలో అక్కడి జేసీబీలు పెద్దపల్లి వైపు రాకుండా కఠినంగా హెచ్చరించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జేసీబీలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.ఈ అంశంపై జేసీబీ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో గనుల శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్డీఓలు సురేష్, బి. గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

**సెన్సస్ 2027 విజయవంతానికి సమన్వయంతో ముందుకు సాగాలి**

జిల్లాలో సెన్సస్ 2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) జె. అరుణ శ్రీ, డీసీపీ రామ్ రెడ్డి తో కలిసి సెన్సస్ 2027 పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 1881 సంవత్సరం నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్నామని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికీ ఇప్పుడు 16వ జనగణన చేపడుతున్నామని తెలిపారు. సర్వేలకు భిన్నంగా సెన్సస్ చట్టబద్ధ ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలు ఇవ్వాలని, ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు.జనగణనను రెండు దశల్లో నిర్వహిస్తామని తెలిపారు.

# మంత్రి సీతక్క మానవత్వం

## రోడ్డు ప్రమాద బాధితులకు ఆపన్న హస్తం



**బీబీనగర్ (జనంసాక్షి) :** మంత్రి సీతక్క హైదరాబాద్ నుంచి ములుగు వైపు ప్రయాణిస్తున్న సమయంలో బీబీనగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బైక్‌ను మరో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న దంపతులు, చిన్నారులు గాయపడ్డారు. అదే మార్గంలో వెళ్తున్న మంత్రి సీతక్క ఈ ఘటనను గమనించి క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే తన కాన్వాయ్‌ను ఆపించారు. బాధితుల దగ్గరకు వెళ్లి వారి పరిస్థితిని పరిశీలించి, రోదిస్తున్న చిన్నారులను ఓదార్చి ధైర్యం చెప్పారు. తక్షణమే స్పందించిన మంత్రి, గాయపడిన వారిని తన కాన్వాయ్‌లోని వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. గాయపడి ఏడుస్తున్న చిన్నారులను స్వయంగా ఎత్తుకొని వాహనంలో కూర్చోబెట్టారు. తన వ్యక్తిగత సహాయకుడిని వెంట పంపించి, వారికి అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లతో మాట్లాడారు. మంత్రి సీతక్క చూపిన చొరవకు అక్కడున్న ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# గిరిజన గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లు

**16న బాలురకు, 18న బాలికలకు కౌన్సిలింగ్**

**మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు**

**కౌడిపల్లి, మే 03 (జనంసాక్షి) :** గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ చేరే విద్యార్థుల కోసం ఈనెల 16న కామారెడ్డి పట్టణంలోని నాగిరెడ్డి పేటలో బాలురకు, 18న ఎల్లారెడ్డి జూనియర్ కళాశాలలో బాలికలకు కౌన్సిలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తామని ఆ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ గంగారాం నాయక్,ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆయా కౌన్సిలింగ్ సెంటర్లకు ఉదయం 10 గంటల లోపు సంబంధిత సర్టిఫికెట్లు తీసుకొని హాజరుకావాలని సూచించారు. నాణ్యమైన విద్యకు, పోషణతో కూడిన మెనూ, సంరక్షణ, విద్యార్థుల పూర్తి ఆరోగ్యానికి గిరిజన సంక్షేమ గురుకులాలు గుర్తింపుగా నిలిచాయని, విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. స్థానిక కౌడిపల్లి గిరిజన గురుకుల బాలుర పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్‌తో కలిసి అడ్మిషన్‌ల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి**



**సంగారెడ్డి టౌన్, మే 02 (జనంసాక్షి)**

అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని టీజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్ లో నియోజకవర్గస్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఉచితంగా మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ కలెక్షన్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు 195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్డిఓ జ్యోతి, ఆర్డిఓ రాజేందర్, సంగారెడ్డి , సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత, అంజమ్మ, మున్సిపల్ కౌన్సిలర్ లు ,సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి, శివాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నా ఇగో హర్ట్ చేశావ్?

- మనస్పర్ధలతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతున్న దంపతులు
- పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నా మారని తీరు
- సర్దుకుంటేనే సంసారమంటున్న పోలీసులు



**రాజోలి, మే 3 (జనంసాక్షి) :** దంపతుల్లో 'ఇగో' కాపురాలను కూల్చేస్తోంది. సరదాగా సాగాల్సిన కాపురాల్లో చిన్నచిన్న మనస్పర్థలు, అనుమానాలు కలతలు సృష్టిస్తున్నాయి. జీవితాంతం తోడునీడగా కలిసి నడవాల్సిన ఆలుమగల మధ్య విభేదాలు వేరుకుంపటికి దారితీస్తున్నాయి. సర్దుకుపోవాల్సిన దంపతులు మొండి పట్టు పడుతుండడంతో విభేదాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. చిన్నచిన్న మనస్పర్థలతో ఠాణా మెట్లెక్కుతున్నారు. పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నప్పటికీ వారి తీరుమారడం లేదు. ఇరు కుటుంబ సభ్యులు సరైన సమయంలో స్పందించక పోవడంతో దంపతుల మధ్య దూరం పెరిగిపోవడానికి కారణమవుతోంది. కొన్ని సందర్భాల్లో పోలీసులు, పెద్దల వద్దకు వెళ్తే ఎక్కడ పరువుపోతుందోనని..ఎవరికీ చెప్పుకోలేక మదనపడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

**కౌన్సిలింగ్ ఇస్తున్నా..**

జోగులాంబ గద్వాల జిల్లాలో ఏటా భార్యాభర్తల మధ్య ఘర్షణలు, వరకట్న వేధింపులు, గృహహింస, ప్రేమ వివాహాలకు సంబంధించిన ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో కొందరు విడాకుల వరకు వెళ్లారు. జిల్లా పరిధిలో కనీసం రోజుకో జంటకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహిస్తుండడంతో ఆ దంపతులు సంసారం సాగిస్తున్నారు. జిల్లాలోని పోలీసు స్టేషన్లలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఒకరికొకరు కేసులు పెట్టుకున్నా దంపతులకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. అయితే డీఎస్పీలతో సీఐ, ఎస్సైలు కౌన్సిలింగ్ ఇస్తున్నా కొన్నిసార్లు దంపతుల మధ్య సయోధ్య కుదుర్చలేకపోతున్నారనే వాదనలు ఉన్నాయి.

**ప్రేమికులే అధికం**

జిల్లాలోని పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు ఎక్కువగా ఉద్యోగం చేస్తున్న దంపతులు, ప్రేమ వివాహం చేసుకున్న నవ దంపతులే అధికంగా ఉంటున్నారు. సినిమాల ప్రభావం నేటి యువతరంపై ఎక్కువ ఉంది. దీనికి తోడు సెల్‌ఫోన్లు ప్రేమికులను మరింత చేరువ చేస్తున్నాయి. చాటింగ్, వాట్సాప్ కాల్, వీడియో కాల్ నిత్యం కలుసుకునే వీలుగా ఉంటుంది. సోషల్ మీడియా ప్రభావం యువతపై ఉంది. దీంతో చాలా మంది తమ ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లే ధైర్యం చేయడం లేదు. ప్రేమపెళ్లి చేసుకున్న వారిలో చాలామంది విడాకుల వరకు వెళ్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఇద్దరు ఉద్యోగం చేస్తుండడం, సంపాదనలో తానేమీ తక్కువ కాదంటూ భావిస్తుండడం ఘర్షణలకు దారితీస్తోంది. ప్రేమ వివాహాలకు సంబంధించి ఆరు నెలల్లోపే ఆర్థిక ఇబ్బందులు. అనుమానాల కారణంగా పోలీస్ స్టేషన్లకు చేరుకుని ఒకరికొకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. చాలామంది యువత ప్రేమ పేరిట ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి బంగారు భవిష్య త్తును నాశనం చేసుకుంటున్నారని అధికారులు పేర్కొంటున్నారు. పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టి అవసరమైతే కౌన్సిలింగ్ ఇప్పించాలని సూచిస్తున్నారు.

**ఒక్కటి చేసేందుకే ప్రయత్నం**



ప్రతీ కుటుంబంలో మనస్పర్థలు సహజం. సర్దుకుని సంసారం చేస్తేనే కుటుంబాలు బాగుంటాయి. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి చాలా మంది దంపతులు పోలీస్ స్టేషన్ కు వస్తున్నారు. వీరిని ఒక్కటి చేసేందుకు కౌన్సిలింగ్ చేస్తున్నాం. అయినా వినకపోతే కేసులు నమోదు చేస్తున్నాం. భార్యభర్తలిద్దరిని కలిపేందుకే సఖీ కేంద్రాలు సైతం కృషి చేస్తున్నాయి. **- కె.గోకారి ఎస్ఐ, రాజోలి**

# స్వీయ గణన విధానం ద్వారా కుటుంబ వివరాలు నమోదు సౌకర్యం

**జనాభా లెక్కల 2027 స్వీయ గణనలో ప్రజలు తమ వివరాలు నమోదు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి ప్రతినిధి, మే 03 (జనం సాక్షి)**

జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వీయ గణన) విధానం ద్వారా ప్రజలు తమ కుటుంబ వివరాలను తామే నమోదు చేసుకునే సౌకర్యం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ స్వీయ గణన ప్రక్రియ మే 10 వరకు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రతి కుటుంబం వినియోగించుకుని తమ కుటుంబ వివరాలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేయడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు సమాచారం ఖచ్చితత్వం కూడా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

**స్వీయ గణన విధానం :** ముందుగా https://se.census.gov.in వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలి. సెల్ఫ్ ఎన్యుమరేషన్ (హెచ్ఎల్ఓ) లాగిన్ వద్ద తెలంగాణను ఎంపిక చేసి Captcha నమోదు చేసి వెరిఫై, ప్రొసీడ్ క్లిక్ చేయాలి. వెల్కమ్ పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేయాలి. ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలి. వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై అండ్ ప్రొసీడ్‌ను క్లిక్ చేయాలి. తరువాత నచ్చిన భాషను ఎంపిక చేసుకుని, జిల్లా, గ్రామం/ పట్టణం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేయాలి. మొబైల్‌లో లొకేషన్ ఆన్ చేసి, ఇంటి స్థానం వద్ద ( లొకేషన్) రెడ్ మార్క్ సెట్ చేయాలి. ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి ప్రివ్యూ ద్వారా చెక్ చేసి సబ్మిట్ చేయాలి. సబ్మిట్ చేసిన తర్వాత హెచ్‌తో ప్రారంభమయ్యే 11 అంకెల సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి వస్తుంది. దానిని స్క్రీన్ షాట్ తీసుకుని లేదా నోట్ చేసుకుని భద్రపరచుకోవాలి. మే 11 తరువాత గణనాధికారి ఇంటికి వచ్చినప్పుడు ఈ ఎస్ ఈ ఐడి చూపిస్తే వారు ధృవీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకుని తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విజ్ఞప్తి చేశారు. మన బాధ్యతగా మన సమాచారం స్వయంగా నమోదు చేసి సమయాన్ని ఆదా చేసుకుందామని ఆయన పిలుపు నిచ్చారు.

# అడ్వకేట్స్‌కి ఆరోగ్య బీమా కల్పించండి

**సర్కారుకి తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కోర్టులు, హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్స్ అందరికీ ఆరోగ్య బీమా పథకాన్ని కల్పించాలని, కొత్తగా ఎన్నికైన తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2019 తర్వాత చేరి, ప్రస్తుతం ఈ పథకం పరిధిలోకి రాని వారితో సహా, న్యాయవాదులందరికీ ఆరోగ్య బీమా ప్రయోజనాలను అందించాలని కోరుతూ సంఘం నాయకులు న్యాయ కార్యదర్శి పాపిరెడ్డికి ఒక వినతిపత్రాన్ని ఆదివారం సమర్పించారు. పేదలు, అన్యాయానికి గురైన పక్షాలకు సేవ చేసే న్యాయ వ్యవస్థలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తారని గుర్తు చేశారు. అటువంటి న్యాయవాదులకు ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం నుంచి ప్రత్యేక చొరవ అవసరమని గుర్తించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రాక్టీసు చేస్తున్న యువ న్యాయవాదులకు సంక్షేమ మద్దతు అవసరమని హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ బలంగా అభిప్రాయపడింది. ప్రాక్టీస్ ప్రారంభ సంవత్సరాల్లో జూనియర్ న్యాయవాదులకు మద్దతుగా స్టైఫండ్ ప్రవేశపెట్టాలని అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. దాంతోపాటు, తెలంగాణ హైకోర్టు అసోసియేషన్ కు రావలసిన పెండింగ్ గ్రాంట్లను వీలైనంత త్వరగా విడుదల చేయాలని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, న్యాయవాద వృత్తికి సంక్షేమ ఆధారిత నిర్ణయాలు తీసుకుంటుందని అడ్వకేట్ అసోసియేషన్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఈ వినతిపత్రాన్ని తెలంగాణ లా సెక్రటరీ పాపిరెడ్డికి అందజేసిన వారిలో హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డి.ఎల్. పాండు, కార్యదర్శులు పి. శ్రవణ్ కుమార్ గౌడ్, నిరంజన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సంగారెడ్డిలో కార్మికుల కోసం అందుబాటులోకి ఈఎస్ఐ డిస్పెన్సరీ

**టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి వినతి**

**మంజూరు చేసిన మంత్రి వివేక్ వెంకట స్వామి**

**8 లక్షల రూపాయలు స్వంత నిధులతో ఆర్అండ్‌బి క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయిస్తున్న జగ్గారెడ్డి**



**సంగారెడ్డి టౌన్ మే 03 (జనంసాక్షి) :** సంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల కార్మికులకు ఈఎస్ఐ డిస్పెన్సరీ మరి కొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి వినతి మేరకు కార్మిక శాఖా మంత్రి వివేక్ వెంకట స్వామి సంగారెడ్డి పట్టణానికి ఈఎస్ఐ డిస్పెన్సరీ మంజూరు చేశారు. డిస్పెన్సరీ ఏర్పాటుకు కావాల్సిన భవనం కోసం జగ్గారెడ్డి, నిర్మల గత కలెక్టర్ ప్రావీణ్య ను కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బై పాస్ రోడ్ లో ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న వినియోగంలో లేని ఆర్ అండ్ బి క్వార్టర్‌ను కేటాయించారు. డిస్పెన్సరీ ఏర్పాటుకు అవసరమైన మరమ్మత్తుల కోసం జగ్గారెడ్డి 8 లక్షల రూపాయల తన స్వంత నిధుల ను అందించారు. ప్రస్తుతం మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయి. జరుగుతున్న పనులను జగ్గారెడ్డి పరిశీలించారు. బెడ్స్ ఏర్పాటు కు, అవసరమైన ల్యాబ్, మెడిసిన్స్ ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. పక్కా భవనం ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సంగారెడ్డి పట్టణం లోనే డిస్పెన్సరీ ఏర్పాటు అవుతుండటం సంతోషకరం అని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి చుట్టుపక్కల పరిశ్రమ ల్లో పనిచేస్తున్న వేలాది కార్మికుల కు ఈ డిస్పెన్సరీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మరమ్మత్తు పనులు సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసి , మంత్రులు వివేక్ వెంకట స్వామి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభం చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ నాయకులు జార్జ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# 'రెనె'లో రోబోటిక్ చికిత్స

**'కీలు మార్పిడి లైవ్ సర్జరీ సీపీడీ 2026' సక్సెస్**

## రెనే గ్రూప్ అఫ్ హాస్పిటల్స్ ప్రొఫెసర్ డా.బంగారి స్వామి హర్షం



**కరీంనగర్ బ్యూరో, మే 03 (జనంసాక్షి) :**

కరీంనగర్‌లోని రెనే హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "రెనే నీ రీప్లేస్‌మెంట్ లైవ్ సర్జరీ సీపీడీ - 2026" ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రెండు రాష్ట్రాల నుండి సుమారు 220 మంది ఆర్థోపెడిక్ సర్జన్లు హాజరై కార్యక్రమాన్ని విశేషంగా ఆసక్తితో వీక్షించారు. ఈ సందర్భంగా రెనే హాస్పిటల్‌లో మొత్తం ఆరు మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు (నీ రీప్లేసెమెంట్ సర్జరీస్) విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ శస్త్రచికిత్సలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో త్రిధా హోటల్స్‌లోని ఉత్సవ్ హాల్‌కు ప్రత్యక్ష ప్రసారం (లైవ్ టెలికాస్ట్) చేశారు. ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తూ నిపుణుల నుంచి విలువైన సూచనలు, సాంకేతిక వివరాలను తెలుసుకున్నారు. ముఖ్య అతిథిగా ప్రొ. డా. రామ్ కుమార్ రెడ్డి (ప్రెసిడెంట్ తోసా) హాజరై ప్రసంగించారు. గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా డా. అఖిల్ దాడి, డా. రజిని ప్రియదర్శిని పాల్గొన్నారు. పలువురు ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు ప్రత్యేక అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా.బంగారి స్వామి మాట్లాడుతూ... తెలంగాణాలో హైదరాబాద్ మినహా రోబోటిక్ చికిత్స ద్వారా మోకాలు కీలు మార్పిడి విధానం కేవలం రెనే హాస్పిటల్‌లో అందుబాటులోకి తేవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంతో ఖరీదుతో కూడుకున్న ఈ చికిత్సను అతి తక్కువ ఖర్చులో మన ప్రాంత ప్రజలకు అందించడం తమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వైద్య విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని ఎంతో పెంచుకోవచ్చని తెలిపారు.తోసా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డా.రామ్ కుమార్ రెడ్డి, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డా.ఆర్ముగం, డా.రత్నాకర్ రావు, డా.కృష్ణ కిరణ్, డా.అఖిల్ దాడి, డా. ఆదర్శ అన్నప రెడ్డి, డా.అఖిల సుందర్, కరీంనగర్ ఐఎంఎ అధ్యక్షులు డా.ఆకుల శైలజ, తానా కరీంనగర్ కోశాధికారి డా .వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సీపీడీ కార్యక్రమం ద్వారా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలలో తాజా విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలపై పాల్గొన్న వైద్యులకు విస్తృత అవగాహన లభించింది. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన వైద్యులకు, అతిథులకు, నిర్వాహకులకు ప్రొఫెసర్ డా.బంగారి స్వామి కృతజ్ఞతలు తెలిపారు.





# రాజ్యాధికారంలో సముచిత వాటాకు కొట్లాడుదాం

**ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే దానం మున్నూరుకాపులకు పిలుపు**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాజ్యాధికారంలో సముచిత వాటా, న్యాయమైన హక్కుల సాధనకు మనమందరం మరింత ఐకమత్యంతో ముందుకు సాగుదామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితర ప్రముఖులు మున్నూరుకాపులకు పిలుపునిచ్చారు.హైదరాబాద్ కోకాపేటలో ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాలలో మున్నూరుకాపు టవర్స్ (ఆత్మగౌరవ భవనం) నిర్మాణానికి ఆదివారం ఉదయం భూమి పూజ ఘనంగా జరిగింది. ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే నాగేందర్ మాట్లాడుతూ,రాష్ట్ర జనాభాలో మున్నూరుకాపులం గణనీయమైన సంఖ్యలో ఉన్నామని చెప్పారు.తెలంగాణలో పట్వారీలుగా, పోలీస్ పటేల్స్,మాలి పటేల్స్‌గా సమాజానికి విశేష సేవలందించామని వివరించారు.ఇప్పుడు భూమి పూజ చేసుకున్న స్థలంలో మన ఆత్మగౌరవం మరింత పెంపొందేలా టవర్స్ గొప్పగా నిర్మించుకుందామని, ఇందుకుగాను భూరీ విరాళాలు అందజేయాల్సిందిగా దేశ, విదేశాలలో ఉన్న మున్నూరుకాపు, కాపు, బలిజ, తూర్పు కాపు,ఒంటరి కుల బంధువులు,శ్రేయోభిలాషులందరికి రవిచంద్ర, నాగేందర్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాధికారంలో సముచిత వాటా దక్కించుకునేందుకు, న్యాయమైన హక్కుల సాధనకు మనమంతా ఏకతాటిపై ముందుకు సాగుదామని ఎంపీ వద్ది రాజు, ఎమ్మెల్యే దానం పిలుపునిచ్చారు.

# 12న హిందూ ఏక్తా యాత్ర

**ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి యాత్రకు ఆహ్వానించండి**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు**

**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్‌లో ఈనెల 12న నిర్వహించే "హిందూ ఏక్తా యాత్ర"ను కనీవినీ ఎరగని రీతిలో దిగ్విజయవంతం చేసి మరోసారి చరిత్ర సృష్టిద్దామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ హిందూ ఏక్తా యాత్రకు చిన్నా, పెద్దా, ముసలి ముతకా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తరలివచ్చి హిందూ సంఘటిత శక్తిని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. యాత్రకు తరలివచ్చేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, వారికి తగిన రవాణా ఏర్పాట్లు చేసి యాత్రకు తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా ఏక్తా యాత్రపై మీడియా, సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. పార్టీ నాయకులంతా తమ తమ వార్డులు, గ్రామ, మండలాల్లో ఇంటింటికీ వెళ్లి వినూత్న రీతిలో బొట్టు పెట్టి ఏక్తా యాత్రకు రావాలని ప్రజలను ఆహ్వానించాలని సూచించారు. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేటర్లు, కంటెస్టెడ్ అభ్యర్థులు తమ తమ డివిజన్లలో భారీ ఎత్తున ప్రజలను ఏక్తా యాత్రలో పాల్గొనేలా భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న కరీంనగర్ లో నిర్వహించే "హిందూ ఏక్తా యాత్ర" ఏర్పాట్లు, జన సమీకరణపై ఈరోజు కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ లోని గాయత్రీనగర్ బ్యాంకెట్ హాలులో ఉదయం జిల్లా నాయకులతో, సాయంత్రం జ్యోతినగర్ లోని శ్రీ మహాశక్తి బాంక్వెట్ హాలులో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, కంటెస్టెడ్ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్టీ సీనియర్ నేతలు బాస సత్యనారాయణ, డి.శంకర్, కోమాల ఆంజనేయులు, గుగ్గిళ్ల రమేష్, నల్లాల ఒదేలు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
4 మే 2026

## భారీ భూకబ్జా మోసం వెలుగులోకి..



- గుట్టురట్టు చేసిన కీసర పోలీసులు
- ఖాళీ ప్లాట్లే టార్గెట్‌గా దందా

**మేడ్చల్ (జనంసాక్షి) :** మల్కాజిగిరి జిల్లాలో భారీ భూకబ్జా మోసం వెలుగులోకి వచ్చింది. అమాయక ప్రజల ఆస్తులే లక్ష్యంగా సాగుతున్న నకిలీ రిజిస్ట్రేషన్ల దందాను కీసర పోలీసులు రట్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే... కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న ప్లాట్లను టార్గెట్ చేసిన ఒక ముఠా ఏకంగా 1983 నాటి పాత డాక్యుమెంట్లను పోలిన నకిలీ సేల్ డీడ్లను సృష్టించింది. తప్పుడు లింక్ డాక్యుమెంట్లతో పక్కా ప్లాన్ ప్రకారం ఈ భూ దోపిడీకి తెరలేపింది. అసలు యజమానులకు తెలియకుండానే నకిలీ వ్యక్తులను యజమానులుగా చిత్రించి వరుసగా ఒకరి నుంచి ఒకరికి రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ దందాలో డాక్యుమెంట్ రైటర్లతో పాటు, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది హస్తం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకే ప్లాట్‌ను వేర్వేరు వ్యక్తులకు విక్రయించి లక్షలాది రూపాయలు వసూలు చేశారు. చివరకు జీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో అమాయక కొనుగోలుదారులను బురిడీ కొట్టించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కీసర పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ భారీ స్కామ్‌లో సంబంధం ఉన్న ఆరుగురు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుతం నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు? పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టే వారు అప్రమత్తంగా ఉండాలని, డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# మానవతా విజయానికి ప్రతీకగా అవయవాల శిబిరం

- గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- శిబిరంలో 745 మందికి 815 కృత్రిమ అవయవాలు పంపిణీ



హైదరాబాద్, మే 3 (జనంసాక్షి) : మానవతా విజయానికి ప్రతీకగా అవయవాల శిబిరం నిలుస్తోందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. దివ్యాంగుల జీవితాల్లో కొత్త ఆశలను నింపే మహత్తర సేవా కార్యక్రమంగా నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కృత్రిమ అవయవాల అమరిక శిబిరం హృదయాలను కదిలించింది. సంవత్సరాలుగా ఆగిపోయిన అడుగులు మళ్లీ కదలడం, చేతులు కోల్పోయిన వారు స్వయంగా నీళ్లు తాగడం వంటి భావోద్వేగ దృశ్యాలు అందరినీ కదిలించాయి. మేక్ ఎ ఛేంజ్ ఫౌండేషన్ (యూకే), శ్రీ స్వామినారాయణ ఆలయం, విలెస్‌డెన్ (యూకే) తదితర సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 745 మంది దివ్యాంగులకు 815 నారాయణ మాడ్యులర్ కృత్రిమ అవయవాలు, కాలిపర్లు ఉచితంగా అందజేశారు. కొందరికి ఒకటి కంటే ఎక్కువ అవయవాలు అమర్చారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని "మానవతకు నిలువెత్తు నిదర్శనం"గా గవర్నర్ అభివర్ణించారు. లబ్ధిదారులతో మమేకమై, పరేడ్‌ను వీక్షిస్తూ వారిని ప్రోత్సహించారు. "ఇక్కడ కనిపిస్తున్న దృశ్యాలు సేవా మహిమాన్వితాన్ని తెలియజేస్తున్నాయి. కరుణ, సామూహిక కృషి కలిసి అద్భుత ఫలితాలు సాధిస్తాయని ఇది నిరూపిస్తోంది" అని పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ నాయకత్వాన్ని గవర్నర్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ "ఇది కేవలం సేవ కాదు... జీవితాలను మార్చే యజ్ఞం" అని అన్నారు. దివ్యాంగులను సమాజ ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొంటూ, తన నియోజకవర్గంలో కూడా ఇలాంటి శిబిరం నిర్వహిస్తామని వెల్లడించారు. ముందస్తు ఎంపిక శిబిరంలో వెయ్యికి పైగా మంది నమోదు కాగా, అందులో 745 మందికి ఈ శిబిరంలో సేవలు అందించినట్లు ట్రస్టీ అండ్ డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా తెలిపారు. జర్మన్ సాంకేతికతతో రూపొందించిన ఆధునిక కృత్రిమ అవయవాలను అమర్చడమే కాకుండా, వాటి వినియోగం, నిర్వహణపై శిక్షణ కూడా అందించినట్లు వివరించారు. అనంతరం దాతలను సన్మానించారు. ఎమ్మెల్సీ బొగ్గుల దయానంద్ పాల్గొని సంస్థ సేవలను అభినందించారు. 1985లో కైలాస్ మానవ్ స్థాపించిన ఈ సంస్థ ఇప్పటివరకు 39 వేల మందికి పైగా దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయవాలు అందించగా, 4.5 లక్షలకు పైగా మందికి వైద్య సేవలు అందించింది.

## తెలంగాణలోనూ వికసిస్తాం

- దేశవ్యాప్తంగా పార్టీకి ఎనలేని ఆదరణ
- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనూ తమ పార్టీ అధికారంలోకి వస్తుందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా బీజేపీ జైత్రయాత్రను తెలంగాణలో విస్తరింపజేసి సుపరిపాలన అందించడమే మోడీ ఆశయమని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ ఢీల్లీ, బీహార్, హర్యానా, ఒరిస్సా వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయని, అస్సాం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో కూడా కమలం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అదే క్రమంలో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, ప్రజలు కూడా మార్పును కోరుకుంటున్నట్లు వెల్లడించారు. గత 12 ఏళ్ల మోడీ పాలనలో తెలంగాణ అభివృద్ధికి రూ. 12 లక్షల కోట్లు కేటాయించిందని, రాష్ట్రంలో అధికారంలో లేకపోయిన ఇక్కడ ప్రజల కోసం పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాదిరిగా కేవలం ధనవంతులకే ప్రాధాన్యత ఇచ్చే హైబ్రిడ్ మోడల్ విధానం బీజేపీది కాదన్నారు. ఒకప్పుడు తమపార్టీ ఉనికి ప్రశ్నించిన పార్టీలు నేడు పార్లమెంటు ఎన్నికల్లో సున్నా సీట్లకు పరిమితమయ్యాయని, బీజేపీ బలం పెరగడం చూసి పాలకులు భయపడతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కమలం ఎవరితోను పొత్తు పెట్టుకోదని, ఒంటరిగానే పోటీ చేసి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈపర్యటనలో భాగంగా మోడీ రూ. 7500 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని, ఈనెల 10న జరిగే సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

## బ్రెయిన్ ట్యూమర్‌ను జయించిన బాలిక

### ఆరెండ్ల కింద శరణ్యకు అండగా కేటీఆర్

- 6 ఏళ్ల క్రితం నాటి సాయం మరవని బాలిక
- పదో తరగతి పాసై కేటీఆర్‌ను కలిసిన శరణ్య



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కష్టాల్లో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడంలో తాను ఎప్పుడూ ముందుంటానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మరోసారి నిరూపించారు. ఆరు సంవత్సరాల క్రితం ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక చిన్నారికి ఆయన అందించిన సాయం, నేడు ఆ బాలిక జీవితంలో కొత్త వెలుగులు నింపింది. 2019లో ప్యారడైజ్ బాలంరాయ్‌కు చెందిన కె. నారాయణ, రాజేశ్వరి దంపతుల కుమార్తె శరణ్య బ్రెయిన్ ట్యూమర్ బారిన పడింది. ప్రైవేటు ఉద్యోగులుగా పనిచేసే వీరికి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం దాదాపు రూ. 20 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఆరోగ్యశ్రీలో చిన్నారి పేరు లేకపోవడంతో బసవతారకం ఆసుపత్రిలో అడ్మిషన్ దొరకక వారు వారం రోజుల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్లిష్ట సమయంలో శరణ్య చిన్నమ్మ పూజిత, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై కేటీఆర్ వెంటనే స్పందించి, తన బృందాన్ని రంగంలోకి దింపారు. ట్వీట్ చేసిన అరగంటలోనే రిప్లై రావడమే కాకుండా, మరుసటి రోజు ఆదివారం (సెలవు దినం) అయినప్పటికీ, కేటీఆర్ ఆదేశాలతో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

కేటీఆర్ చొరవతో శరణ్యకు అత్యంత ఖరీదైన వైద్యం పూర్తి ఉచితంగా చికిత్స లభించింది. చిన్నారి శరణ్యకు స్టంట్ వేయడంతో పాటు మేజర్ సర్జరీ నిర్వహించారు. సుమారు రూ. 3 లక్షలు ఖరీదైన రేడియేషన్ థెరపీని కూడా కేటీఆర్ స్వయంగా పర్యవేక్షించి ఉచితంగా చేయించారు. సర్జరీ నుంచి డిశ్చార్జ్ వరకు జరిగిన ప్రతి పరీక్ష ఖర్చులను కేటీఆర్ బృందమే భరించింది. "మేము ఒక్క రూపాయి కూడా ఆసుపత్రిలో ఖర్చు పెట్టలేదు" అని చిన్నారి తల్లి రాజేశ్వరి భావోద్వేగంతో తెలిపారు.

### నాటి సాయంతో నేడు కృతజ్ఞతలు

ప్రాణాపాయం నుంచి బయటపడిన శరణ్య, ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 384 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. తన ప్రాణాలు కాపాడిన కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలపాలన్న శరణ్య కోరిక మేరకు... నేడు ఆ కుటుంబం కేటీఆర్‌ను నంది నగర్ నివాసంలో కలిసింది. తమ బిడ్డను ఆరోగ్యవంతురాలిని చేయడమే కాకుండా, ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోకుండా చదువులో రాణించేలా ప్రోత్సహించిన కేటీఆర్‌కు శరణ్య తల్లిదండ్రులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చిన్నారి శరణ్య భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కేటీఆర్ ఆకాంక్షించారు.



### జొన్న, మొక్కజొన్న పంటలు

## అగ్నికి ఆహుతి

**ఆదిలాబాద్ (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు దాదాపు 100 ఎకరాలకు పైగా జొన్న, మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు దాదాపు 100 ఎకరాలకు పైగా ఉన్న జొన్న, మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు కాలిపోయింది. పంట పొలాలలో ఉన్న మోటార్లకు ఉన్న కేసింగ్ పైపులు, వైర్లు, పదుల సంఖ్యలో పైపులు కాలిపోవడంతో లక్షల్లో ఆస్థి నష్టం సంభవించిందని బాధిత రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ భూములలో ఉన్న పంటలు కాలిపోతున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రైతులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

# కండువా మార్చగానే అబద్దాలా?

### అబద్ధాలకు కేరాఫ్ తెలంగాణ భవన్

- రేవంత్ రెడ్డి పైన అక్కసుతోనే జీవన్ రెడ్డి వ్యాఖ్యలు
- నిరుద్యోగులపైన బీఆర్ఎస్ నేతలది కపట ప్రేమ
- ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** గులాబీ కండువా కప్పుకోగానే మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా అబద్దాలు మొదలు పెట్టారని, తెలంగాణ భవన్ అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ఆదివారం సీఎల్పీలోని మీడియా సెంటర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పైన అక్కసుతో జీవన్ రెడ్డి మాట్లాడుతున్నారని, ప్రజా పాలన పోవాలి, పాపాల భైరవుడు రావాలని జీవన్ రెడ్డి అంటున్నారు..పాపాల భైరవుడి పాలనను శాసనమండలిలో ఒంటరిగా ఎదుర్కొన్నానని జీవన్ రెడ్డే ఆనాడు మాట్లాడారని, ఎందుకు ప్రజా పాలన పోవాలో ఆయన జవాబు చెప్పాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సన్న బియ్యం గేమ్ ఛేంజర్ అని జీవన్ రెడ్డే కాంగ్రెస్ లో ఉన్నప్పుడు మాట్లాడారని, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందుకు ప్రజా పాలన పోవాలనా? అని ఆయన మండిపడ్డారు. జీవన్ రెడ్డి తెలంగాణ భవన్ కు వెళ్లగానే 17 ఉద్యోగాలే భర్తీ చేశామని అబద్దాలు చెపుతున్నారని, కాంగ్రెస్ లో ఉన్నని రోజులు జీవన్ రెడ్డి తమ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చిందని అనేక సార్లు చెప్పారని, ఆది శ్రీనివాస్ తెలిపారు. జీవో నెంబర్ 7 ను రద్దు చేయాలని జీవన్ రెడ్డి అంటున్నారని, కానీ, ఫీజు రీఎంబర్స్ మెంట్ ను కాలేజీ ఖాతాల్లోకి కాకుండా విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా వేయడమే జీవో నెంబర్ 7 ఉద్దేశం.. విద్యార్థులు, వాళ్ల తల్లిదండ్రులకు నేరుగా భరోసా ఇవ్వడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన వివరించారు. కాలేజీ యాజమాన్యాలకు అనుకూలంగా జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని, కాలేజీ యాజమాన్యాలు అవకతవకలకు పాల్పడకుండా ఉండటం కోసమే నేరుగా విద్యార్థుల ఎకౌంట్లలో ఫీజు రీఎంబర్స్ మెంట్ వేస్తున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. అధికారం పోయాక నిరుద్యోగులపైన బీఆర్ఎస్ నాయకులు కపట ప్రేమ చూపిస్తున్నారని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఆ తర్వాత మాట మార్చింది కేసీఆర్ అని, కల్వకుంట్ల కుటుంబంలో ఐదు ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను మాత్రం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నోటిఫికేషన్లు ఇవ్వలేదని, నోటిఫికేషన్లు ఇచ్చినా ప్రవేశ పరీక్షలు పెట్టలేదని, పరీక్షలు పెట్టినా పేపర్లు లీక్ చేశారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు ఉనికి కాపాడుకోవడం కోసమే పసలేని విమర్శలు చేస్తున్నారని, అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ లు కేటీఆర్, హరీష్ రావులు అని ఆయన ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం పకడ్బందీగా ఉద్యోగాలు చేపట్టిందని, ప్రజల ఆశీర్వాదం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకే ఉందని ఆది శ్రీనివాస్ అన్నారు.

## టీజీఆర్జేసీ సెట్ 2026 పరీక్షకు 77.77 శాతం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ గురుకుల జూనియర్ కాలేజీలు, ఎక్సలెన్స్ కేజీబీవీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీఆర్జేసీ సెట్ పరిక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 77.77 శాతం మంది హాజరయ్యారు. ఈ ఏడాది 35 గురుకులాలలు, 93 కేజీబీవీల్లో ప్రవేశాల కోసం మొత్తం 76,174 మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకోగా 59,244 (77.77 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో వచ్చే మెరిట్ ఆధారంగా ఆయా కాలేజీల్లో సీట్లు కేటాయించనున్నారు. టీజీఆర్జేసీ పరిక్ష రాసిన విద్యార్థినులకు ఒక్క ఎంట్రన్స్ టెస్ట్ రాస్తే మెరిట్ ఆధారంగా అటు గురుకులాల్లో, ఇటు కొత్తగా ఏర్పాటైన యంగ్ ఇండియా ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేజీబీవీల్లో సీటు పొందే అవకాశం దక్కింది. దినిపై తాజాగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ అధికారులతో చర్చించి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 93 కేజీబీవీలను ప్రభుత్వం యంగ్ ఇండియా ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గా మార్చింది. ఈ సంస్థల్లో అడ్మిషన్ పొందిన వారికి రెగ్యులర్ ఇంటర్ తో పాటు, ఐఐటీ, జేఈఈ, నీట్, ఈఏపీసెట్, క్లాట్ వంటి జాతీయ స్థాయి పోటీపరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు.





## నిశ్చితార్థ, పెండ్లి వేడుకలకు భట్టి హాజరు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె జనని బండ్ల, శ్రీ సూర్యతేజాల నిశ్చితార్థ వేడుకకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఈ వేడుకలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారితోపాటు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

అలాగే హైదరాబాద్ మన్నేగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ కుమారుడు డాక్టర్ యశ్వంత్ వివాహ వేడుకకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రితోపాటు మంత్రులు శ్రీ శ్రీధర్ బాబు,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు ఉన్నారు

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370